RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

హైదరాబాద్ 17 మే 2026 ఆదివారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:294

Cell: 9292104449 / 9848384973

SRAVANTHI Enterprises

OFFSET PRINTERS



We undertake Printing of Daily News Papers

## పోక్సో కేసులో లొంగిపోయిన బండి భగీరథ్..



హైదరాబాద్: పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి సాయి భగీరథ్ ఎట్టకేలకు పోలీసుల ఎదుట లొంగిపోయారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ తన కుమారుడు భగీరథ్‌ను అడ్వకేట్ల సమక్షంలో పోలీసులకు అప్పగించారు. చట్టం మీద గౌరవంతోనే భగీరథ్‌ను పోలీసులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమే.. చట్టానికి అందరూ లోబడి ఉండాల్సిందే అని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ..'నా కుమారుడు భగీరథ్‌పై పోక్సో కేసు ఆరోపణలు వచ్చాయి. చట్టాలపై ఉన్న గౌరవంతో అడ్వకేట్ల ద్వారా పోలీసుల విచారణకు అప్పగించాను. నేను ఇంతకు ముందే చెప్పా.. చట్టం ముందు నా బిడ్డ అయినా, సామాన్యుడైనా సమానమే. అందరం చట్టాలకి లోబడి ఉండాల్సిందే. మా అబ్బాయి ఏ తప్పు చేయలేదని పదేపదే చెబుతున్నాడు. వాస్తవానికి ఫిర్యాదు రాగానే స్టేషన్‌లో అప్పగిద్దామని అనుకున్నా. లాయర్లను సంప్రదించి మా వద్ద ఉన్న ఆధారాలను నా కుమారుడు వారి ముందుంచాడు.వాటిని చూసి కేసు కొట్టేస్తారని.. బెయిల్ తప్పకుండా వస్తుందని లాయర్లు చెప్పారు. అందుకే కొంత జాప్యం జరిగింది. ఈరోజు కూడా బెయిల్ వస్తుందనే లాయర్లు చెబుతున్నారు. అయితే ఇంకా జాప్యం చేయడం సరికాదని అనుకున్నా. ఆ ఉద్దేశంతో మా అబ్బాయిని తీసుకొచ్చి లాయర్ల ద్వారా విచారణ కోసం అప్పగించాను. న్యాయ వ్యవస్థపై సంపూర్ణమైన నమ్మకం ఉంది. సోమవారం నాడు కోర్టు ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉన్నప్పటికీ.. న్యాయ వ్యవస్థపై ఉన్న గౌరవంతో ఇంకా ఆలస్యం కావొద్దని విచారణకు అప్పగించా' అని తెలిపారు.

# ఇందిరమ్మ ఇండ్లకు కేంద్రవాటా కోసం ఎదురు చూస్తున్నాం

**కేంద్రం ఇవ్వకపోతే మేమే భరిస్తాం**

**15-20 రోజుల తర్వాత ఇండ్లకు ఆపిన మొత్తాన్ని విడుదల చేస్తాం**

**జూన్ 2న రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు మంజూరు ప్రారంభం**

**ఈనెల చివరిలోగా భూముల ధరల సవరణ**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ పొందిన ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద కేంద్ర ప్రభుత్వ వాటాగా రావలసిన నిధుల కోసం ఈ ఏడాది మార్చి నుంచి ఎదురుచూస్తున్నామని, కేంద్రం ఒక్కో ఇంటికి సుమారు 1లక్షా13 వేల రూపాయిల వాటా విడుదల కావాల్సి ఉందని కేంద్రం నుంచి నిధుల వస్తాయన్న నమ్మకంతో ఇందిరమ్మ లబ్దిదారులకు ఫైనల్ బిల్ ఆపడం జరిగిందని రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు.

మిగతా 2లో

## నీట్ పేపర్ లీకేజీ కేసులో సూత్రధారి అరెస్ట్.. పుణేలో సీబీఐ అదుపులోకి



దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న పీవీ కులకర్ణిని సీబీఐ అధికారులు పుణేలో అరెస్ట్ చేశారు. రసాయన శాస్త్ర లెక్చరర్‌గా పనిచేస్తున్న కులకర్ణి, జాతీయ పరీక్ష సంస్థ (ఎన్‌టీఏ) తరఫున ప్రశ్నాపత్రాలు రూపొందించే బృందంలో సభ్యుడిగా ఉన్నట్లు దర్యాప్తులో వెల్లడైంది.

# ఈనెల 21 వ తేదీ నుండి జూన్ 1 వరకు సరస్వతీ నది అంత్య పుష్కరాలు

**దాదాపు 40 లక్షల మంది హాజరవుతారని అంచనా**

**మొదటి రోజు శ్రీ జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ స్వామి, రాష్ట్ర గవర్నర్ ల పుణ్య స్నానాలు**

**సచివాలయంలో ఏర్పాట్లను సమీక్షించిన మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్ బాబు, సి.ఎస్ రామకృష్ణారావు**

వార్తా 2 లో



# 2027 డిసెంబర్ మాసాంతానికి దేవాదుల ఎత్తిపోతల పథకం(జే. సి.ఆర్ .డి.ఎల్.ఐ. ఎస్)పూర్తి

**38.16 టి.యం.సి లతో 10 జిల్లాలోని 5.57 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు**

**6,016 కోట్ల అంచనాతో ప్రారంభమైన ప్రాజెక్టుకు సవరించిన అంచనాలతో పెరిగిన మొత్తం 18,400 కోట్లు**

**ఇప్పటి వరకు ప్రాజెక్టుకు పెట్టిన ఖర్చు 14,422 కోట్లు**

**మరో 3,978 కోట్ల తో ప్రాజెక్టును పూర్తి చేసేందుకు నిర్ణయం**

**ఇప్పటికే 87.70 శాతం పనులు పూర్తి**

**-మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**



రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్న దేవాదుల ఎత్తిపోతల పథకం(జే. సి.ఆర్ .డి.ఎల్.ఐ. ఎస్)

2027 డిసెంబర్ మాసాంతానికి పూర్తి చేసేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేసినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. 38.16 టి.యం.సి ల నీటితో హనుమకొండ వరంగల్,జనగామ,యాదాద్రి భోనగిరి, సూర్యాపేట,సిద్దిపేట, మహబూబాబాద్, ములుగు,జయశంకర్ భూపాలపల్లి జిల్లాలతో పాటు కరీంనగర్ జిల్లాలకు చెందిన 5.57 లక్షల ఎకరాలకు సమృద్ధిగా సాగునీరు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రాధాన్యత క్రమంలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించిన విషయం విదితమే.

అందులో అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకం(జే. సి.ఆర్ .డి.ఎల్.ఐ. ఎస్)

ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ప్రభుత్వం రూట్ మ్యాప్ రూపొందించి పనులలో వేగాన్ని పెంచింది.

మిగతా 3 లో

# ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికపై జిల్లా కలెక్టర్లతో సిఎస్ టెలీకాన్ఫరెన్స్



ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ఈనెల 18 తేదీ నుండి 23వ తేదీ వరకు నిర్వహించే యువజన, క్రీడా, పర్యాటక వారోత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్రప్రభుత్వప్రధానకార్యదర్శి కె.రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మే 18 నుండి 23 వ తేదీ వరకు నిర్వహించే కార్యక్రమాల నిర్వహణపై స్పెషల్ సిఎస్ లు జయేష్ రంజన్, వాణి ప్రసాద్ లతో కలసి శనివారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివా లయం నుండి జిల్లా కలెక్టర్లతో టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లా డుతూ, యువతలో క్రీడా స్ఫూర్తి, దేహదా రుఢ్యం, సామాజిక చైతన్యం, ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేందుకై ఈ కార్యక్రమాలను చేపట్టినట్టు తెలిపారు. అదేవిధంగా పర్యాటక ప్రాంతాలపై ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్యం కల్పించాలని, పర్యాటక ప్రాంతాలను ప్రజలు సందర్శించేలా తగు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రధానంగా స్పోర్ట్స్ కార్యక్రమాలను రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో నిర్వహించాలన్నారు. ప్రతీ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు, యువజన సంఘాలను భాగస్వామ్యం చేయాలన్నారు. ఈనెల 18న నిర్వహించే 'ఫిట్- తెలంగాణా థీమ్ తో రాష్ట్ర , జిల్లా కేంద్రాలలో 5ఖ రన్, అదేవిధంగా అన్ని మండల కేంద్రాలలో వ్యాకథాన్, యోగ తదితర కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. తెలంగాణలో పర్యాటక రంగానికి ఉన్న అపారమైన అవకాశాలను ప్రపంచానికి చాటి చెప్పేందుకు ఈ వారోత్సవాలు దోహదపడతాయని, దీనిలో భాగంగా ఈ వారం రోజులు రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని అన్ని మ్యూజియంలలో ఉచిత ప్రవేశం కల్పించనున్నట్టు వెల్లడించారు.

**ధాన్యం కొనుగోళ్లపై సమీక్ష:** అదేవిధంగా జిల్లాల్లో కొనసాగుతున్నధాన్యం కొనుగోళ్లపై కూడా జిల్లా కలెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గౌరవ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లలో ఎక్కడ జాప్యం లేకుండా, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్లను ఆదేశించారు.

## ఈసారి ముందే రుతుపవనాలు.. కానీ 'ఎల్ నినో' గండం!

ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు కాస్త ముందుగానే దేశంలోకి ప్రవేశించనున్నాయి. సాధారణంగా జూన్ 1న కేరళను తాకే రుతుపవనాలు, ఈసారి మే 26నే తీరాన్ని పలకరించనున్నాయని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఇటీవల ప్రకటించింది. మే 28 నాటికి పశ్చిమ తీరంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. అయితే, ఈ సానుకూల వార్తతో పాటే ఓ ఆందోళనకరమైన అంశం కూడా ఉంది. ఎల్ నినో ప్రభావంతో ఈ సీజన్‌లో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



కేరళ కు వెళ్లి అక్కడ సీనియర్ నాయకులు రమేష్ చెన్నితల గారితో సమావేశమై ఆయనను అభినందించిన ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు,

ప్రజాబలం

17 మే 2026 ఆదివారం

# డాలర్ స్థానంలో బ్రిక్స్ ...

ప్రపంచ రాజకీయాల్లో ఇప్పుడు కొత్త రకమైన 'క్యూ' కనిపిస్తోంది. ఒకప్పుడు అమెరికా డాలర్ కనిపిస్తే చాలు జోహార్లు అర్పించిన దేశాలన్నీ, ఇప్పుడు 'మాకు ఈ డాలర్ వద్దు.. బ్రిక్స్ దోస్తీ ముద్దు' అంటూ ఆ దేశాల కూటమి ముందు క్యూ కడుతున్నాయి. ఐఎంఎఫ్ తాజాగా విడుదల చేసిన ఏప్రిల్, 2026 గణాంకాలను చూస్తుంటే, ఇది కేవలం ఒక కూటమిలా కాకుండా.. అమెరికా, యూరప్ దేశాలకు నిద్రలేకుండా చేసే ఒక 'ప్రత్యామ్నాయ ప్రపంచం'లా కనిపిస్తోంది. చైనా భారీ జీడీపీ నుంచి మొదలుకొని, పాలస్తీనా వంటి చిన్న దేశాల వరకు అందరూ ఈ క్లబ్‌లో మెంబర్‌షిప్ కోసం తహతహలాడుతుండటం చూస్తుంటే.. భవిష్యత్తులో వైట్ హౌస్ కంటే 'బ్రిక్స్' ఆఫీసు ముందే రద్దీ ఎక్కువగా ఉండేలా కనిపిస్తోంది. బ్రిక్స్ సభ్య దేశాల జీడీపీ లెక్కలు చూస్తుంటే, చైనా ఏకంగా వి20.85 ట్రిలియన్లతో అందనంత ఎత్తులో కూర్చుంది. దానికి పోటీగా భారతదేశం కూడా వి4.15 ట్రిలియన్లతో తన సత్తా చాటుతోంది. ఈ రెండు దేశాలు కలిస్తేనే ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో సగానికి పైగా వాటా ఉండేలా ఉంది. బ్రెజిల్, రష్యా కూడా చెరో రెండున్నర ట్రిలియన్లతో తమ ఉనికిని చాటుకుంటున్నాయి. ఇక్కడ ఒక వింత ఉంది.. ఒకవైపు రష్యాపై ఇన్ని ఆంక్షలు ఉన్నా, దాని జీడీపీ మాత్రం నిలకడగా ఉండటం పాశ్చాత్య దేశాలకు మింగుడుపడని నిజం. సంక్షేమ పథకాలు, అప్పులతో కుస్తీ పడుతున్న దక్షిణాఫ్రికా, ఈజిప్ట్ వంటి దేశాలు కూడా ఈ భారీ ఇంజన్ల అండ చూసుకునే ధైర్యంగా అడుగులు వేస్తున్నాయి. ఈ జాబితాలో ఇండోనేషియా (వి1.54 ట్రిలియన్) వంటి బలమైన ఆర్థిక వ్యవస్థలు పూర్తి సభ్యులుగా మారుతుంటే, పాకిస్థాన్ (వి410 బిలియన్), శ్రీలంక (వి98 బిలియన్) వంటి దేశాలు మాత్రం దరఖాస్తు పట్టుకొని దీనంగా ఎదురుచూస్తున్నాయి. పాకిస్థాన్ పరిస్థితి చూస్తుంటే.. 'సభ్యత్వం ఇస్తే ఇయ్యండి కానీ, ముందు ఏవైనా లోన్లు ఉంటే చూడండి' అని అడిగేలా ఉంది. అప్పుల ఊబిలో ఉన్న దేశాలన్నీ బ్రిక్స్‌ను ఒక 'ఏటీఎం'లా చూస్తుంటే, అసలు సభ్య దేశాలు మాత్రం దీన్ని ఒక 'పొలిటికల్ వెపన్' (రాజకీయ ఆయుధం)లా వాడుకోవాలని ప్లాన్ చేస్తున్నాయి. ఇక సౌదీ అరేబియా లాంటి ధనిక దేశాలు కూడా చేరితే, బ్రిక్స్ దగ్గర ఆయిల్ కు, డబ్బుకు అస్సలు కొదవ ఉండదు. నైజీరియా నుంచి వియత్నాం వరకు దాదాపు 10 దేశాలు భాగస్వామ్య హోదాలో ఉంటూ లోపలికి రావడానికి గేట్ల దగ్గర వేచి చూస్తున్నాయి. వియత్నాం (వి527 బిలియన్), మలేషియా (వి516 బిలియన్) వంటి ఆగ్నేయాసియా పులులు ఈ కూటమిలో చేరితే, ఇక ఆసియా ఖండం మొత్తం బ్రిక్స్ గుప్పిట్లోకి వెళ్లడం ఖాయం. ఒకప్పుడు అభివృద్ధి చెందిన దేశాల జీ-7 (ఉ7) గ్రూపును చూసి భయపడిన ప్రపంచం, ఇప్పుడు బ్రిక్స్ ప్లస్ (బ్రిక్స్+) వైపు ఆశగా చూస్తోంది. ఈ కూటమిలో డేటా లేని క్యూబా, సిరియా వంటి దేశాలు కూడా ఉన్నాయంటే, ఇక్కడ ఆర్థిక స్థితి కంటే 'అమెరికా వ్యతిరేకత' అనే గూడు పుఠాణీనే ఎక్కువగా పనిచేస్తున్నట్లు కనిపిస్తోంది. చిన్న దేశాల 'పెద్ద' కలలు కేవలం వి3.49 బిలియన్ల జీడీపీ ఉన్న సెంట్రల్ ఆఫ్రికన్ రిపబ్లిక్ నుంచి, అంతర్యుద్ధాలతో అల్లాడుతున్న ఆఫ్ఘనిస్తాన్ వరకు అందరూ ఈ జాబితాలో ఉన్నారు. వీరందరికీ బ్రిక్స్ లో చేరడం అంటే ఏదో మంత్రదండం దొరికినట్లే అన్నంత ఆశ ఉంది. చైనా ఇచ్చే పెట్టుబడులు, భారత్ ఇచ్చే సాంకేతికత తమ దేశాలను మార్చేస్తాయని వారు నమ్ముతున్నారు. అయితే, ఇంత మంది ఒకే గూటి కింద చేరితే.. ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చుతాయా? లేక ఇది కేవలం ఫోటో షూట్లకే పరిమితం అవుతుందా? అన్నది భవిష్యత్తు తేల్చాలి. మొత్తానికి, బ్రిక్స్ విస్తరణ చూస్తుంటే.. 'డబ్బు ఉన్నవాడు, అప్పు ఉన్నవాడు, యుద్ధం చేస్తున్నవాడు.. అందరూ కలిశారు. ఇక డాలర్ గారే జాగ్రత్తగా ఉండాలి' అనిపిస్తోంది. ఐఎంఎఫ్ రిపోర్ట్ ప్రకారం ఈ కూటమి ఇలాగే పెరిగితే, ఇక ప్రపంచం ఢిల్లీ-బీజింగ్ చుట్టూ తిరగడం ఖాయం!

# ఇందిరమ్మ ఇండ్లకు కేంద్రవాటా కోసం ఎదురు చూస్తున్నాం

## మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ఇప్పటి వరకు కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతానికి ఒక ఇల్లు కూడా మంజూరు కాలేదని తెలిపారు.

శనివారం నాడు తన ఛాంబర్‌లో మీడియాతో చిట్ చాట్ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధుల కోసం పలుమార్లు గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిగారితో పాటు తాను కూడా ప్రాతినిధ్యం చేశామని చెప్పారు. ఆ నిధుల విడుదల కోసం ప్రయత్నిస్తూ మరోవైపు ప్రస్తుతం పూర్తయిన ఒక్కో ఇంటికి 1.60 లక్షల రూపాయిలను తాత్కాలికంగా ఆపామని , ఒకవేళ కేంద్రం మరో 15-20 రోజుల్లోగా విడుదల చేయకపోతే రాష్ట్ర ప్రభుత్వమే భరించి లబ్ధిదారులకు నిధులు అందజేస్తుందని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో తొలివిడత మూడున్నర లక్షలకు పైగా ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా ఇంతవరకు సుమారు 1.32 లక్షల ఇండ్లు పూర్తయ్యాయని, జూన్ నెలాఖరుకల్లా 68-72 వేల ఇండ్లు శ్లాబ్‌ల నిర్మాణం పూర్తవుతుందన్నారు.

రెండవ విడత ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పథకాన్ని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు జూన్ 2న ఆదిలాబాద్‌లో ప్రారంభిస్తారని తెలిపారు. 2వ విడత మంజూరులో వివిధ రకాల వెసులుబాట్లను కల్పిస్తామని అన్నారు. గోడలు, బేస్‌మెంట్ లెవెల్, శ్లాబ్ వరకు ఉన్న గోడలు, శ్లాబ్ లేని ఇండ్లకు కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో ఒక్కో నియోజకవర్గానికి ఎన్ని ఇండ్లు మంజూరు చేయాలనే అంశాన్ని కూడా ఈనెల 21న క్యాబినెట్‌లో చర్చించి ప్రకటిస్తామని మంత్రి పొంగులేటి తెలిపారు.

గత 25 రోజులుగా రాష్ట్రంలో ఉమ్మడి జిల్లాల పరిధిలో రెవెన్యూ, హౌసింగ్, స్టాంప్స్ ఉ రిజిస్ట్రేషన్ , సర్వే అంశాలపై విస్తృతంగా చర్చించాం. ప్రజా ప్రతినిధుల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరించి కొన్ని విషయాలపై అక్కడికక్కడే నిర్ణయాలు తీసుకొని పరిష్కరించాం.

ఈ సారి ప్రత్యేకంగా కలెక్టర్లు లేదా అదనపు కలెక్టర్లు, డిఎఫ్ఓలను సమావేశపరిచి రెవెన్యూ, అటవీ భూముల సరిహద్దులపై చర్చించి రోవర్ల సాయంతో సరిహద్దుల గుర్తింపుపై ఒక అవగాహన కల్పించాం. సరిహద్దులను కచ్చితంగా ఖరారు చేసేలా ఆదేశించాం. 1/70 సమస్యపై కూడా చర్చించాం. రాష్ట్రంలో కొన్ని దశాబ్దాల నుంచి రెవెన్యూ ఫారెస్ట్ మధ్య భూ సరిహద్దు వివాదాలు ఉన్నాయని వీటి పరిష్కారానికి జయింట్ సర్వే నిర్వహించి శాశ్వ పరిష్కారం చూపబోతామన్నారు.

రాష్ట్రంలో ప్రతి జిల్లాలో 70 రెవెన్యూ గ్రామాలను గుర్తించి సమగ్ర సర్వే కార్యక్రమం చేపడతాం. రిజిస్ట్రేషన్ల సమయంలో సర్వర్ల డౌన్ అంశంపై దృష్టి సారించి కొత్త సాఫ్ట్ వేర్ ఏర్పాటుకు టెండర్లు పిలిచాం. సుమారు 14.08 కోట్లతో టెండర్ ఖరారు అయింది. మరో 3-4 నెలల్లో ఈ సమస్య తీరుతుంది.

గత ప్రభుత్వహయాంలో అసంపూర్తిగా ఉండిపోయిన 2బిహెచ్‌కే ఇండ్లకు సంబంధించి పాతరేట్లతో పూర్తి చేసేలా కాంట్రాక్టర్లను కోరాం. అత్యధిక శాతం ఈ పనుల పూర్తికి ముందుకు రానందున లబ్ధిదారులను ఎంపిక చేసి వారికే మిగిలిన మొత్తాన్ని ఇస్తూ వారిచేతనే పూర్తిచేయించేలా నిర్ణయించాం. ఈమేరకు ఈనెలాఖరులోగా ఇటువంటి ఇండ్లను గుర్తించేలా కలెక్టర్లకు ఆదేశాలిచ్చాం.

పలు ప్రాంతాల్లో పదికిపైగా ఇండ్లు కలిగిన టవర్లను గుర్తించి వాటికి పాలకవర్గాన్ని ఏర్పాటు చేస్తూ, వాటి దిగువ కమర్షియల్ షాపులను లీజుకు బదులు పూర్తిగా బహిరంగ వేలంలో విక్రయించి ఆ మొత్తాన్ని ప్రభుత్వ ప్రాతినిధ్యం కలిగిన పాలక వర్గం ఎకౌంట్‌లో వేయాలని నిర్ణయించాం.

రాష్ట్రంలో భూముల ధరలను సవరించాలని కొన్ని ప్రాంతాల వాస్తవ ధరలతో పోలిస్తే భారీగా హెచ్చుతగ్గులున్న భూముల ధరలను క్రమబద్ధీకరించాలని ఇటీవల జరిగిన క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవడం జరిగింది.

దీనికి అనుగుణంగా ఈనెల చివరిలోగా భూముల ధరలను సవరించి అమలులోకి తీసుకువస్తామని వెల్లడించారు.

బిఆర్ఎస్ ప్రభుత్వంలో 2022 సంవత్సరంలో ఆరునెలలు తిరగకుండానే రెండు సార్లు భూముల ధరలను అశాస్త్రీయ పద్ధతిలో పెంచారని అన్నారు.

ఆర్థిక నిపుణులైన అరవింద్ సుబ్రహ్మణ్యం గారి సలహాలు, సూచనల మేరకు శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించి భూముల ధరలను సవరిస్తున్నామని వెల్లడించారు.

గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల ముందు సుమారు 38 వేల ఇండ్లకు లబ్ధిదారులను ఖరారు చేసింది. తర్వాత ఏడాది పాటు సైంటిఫిక్ సర్వే నిర్వహించగా వీరిలో సుమారు 16వేల మంది అసలు ఆ ఇండ్లలో దిగలేదని తేలింది. హైదరాబాద్ వంటి ప్రాంతాల్లో ఉంటూ రోజూ సుమారు 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించలేని పేదలకు వారు ఉన్న ప్రాంతాలకు సమీపంలోనే ఇండ్లను కేటాయించాలని నిర్ణయించాం. అర్హులను ఎంపిక చేసి యుద్ధ ప్రాతిపదికన కేటాయించి మౌలిక సదుపాయాలు కల్పిస్తాం. జిహెచ్ ఎంసీ పరిధిలో మూడు కార్పోరేషన్లలో పేదలకు ఇండ్ల సౌకర్యం కల్పిస్తాం.

ఒకే స్థలంలో అన్నదమ్ములు ఇందిరమ్మ ఇండ్లను వన్ ప్లస్ వన్ పద్ధతిలో కట్టుకునే అవకాశాలను పరిశీలిస్తున్నాం. సుమారు 40-50 ఏళ్ల క్రితం కట్టిన వాంబే,ఎన్ ఆర్ జే ఎ ఎం ఎస్ తదితర కాలనీల్లో ఇండ్లు కూలిపోయే స్థితికి చేరుకుంటున్నాయి. వాటి స్థానంలో కూడా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేసేందుకు పరిశీలిస్తున్నాం.

ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి లబ్దిదారులు స్థానికంగా ఇసుకను ఉచితంగా పొందేలా, ఎర్త్ ఫిల్లింగ్ కుకూడా మట్టిని పొందేలా అవకాశం ఇవ్వాలని, ఎటువంటి అభ్యంతరాలు తెలుపకూడదని అధికారులను ఆదేశించాం.

గతంలో ప్రైవేటు భూములను సేకరించి ఇండ్ల నిర్మాణానికి లేఅవుట్‌లు వేశారు. వాటిలో కొన్ని ఖాళీలు ఉన్నాయి, మరికొన్ని చోట్ల కబ్జాకు గురయ్యాయి. ధరణి కారణంగా గతంలో భూమి అమ్మిన వ్యక్తి పేరిటే మళ్లీ సదరు భూమి ఉన్నట్లు రావడంతో సమస్యలు మొదలయ్యాయి. ఇటువంటి అంశాలపై సమగ్రనివేదిక ఇవ్వాలని కలెక్టర్లను ఆదేశించాం. కబ్జాదారులను , ప్రభుత్వ భూమిని వదిలే ప్రసక్తే లేదు. అవసరమైన చోట ప్రభుత్వ భూములకు ప్రహారీతో రక్షణ కల్పిస్తాం.

పాలేరు నియోజకవర్గాన్ని 20 వేల ఓటర్ల చొప్పున 14 క్లస్టర్‌లుగా విభజించి ఇప్పటి వరకు 13 ప్రాంతాలలో ప్రజా దర్బార్ నిర్వహించాం. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తుల్లో అత్యధికంగా 52 శాతం ఇందిరమ్మ ఇండ్ల కోసమే ఉన్నాయి. తర్వాత స్థానంలో ధరణి వల్ల ఏర్పడిన భూ సమస్యలు,ఆసరా పెన్షన్లు, గృహలక్ష్మి, గ్యాస్ సబ్సిడీ, రేషన్ కార్డులలో కుటుంబీకుల పేర్ల చేర్పు వంటివి ప్రాధాన్యతా క్రమంలో ఉన్నాయన్నారు. ఆసరా పెన్షన్ల విషయంలో ప్రభుత్వం కచ్చితమైన నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు.

# ఈనెల 21 వ తేదీ నుండి జూన్ 1 వరకు సరస్వతీ నదీ అంత్య పుష్కరాలు



ఈనెల 21 వ తేదీన కాళేశ్వరంలో ప్రారంభం కానున్న సరస్వతీ అంత్య పుష్కరాలకు దాదాపు 40 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేసినందున, ఈ పుష్కరాలకు హాజరయ్యేవారికి ఏవిధమైన ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లను చేపడుతున్నట్లు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు లు తెలిపారు. సరస్వతీ అంత్య పుష్కరాలఏర్పాట్లపైనేడు డా.బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది.

రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి నవీన్ మిట్టల్, మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామ చంద్రన్, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ ముకుంద్ రెడ్డి, ఐ.జి చంద్ర శేఖర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా రాష్ట్ర పరిశ్రమలు, ఐ.టి శాఖ మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, మే 21 వ తేదీ ఉదయం 5.43 గంటలకు కంచి కామకోటి పీఠం స్వామి జగద్గురు శ్రీ శంకర విజయేంద్ర సరస్వతీ పుణ్య స్నానం ఆచరించి సరస్వతీ అంత్య పుష్కరాలను ప్రారంభిస్తారని వెల్లడించారు. ఈసారి దాదాపు 30 నుండి 40 లక్షల మంది ఈ అంత్య పుష్కరాలకు హాజరయ్యే అవకాశం ఉందని, వారికి ఏవిధమైన ఇబ్బందులు కలుగకుండా అన్ని ప్రభుత్వ శాఖలు సమన్వయంతో తగు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.

ప్రధానంగా కాళేశ్వరం ఆలయంలో దర్శనాలు, పుష్కర స్నానాలకు వచ్చే వివిధ పీఠాధిపతులకు తగు ఏర్పాట్లు, పుష్కర ఘాట్ ల వద్ద పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ, ఇటీవల విజయవంతంగా నిర్వహించిన మేడారం జాతర స్ఫూర్తితో సరస్వతి అంత్య పుష్కరాలను విజయవంతంగా నిర్వహించాలని అన్నారు. ప్రతీ రోజూ ఒక ప్రముఖ పీఠం స్వామిజి ఈ పుష్కారాల్లో పాల్గొని పుణ్య స్నానం చేస్తారని, ఉదయం హోమాల నిర్వహణ, సాయంత్రం పెద్ద ఎత్తున సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని వెల్లడించారు.

ఈ అంత్య పుష్కరాల అనుభవాలు రానున్న గోదావరి పుష్కరాలకు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణ రావు మాట్లాడుతూ, ఈ అంత్య పుష్కరాలకు విస్తృతమైన మౌలిక సౌకర్యాలను ఏర్పాటు చేసినందున పెద్ద సంఖ్యలో యాత్రికులు హాజరయ్యే అవకాశమున్నందున శానిటేషన్, ట్రాఫిక్, ప్రోటోకాల్, రవాణా, తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్ మాట్లాడుతూ, 2012 లో జరిగిన సరస్వతి పుష్కరాలకు కేవలం 2 లక్షల మంది మాత్రమే హాజరవగా, గత సంవత్సరం జరిగిన ఆది పుష్కరాలకు దాదాపు 40 లక్షల మంది హాజరయ్యారని వెల్లడించారు. ఈ అంత్య పుష్కరాలలో ప్రతి రోజు హోమాలు, ఘాట్ వద్ద హారతి, సాంస్కృతిక కార్యక్రమాలు, తెప్పోత్సవం నిర్వహణతో పాటు పెద్ద పిండ ప్రదానాలు జరుగుతాయని అన్నారు. మొదటి రోజుకంచిస్వామిజీతోపాటురాష్ట్ర గవర్నర్ గారు కూడా పుణ్య స్నాలకుహాజరవుతారని అన్నారు. ఈసారి ప్రత్యేకంగా ఒక మ్యూజియం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంత రావు మాట్లాడుతూ, అతిథి గృహాలు, 100 గదుల చౌల్ట్రీ, ఘాట్ వద్ద టెంట్ హౌస్ ల ఏర్పాటు, ప్రముఖులకు ఆహ్వానాలు, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ ఏర్పాటు, నిరంతర విద్యుత్ సరఫరా ఏర్పాట్లకు రెవెన్యూ శాఖ సమన్వయం చేపడుతోందని అన్నారు. రవాణా శాఖ తాత్కాలిక బస్ స్టేషన్లు ఏర్పాటు చేయడం, షటిల్ బస్సులు నడపడం, రవాణా సేవలు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టిందన్నారు. తాగునీరు, పారిశుధ్య నిర్వహణ, తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణం, నిర్వహణ, ఘన వ్యర్థాల తొలగింపు వంటి ఏర్పాట్లు గ్రామీణ నీటి సరఫరా శాఖ చేస్తుందని అన్నారు. అలాగే, వైద్య ఆరోగ్య శాఖ 12 రోజుల పాటు వైద్య శిబిరాలు, అంబులెన్సులు, మందులు, అత్యవసర బృందాలను ఏర్పాటు చేస్తుందని, పోలీసు శాఖ తగిన పార్కింగ్ ఏర్పాట్లు, పార్కింగ్ స్థలాల గుర్తింపు, రూట్ మ్యాపులు, లేఅవుట్ తయారీ, వాచ్ టవర్లు, సీసీటీవీ పర్యవేక్షణ, వాకీటాకీలు, మొబైల్ కనెక్టివిటీ, సూచిక బోర్డులు, భద్రతా ఏర్పాట్లు చేపట్టిందని పేర్కొన్నారు. ఈసమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామ చంద్రన్, జెన్ కో ఎండి హరీష్, భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహా రెడ్డి, భూపాల పల్లి ఎస్. పి, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకురావడంలో జర్నలిస్టుల పాత్రకీలకమైనది

## జిల్లాలోని జర్నలిస్టులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాను.

## వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

ప్రజాబలం ప్రతినిధి హనుమకొండ జిల్లా మే16:వరంగల్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, హనుమకొండ జిల్లాలోని పనిచేసే జర్నలిస్టులకు తాను ఎల్లప్పుడూ పూర్తి మద్దతును అందిస్తానని పేర్కొన్నారు.శనివారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో జరిగిన TUWJ (IJU) సర్వసభ్య సమావేశానికి కూడా చైర్మన్ ఇనాగల వెంకట్రామిరెడ్డితో కలిసి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ,ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఉద్ఘాటించారు. ప్రజా సమస్యలను నిర్భయంగా వెలుగులోకి తీసుకురావడం, సమాజానికి సరైన దిశానిర్దేశం చేయడం అనే






బాధ్యతను జర్నలిస్టులు భుజాన వేసుకుంటారని ఆయన అన్నారు. అనేక కష్టాలు,సవాళ్లను ఎదుర్కొంటూనే ప్రజలకు సేవలందిస్తున్న పనిచేసే జర్నలిస్టుల సంక్షేమానికి ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, ఆరోగ్య భద్రత,గృహనిర్మాణ స్థలాలు (ప్లాట్లు),అక్రిడిటేషన్ వంటి అంశాలకు సంబంధించి హనుమకొండ జిల్లా జర్నలిస్టులకు తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని ఆయన హామీ ఇచ్చారు. జర్నలిస్టులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి, అలాగే ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆయన ప్రతిజ్ఞ చేశారు.అనంతరం, TUWJ (IJU) జిల్లా నాయకులు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. జర్నలిస్టుల సమాజం పట్ల ఆయన నిరంతరం చూపిస్తున్న మద్దతుకు,ఆదరణకు వారు తమ కృతజ్ఞతలను తెలియజేశారు. సమావేశ కార్యక్రమాలు ప్రారంభం కావడానికి ముందు, వివిధ కారణాల వల్ల విధి నిర్వహణలో ఉండగానే మరణించిన జర్నలిస్టుల ఆత్మశాంతి కోసం ఒక నిమిషం మౌనం పాటించి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు విరాట్ అలీ,కార్యదర్శి రామనారాయణ,సభా సంఘం చైర్మన్ వల్లాల వెంకటరమణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకణాల సంతోష్,పెండెం వేణుమాధవ్,యూనియన్ అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి, కార్యదర్శి తోట సుధాకర్, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు,కార్యదర్శి బొల్లారపు సదయ్య,జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యులు ఎం.రజనీ అమర్, జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యులు ఎం.రజనీ అమర్,అధ్యక్షుడు గడ్డం కేశవమూర్తి,రాష్ట్ర నాయకుడు గాడేపల్లి మధు గౌడ్, వరంగల్ యూనియన్ అధ్యక్షుడు రాంచందర్,కార్యదర్శి మట్టా దుర్గా ప్రసాద్,ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షుడు పి.వి. మధన్ మోహన్ తదితరులు ఉన్నారు.

## రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి భూమిపూజ.



ప్రజాబలం ప్రతినిధిహన్మకొండ జిల్లా మే 16:గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆవరణను ఆనుకుని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటుకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు.ఖఔజీ(×జీఖ) రాష్ట్రఅధ్యక్ష,ప్రధానకార్యదర్శులు కే విరాహత్ అలీ, రాంనారాయణ లు రాజ్యంగ నిర్మాత విగ్రహావిష్కరణ కోసం భూమి పూజ నిర్వహించారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు సొంత డబ్బులతో విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు ముందుకు వచ్చారు.త్వరలో విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పెద్దఎత్తున ఏర్పాటు చేస్తామని ప్రకటించారు.కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు,రాష్ట్ర హౌసింగ్ వెల్ఫేర్ కన్వీనర్ వల్లాల వెంకటరమణ, రాష్ట్ర బాధ్యులు కంకణాల సంతోష్,జిల్లా అధ్యక్షుడు గడ్డం రాజిరెడ్డి,కార్యదర్శి తోట సుధాకర్,ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేముల నాగరాజు,కార్యదర్శి బొల్లారం సదయ్య,కొశాధికారి బొల్ల అమర్,ఉపాధ్యక్షులు దుర్గాప్రసాద్,జాయింట్ సెక్రెటరీ, పొడిశెట్టి విష్ణువర్ధన్,ఎండీ నయీంపాషా యూనియన్ నాయకులు,జర్నలిస్టులు, పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలి:

## జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

రాజన్న సిరిసిల్ల ధాన్యం సేకరణ ప్రక్రియలో నిమగ్నమైన అధికారులు అప్రమత్తంగా ఉండి క్షేత్ర స్థాయిలో కొనుగోళ్ళ ప్రక్రియ వేగవంతం అయ్యేలా పర్యవేక్షణ చేయాలని,ధాన్యం తరలింపు,ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీలో జాప్యం లేకుండా చూడాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం,వాహనాల ద్వారా ధాన్యం తరలింపు, హమాలీల సంఖ్య పెంచి అన్ లోడింగ్ చేయడం,ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ, రైతులకు ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై శనివారం అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ తో కలిసి ఆర్డీఓలు,పౌర సరఫరాలు,వ్యవసాయ, సహకార శాఖ,గ్రామీణాభివృద్ధి శాఖ, రవాణా,మెప్మా, మార్కెటింగ్,మార్క్ ఫెడ్,కార్మిక శాఖ అధికారులు,అన్ని మండలాల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఏపీఎం లు, ప్యాక్స్ సెక్రటరీలతో జిల్లా కలెక్టర్ టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తూకం వేయడం, తూకం వేసిన ధాన్యాన్ని మిల్లులకు, గోదాములకు తరలించడంపై అధికారులు దృష్టి సారించి, క్షేత్ర స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని, కొనుగోళ్ళ ప్రక్రియ సజావుగా పూర్తయ్యేలా చూడాలని కలెక్టర్ ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల నుండి తూకం వేసిన ధాన్యం బస్తాలను తరలించేందుకు సరిపడా వాహనాలు అందుబాటులో ఉండేలా చూడాలని,వాహనాలు సమకూర్చకపోతే సంబంధిత కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో డిమాండ్ కు అనుగుణంగా వాహనాలు సమకూర్చాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం లోడింగ్ కోసం, మిల్లులు, అపరల్ పార్క్ లో ధాన్యం అన్ లోడింగ్ చేయడం కోసం హమాలీల కొరత లేకుండా చూడాలని, హమాలీల సంఖ్యను డిమాండ్ కు అనుగుణంగా పెంచి, ఇబ్బందులు కలగకుండా పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. హమాలీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ముఖ్యంగా రైతులకు ఇబ్బందులు కలగకుండా రైతుల నుండి సేకరించిన ధాన్యానికి సంబంధించిన ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ జాప్యం చేయవద్దని ఆదేశించారు. ఏపీఎం లు ప్రత్యేకంగా దీనిపై దృష్టి సారించి తమ పరిధిలోని కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు ఆన్ లైన్ ట్యాబ్ ఎంట్రీ వేగవంతం చేసేలా పర్యవేక్షణ చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలు, మిల్లుల వద్ద ఉన్న పరిస్థితులను పర్యవేక్షణ చేయడానికి కేటాయించిన రెవెన్యూ, ఇతర శాఖల సిబ్బంది సమన్వయం చేసుకుని విధులు నిర్వర్తించాలని,క్షేత్ర స్థాయిలో ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే జిల్లా యంత్రాంగం దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.

# 2027 డిసెంబర్ మాసాంతానికి దేవాదుల ఎత్తిపోతల పథకం(జే. సి.ఆర్ .డి.ఎల్.ఐ. ఎస్)పూర్తి

## మొదటి పేజీ తరువాయి

అందులో భాగంగానే దేవాదుల ఎత్తిపోతల పథకం(జే. సి.ఆర్ .డి.ఎల్.ఐ. ఎస్) పనుల పురోగతిపై శనివారం ఉదయం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ రాష్ట్ర సచివాలయంలో సహచర మంత్రులు పొన్నం ప్రభాకర్, దలసరి అనసూయ(సితక్క) లతో కలసి రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు.

లోకసభ సభ్యుడు బలరాం నాయక్ తో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాకు చెందిన శాసనసభ్యులు కడియం శ్రీహరి, కే. ఆర్.నాగరాజు,మురళీ నాయక్,దొంతు మాధవరెడ్డి, జీ. సత్యనారాయణ,రామచంద్ర నాయక్, పల్లా రాజేస్వర్ రెడ్డి,నీటిపారుదలశాఖ ప్రధాన కార్యదర్శి ఇ. శ్రీధర్,సహాయ కార్యదర్శి కే. శ్రీనివాస్,సలహాదారు ఆదిత్యా దాస్ నాథ్, ఇ. ఎన్.సి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2004-2005 లో అప్పటి కాంగ్రెస్ పార్టీ కి చెందిన దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి హయాంలో 6,016 కోట్ల అంచనా వ్యయంతో మొదలు పెట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకం(జే. సి.ఆర్ .డి.ఎల్.ఐ. ఎస్) నిర్మాణం గడిచిన బి.ఆర్.ఎస్ పాలనలో నిర్లక్ష్యానికి గురి కావడంతో అంచనా వ్యయం 18,400 కోట్ల కు పెరిగిందని ఆయన తెలిపారు.ఇప్పటికే ఈ ప్రాజెక్టుపై 14,422 కోట్లు ఖర్చు పెట్టామని మరో 3,978 కోట్లతో 2027 డిసెంబర్ మాసంతానికి పూర్తి చేసేందుకు పనులు వేగవంతం చేసినట్లు ఆయన చెప్పారు.

మొత్తం మూడు దశలలో చేపట్టిన దేవాదుల ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని 16 ప్యాకేజిలుగా విభజించి నిర్మాణం పనులు చేపట్టినట్లు ఆయన తెలిపారు.

మొదటి దశ ద్వారా 1.23 లక్షల ఎకరాలకు రెండో దశ ద్వారా 1.93 లక్షల ఎకరాలకు మూడో దశ ద్వారా 2.39 లక్షల 3ఎకరాలకు సాగునీరు అందించాలన్నది ప్రభుత్వ సంకల్పమని ఆయన చెప్పారు.

20 పంప్ హౌజ్ లు,642 కిలోమీటర్ల పైపు లైమ్ న్లు 57.16 కిలోమీటర్ల సొరంగ మార్గం,20 రిజర్వాయర్లు,306 ప్రధాన కాలువలు,2,185 కిలోమీటర్లు పంపిణీ కాల్వలకు ఈ ప్రాజెక్టు విస్తరించి ఉందని ఆయన పేర్కొన్నారు.

ఆసియాలోనే అతి పొడవైన 49 కిలోమీటర్ల డీ-ఆకారపు సాగునీటి సొరంగం ఈ ప్రాజెక్టులో భాగమని పేర్కొన్న మంత్రి, ప్రాజెక్టుకు అవసరమైన 495.55 మెగావాట్ల విద్యుత్ సరఫరా కోసం చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమ్మక్క బ్యారేజ్ అనుసంధానం వల్ల ఏడాది పొడవునా నీటి లభ్యత దాదాపు నిరంతరంగా ఉండేలా ఏర్పాట్లు జరుగుతున్నాయని ఆయన చెప్పారు.

ప్రస్తుతం ప్రాజెక్టు పనులు 87.70 శాతం పూర్తయ్యాయని మంత్రి తెలిపారు. ప్రధాన పంప్ హౌసులు, పైప్‌లైన్ వ్యవస్థలు, సొరంగ తవ్వకాల పనులు ఎక్కువగా పూర్తయ్యాయని చెప్పారు. అయితే కాల్వల లైనింగ్, పంపిణీ కాల్వల పనులు, కొన్ని నిర్మాణాల ఆలస్యం, భూసేకరణ సమస్యలు ఇంకా పూర్తి స్థాయి వినియోగాన్ని అడ్డుకుంటున్నాయని ఆయన పేర్కొన్నారు.

ఫేజ్-1లోని ప్యాకేజీ-45 పూర్తిగా ముగిసిందని, ప్యాకేజీ-46 పనులు 96.86 శాతం పూర్తయ్యాయని తెలిపారు. అయితే బొల్లికుంట సమీపంలో 700 మీటర్ల కాల్వ లైనింగ్ పనులు కోర్టు కేసు కారణంగా నిలిచిపోయి వేల ఎకరాలకు సాగునీటి లాభాలు ఆలస్యమవుతున్నాయని ఆయన చెప్పారు.

ఫేజ్-2లో హెడ్‌వర్క్స్, పంప్ హౌసులు, ప్రధాన పైప్‌లైన్ వ్యవస్థలు ఎక్కువగా పూర్తయ్యాయని ఆయన తెలిపారు.

ఆర్.ఎస్. ఘన్‌పూర్ పంపిణీ వ్యవస్థ సిద్ధంగా ఉన్నప్పటికీ తపాసుపల్లి, అశ్వరావుపల్లి, చిట్టకోడూరు పంపిణీ వ్యవస్థల పనులు భూసేకరణ వివాదాలు, కోర్టు కేసుల కారణంగా ఆలస్యమవుతున్నాయని ఆయన వివరించారు.

ఫేజ్-3ను అత్యంత కీలకమైన మరియు సవాళ్లతో కూడిన భాగంగా మంత్రి అభివర్ణించారు. ప్యాకేజీ-6ను నిర్వహిస్తున్న పాత కాంట్రాక్టర్ పనులను సమయానికి పూర్తి చేయకపోవడంతో ఒప్పందాన్ని రద్దు చేసి కొత్త సంస్థకు అప్పగించినట్లు అధికారులు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి వివరించారు.

ప్రస్తుతం 3.33 లక్షల ఎకరాలకు సాగునీటి సామర్థ్యం సృష్టించబడిందని, మరో 2.23 లక్షల ఎకరాలకు ఇంకా సాగునీటి సదుపాయం కల్పించాల్సి ఉందన్నారు. ముఖ్యంగా సూర్యాపేట, ములుగు, వరంగల్ రూరల్, సిద్ధిపేట జిల్లాల్లో ఆయకట్టు సృష్టి తక్కువగా ఉందని ఆయన పేర్కొన్నారు.

భూసేకరణ ఈ ప్రాజెక్టులో ప్రధాన అడ్డంకిగా మారిందని అధికారులు వివరించారు. మొత్తం 34,622 ఎకరాల అవసరంలో 31,963 ఎకరాలు ఇప్పటికే సేకరించగా, ఇంకా 2,659 ఎకరాల భూసేకరణ పెండింగ్‌లో ఉందన్నారు. పెండింగ్ భూసేకరణ కేసులను వెంటనే టోకెన్ దశకు తీసుకెళ్లి పరిహారం చెల్లింపులను వేగవంతం చేయాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు.

ప్రతిపాదిత ఆయకట్టులోని సుమారు 39,651 ఎకరాల ప్రాంతం కొన్ని ప్రాంతాల్లో వేగంగా పట్టణీకరణకు లోనవుతున్నందున, సర్వే ఆధారంగా వాటిని ప్రాజెక్టు కమాండ్ ఏరియా నుంచి తొలగించే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డికి తెలిపారు.

ఈ ప్రక్రియ పది రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు. దీని వల్ల అవసరం లేని సాగునీటి డిమాండ్ తగ్గి, అనవసర భూసేకరణ ఖర్చులు నివారించవచ్చన్నారు.

నిలిచిపోయిన ప్యాకేజీలను గుర్తించి అవసరమైతే వెంటనే కాంట్రాక్టులను రద్దు చేసి రీటెండర్లు పిలవాలని మంత్రి ఆదేశించారు.

"పనులు చేయని కాంట్రాక్టర్ల ఒప్పందాలను వెంటనే రద్దు చేసి కొత్త టెండర్లు పిలవాలని పరిపాలనా అనుమతుల జాప్యాల వల్ల విలువైన సాగునీటి సామర్థ్యం నిలిచిపోవద్దు" అని ఆయన అన్నారు.

దేవాదుల ప్రాజెక్టు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడమే కాకుండా తెలంగాణలోని అనేక ఎండబారిన గ్రామాలకు తాగునీటి లభ్యత కూడా గణనీయంగా మెరుగుపడుతుందని మంత్రి తెలిపారు.

జే. చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని 2027 డిసెంబర్ 31 నాటికి పూర్తిచేయడానికి అవసరమైన నిధులు, సాంకేతిక సహాయం, పరిపాలనా అనుమతులు అన్నీ తెలంగాణ ప్రభుత్వం అందిస్తుందని ఉత్తమ్ కుమార్ రెడ్డి పునరుద్ఘాటించారు.

# కొంత ప్రైవేటీకరణతోనే ఆర్టీసీకి ఊరట:

## ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ

మచిలీపట్నం రాష్ట్రంలో ఆర్టీసీ బస్సుల ప్రైవేటీకరణ ప్రస్తుత పరిస్థితుల్లో తప్పనిసరి అని ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణ స్పష్టం చేశారూ ... కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు సబ్సిడీ ఇస్తున్నప్పటికీ, ఒక్కో బస్సు ధర సుమారు రూ. 1.60 కోట్ల నుండి రూ. 1.70 కోట్ల వరకు పలుకుతోందని తెలిపారు.?ఇంత పెద్ద మొత్తంలో నిధులు వెచ్చించి బస్సులను కొనుగోలు చేయడం ప్రస్తుతానికి ఆర్టీసీ లేదా ప్రభుత్వానికి సాధ్యం కాని పని అని ఆయన అభిప్రాయపడ్డారు. దీనికి బదులుగా బస్సులను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగిస్తే, వారే పెట్టుబడులు పెట్టి, బాడీ బిల్డింగ్ చేయించుకుని బస్సులను నడుపుతారని, దీనివల్ల ఆర్టీసీపై అదనపు ఆర్థిక భారం తగ్గుతుందని వివరించారు.?ఆర్థిక భారం.. ఎలక్ట్రిక్ బస్సుల ఆవశ్యకత?ప్రస్తుతం రాష్ట్రంలో సుమారు 10వేల బస్సులు నడుస్తున్నాయని, వాటన్నింటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను తీసుకురావాలంటే దాదాపు రూ. 15, వేల కోట్లు అవసరమవుతాయని ఆయన పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడం వల్ల ఆర్టీసీపై ఇప్పటికే ఆర్థిక భారం పెరిగిందని, ఈ నేపథ్యంలో ప్రైవేట్ ఆపరేటర్ల భాగస్వామ్యం ఎంతో అవసరమని అన్నారు.?అయితే, ప్రయాణికులకు ఛార్జీలు పెంచే ఆలోచన ఏదీ లేదని ఆయన స్పష్టం చేశారు. డీజిల్ బస్సులతో పోలిస్తే ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ ఖర్చు చాలా తక్కువని ఆయన వివరించారు?ఎలక్ట్రిక్ బస్సుల వల్ల పర్యావరణ కాలుష్యం తగ్గడమే కాకుండా, నిర్వహణ వ్యయం తగ్గి ప్రయాణికులకు మరింత మెరుగైన సౌకర్యాలు కల్పించే అవకాశం ఉంటుందని తెలిపారు. రాబోయే రెండు నెలల్లో ఈ బస్సులు అందుబాటులోకి వస్తాయనీ చెప్పారు

## ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలి కేటీఆర్

హైదరాబాద్ తెలంగాణ భవన్లో జరిగిన సనత్నగర్ నియోజకవర్గానికి చెందిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గోన్నారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి, సనత్నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు. రాష్ట్రంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమానికి సంబంధించి ఎంపిక చేసిన బూత్ లెవెల్ అసిస్టెంట్లతో కూడిన ఈ సమావేశంలో కేటీఆర్ వారికి ఎస్ఐఆర్ (ూఎఖీ) పైన దిశానిర్దేశం చేశారు.

కేటీఆర్ మాట్లాడుతూ తెలంగాణవ్యాప్తంగా "కాంగ్రెస్ పోవాలి, కేసీఆర్ రావాలి" అన్న ఆలోచన ప్రతి ఒక్కరిలో ఉన్నది. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ప్రజావ్యతిరేక కాంగ్రెస్ ను పక్కన పెట్టి, ప్రజలు కేసీఆర్ ప్రభుత్వాన్ని తిరిగి తీసుకువస్తారు. తమకు వ్యతిరేకంగా ఉన్న పార్టీల ఓటర్లను, వారి మద్దతు దారులను ఓటర్ల జాబితా నుంచి తొలగించడం, ప్రాంతీయ పార్టీలు ఉన్న రాష్ట్రాల్లో ఈ ఎస్ఐఆర్ను అడ్డగోలుగా వినియోగించడం వంటి అనేక ఆరోపణలున్నాయి. ఎస్ఐఆర్ పారదర్శకంగా నిర్వహించాలని అన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో బీజేపీ లేనే లేదు.. కేవలం పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా వచ్చిన గాలి గత్తర వల్ల కొంత కనిపిస్తుంది. సోషల్ మీడియాలో ఎక్కువ, సొసైటీలో తక్కువ ఉన్న పార్టీ బీజేపీ. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి చేస్తున్నది కూల్చివేతలే. నగరంలో కనీసం తాగునీటి సరఫరా, దోమల నియంత్రణ వంటి అంశాలను కూడా నిర్వహించలేని పరిస్థితిలో కాంగ్రెస్ పార్టీ ఉన్నదరి అన్నారు.


# టీడీపీ కొత్త ప్రచారం

ఒంగోలు, మే 16 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పరిశీలించిన తర్వాత ఏపీలో అనేక మార్పులు వస్తాయన్న వాదన బలంగా వినిపిస్తోంది. ప్రధానంగా గత ప్రభుత్వాల పథకాలను అమలు చేస్తామని హామీ ఇచ్చిన పార్టీలకు మాత్రమే తమిళనాడు అసెంబ్లీలో చోటు దక్కింది. కానీ ఏపీ విషయానికి వచ్చేసరికి గత ప్రభుత్వాలు అమలు చేసిన పథకాలను జగన్ వచ్చిన తర్వాత 2019 –24 మధ్య రద్దు చేశారు. వీటిలో ప్రధానంగా అన్నా క్యాంటీన్, షాదీ ముబారక్ వంటి కీలక పథకాలు ఉన్నాయి. అదే విధంగా ఉన్నత విద్యను అభ్యసించే వారికి విదేశాలకు వెళ్లే సదుపాయాన్ని కూడా దాదాపు తీసేశారు. ఇవన్నీ వైసీపీ ప్రభుత్వానికి తీవ్ర ఇబ్బందులు కలిగించాయి. అదే సమయంలో టిడిపికి అనుకూల ఓటు బ్యాంకు ను పెంచాయి. దీనిని గమనించిన చంద్రబాబు వైసీపీ అమలు చేసిన పథకాలను కొనసాగిస్తామని గత ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. అలాగే వాటిని కొనసాగిస్తున్నారు. ఉదాహరణకు అమ్మఒడి పేరుతో వైసిపి హయంలో అమలు చేసిన పథకాన్ని తల్లికి వందనం పేరుతో మరింత బలంగా ప్రజల్లోకి తీసుకువెళ్లారుఅదే విధంగా రైతు భరోసా పేరుతో వైసిపి అమలు చేసిన పథకాన్ని అన్నదాత సుఖీభవ పేరుతో అమలు చేస్తున్నారు. అదే సమయంలో అన్న క్యాంటీన్లను తిరిగి తెరిచారు. రాష్ట్రవ్యాప్తంగా వీటిని మరింత పెంచాలని కూడా భావిస్తున్నారు. వీటికి తోడు విదేశీ రుణాలు, షాదీ ముబారక్ వంటి పథకాలను కూడా పునరుద్ధరించారు. ఇక ఇప్పుడు వైసీపీ పరిస్థితి ఏంటి అనేది ప్రశ్నార్థకంగా మారుతుంది. టిడిపి అమలు చేస్తున్న పథకాలను కొనసాగిస్తారా అంటే తమ విధానాలు తమకు ఉన్నాయని ఇటీవల బొత్స సత్యనారాయణ వ్యాఖ్యానించారు. దీన్ని బట్టి టిడిపి అమలు చేస్తున్న పథకాలు వైసీపీ వస్తే తీసేసే ప్రమాదం ఉందన్నది స్పష్టమవుతుంది. ఇది ఎన్నికల సమయంలో స్పష్టంగా ఆ పార్టీకి ఇబ్బందికర పరిణామాలు సృష్టించడం ఖాయం అవుతుంది. వీటిని టార్గెట్గా చేసుకుని టిడిపి ఇప్పుడు ప్రచారం చేయాలని నిర్ణయించుకుంది. ప్రస్తుతం అమలవుతున్న పథకాలను వచ్చే ఎన్నికల్లో వైసీపీ గెలిస్తే పూర్తిగా రద్దు చేస్తుందని ప్రధానంగా మహిళలకు ఉచితంగా అమల్లోచేస్తున్న బస్సు ప్రయాణాలు రద్దవుతాయని చెప్పనుంది. అదేవిధంగా సూపర్ సిక్స్ పథకాలను కూడా రద్దు చేస్తారని ప్రచారం చేయాలని టిడిపి నిర్ణయించింది. తద్వారా వైసిపిని అడ్డుకునేందుకు సాధ్యమైనన్ని వ్యూహాలను అమలు చేయాలని టిడిపి నాయకత్వం ఒక నిర్ణయానికి వచ్చింది. మహానాడు వేదికగా దీనికి సంబంధించి ప్రకటన చేయనున్నారు. ఎలా చూసుకున్నప్పటికీ ప్రజల్లో విస్తృతంగా ఉన్న కొన్ని పథకాల విషయంలో వైసిపి మారకపోతే కష్టం అనే భావన వినిపిస్తోంది.

పెమ్మసాని ప్లాన్ తో గుంటూరు...

గుంటూరు నగర అభివృద్ధిని పరుగులు పెట్టించే దిశగా మరో అడుగు పడింది. ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న పట్టాభిపురం రైతు బజార్ నూతన హైటెక్ భవన నిర్మాణానికి కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవిలతో కలిసి ఘనంగా భూమి పూజ చేశారు. నిత్యం వేలాది మందితో కిటకిటలాడే ఈ మార్కెట్‌ను కార్పొరేట్ స్థాయి వసతులతో ఆధునీకరించేందుకు ఈ మెగా ప్రాజెక్టును చేపట్టారు. వినియోగదారులకు, వ్యాపారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దాదాపు రూ. 6 కోట్ల భారీ వ్యయంతో, సుమారు 11,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ నూతన రైతు బజార్‌ను నిర్మించనున్నారు. అత్యంత ఆధునిక సాంకేతికతతో గ్రౌండ్ ఫ్లోర్ తో పాటు రెండు అంతస్తుల భవనంగా ఇది రూపుదిద్దుకోనుంది. ఎండ, వానల నుండి రక్షణ కల్పిస్తూ పూర్తి హైజీనిక్ వాతావరణంలో కూరగాయలు కొనుగోలు చేసేలా ఈ ప్లాన్ డిజైన్ చేశారు. ఈ నూతన మల్టీ-లెవెల్ భవనంలో మొత్తం 100 అత్యాధునిక షాపులను ఏర్పాటు చేస్తున్నారు. సామాజిక, ఆర్థిక సమతుల్యతను పాటిస్తూ ఈ షాపుల కేటాయింపులో స్పష్టమైన ప్రణాళికను ప్రకటించారు. 60 షాపులను, నేరుగా గ్రామాల నుండి వచ్చే అసలైన రైతులకు కేటాయిస్తారు. 30 షాపులను స్వయం సహాయక బృందాలకు చెందిన డ్వాక్రా ( మహిళా వ్యాపారులకు కేటాయిస్తారు. మిగిలిన షాపులను ఇతర నిత్యావసర వస్తువుల విక్రయదారులకు కేటాయించనున్నారు. కేవలం షాపులే కాకుండా, కస్టమర్ల సౌకర్యార్థం ఈ భవనంలో అధునిక పార్కింగ్ సౌకర్యం, స్వచ్ఛమైన తాగునీరు, అత్యాధునిక టాయిలెట్స్ మరియు హైజీన్ వసతులను కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ.. "గత పాలకుల తీవ్ర నిర్లక్ష్యం వల్లే ఈ భవన నిర్మాణం ఇన్నాళ్లూ జాప్యం అయ్యింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయాలకు అనుగుణంగా రైతులకు, వినియోగదారులకు ఒకే చోట మేలు చేయడమే మా లక్ష్యం" అని స్పష్టం చేశారు. అంతేకాకుండా, కేవలం 9 నెలల రికార్డు కాలంలోనే ఈ భవన నిర్మాణం పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

# సౌత్ పై జనసేన ఫోకస్...




గుంటూరు, మే 16 జనసేనాని పవన్ కళ్యాణ్ తన పార్టీని కేవలం ఆంధ్రప్రదేశ్‌కే పరిమితం చేయకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, కేరళ, తమిళనాడులకు విస్తరించే పనిలో పడ్డారు. ఇప్పటికే కేరళకు చెందిన పలువురు సామాజిక కార్యకర్తలు, కర్ణాటక నుంచి మాజీ ఎమ్మెల్యేలు జనసేన తీర్థం పుచ్చుకోవడం ఆ పార్టీ నేషనల్ ఇమేజ్ ను పెంచింది. ఎన్డీయే కూటమిలో కీలక నేతగా ఎదిగిన పవన్, దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి గొంతుకగా మారాలని భావిస్తున్నారు. అయితే, ఇతర రాష్ట్రాల్లో విస్తరణ వేగంగా జరుగుతున్నా, సొంత గడ్డ ఏపీలో పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడంపై ఆయన అడుగులు చాలా నెమ్మదిగా పడుతున్నాయనే చర్చ జోరుగా సాగుతోంది. ఎన్నికలు ముగిసి నెలలు గడుస్తున్నా జనసేనలో ఇప్పటికీ పూర్తిస్థాయి జిల్లా, మండల కమిటీల నియామకం జరగకపోవడం క్యాడర్‌ను కొంత అసహనానికి గురిచేస్తోంది. కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా బిజీగా ఉండటం ఒక కారణమైతే, అర్హులైన వారికే పదవులు దక్కాలనే పట్టుదల మరొక కారణం. అయితే, క్షేత్రస్థాయిలో కమిటీలు లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ, టీడీపీ-బీజేపీ నేతలతో సమన్వయం చేసుకోవడంలోనూ జనసైనికులు కొంత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ జాప్యం వల్ల ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గందరగోళం నెలకొంది. జనసేన బలోపేతానికి మరో పెద్ద అడ్డంకి.. పార్టీలోకి కొత్తగా వచ్చి చేరుతున్న వారితో పాటు సోషల్ మీడియా వేదికగా హడావుడి చేస్తున్న కొందరు కార్యకర్తలు. అధికారంలోకి వచ్చాక యాక్టివ్ అయిన వారు ఇప్పుడు నామినేటెడ్ పదవుల కోసం తీవ్రంగా ఒత్తిడి తెస్తున్నారు. పదవులు రాకపోతే కూటమి ప్రభుత్వంపై, సొంత నాయకత్వంపైనే విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ ధోరణిని పవన్ కళ్యాణ్ తీవ్రంగా పరిగణిస్తున్నట్లు సమాచారం. అందుకే, అడ్వాంటేజ్ కోసం వచ్చే వారిని కాకుండా, పదేళ్ల పాటు పార్టీని నమ్ముకున్న వారికే ప్రాధాన్యత ఇవ్వాలని భావిస్తున్న ఆయన.. బాధ్యతల అప్పగింతలో ఆచితూచి అడుగులు వేస్తున్నారు. టీడీపీతో కలిసి ప్రభుత్వం నడుపుతున్న తరుణంలో, ఎక్కడ ఏ చిన్న తేడా వచ్చినా అది కూటమి పునాదులకే దెబ్బ తగులుతుందని పవన్ భావిస్తున్నారు. అందుకే పార్టీ పరంగా దూకుడు తగ్గించి, పరిపాలనపై ఎక్కువ దృష్టి పెట్టారు. అయితే, ఇదే సమయంలో టీడీపీ తన గ్రామ స్థాయి కమిటీలను పటిష్టం చేసుకుంటుంటే, జనసేన వెనుకబడిపోతోందనే ఆందోళన పార్టీ కార్యకర్తల్లో ఉంది. ముఖ్యంగా నియోజకవర్గాల ఇన్-ఛార్జుల విషయంలో ఇంకా స్పష్టత రాకపోవడం వల్ల కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం కనిపిస్తోంది. ఇతర రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడం వల్ల జాతీయ స్థాయిలో జనసేనకు లభించే గుర్తింపు, భవిష్యత్తులో ఏపీలో పార్టీ ఎదుగుదలకు ప్లస్ అవుతుందని ఆయన నమ్ముతున్నారు. పవన్ కళ్యాణ్ రాజకీయం ఇప్పుడు ఎక్కువ మంది చేరడం నిబద్ధత కలిగిన నేతలు వైపు మళ్లింది. ఈ క్రమంలో జరిగే జాప్యం క్యాడర్‌కు ఇబ్బందిగా అనిపించినా, దీర్ఘకాలంలో ఇది పార్టీకి మేలు చేస్తుందని జనసేన అగ్ర నాయకత్వం వాదిస్తోంది. జనసేన పూర్తిస్థాయి కమిటీలతో సరికొత్త రూపం సంతరించుకుంటుందో లేదో వేచి చూడాలి.

# తిరుమలలో గంటకు 10 వేల మంది దర్శనం

తిరుమల, మే 16 కలియుగ దైవం శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనం ఇప్పుడు సులభతరంగా మారింది. టీడీపీ నేతృత్వంలోని కూటమి సర్కారు చేపట్టిన సరికొత్త చర్యల వల్ల వేలాది మంది భక్తులకు ఇప్పుడు కేవలం గంటల వ్యవధిలోనే స్వామి వారి దర్శన భాగ్యం కలుగుతోంది. వెరసి గతంలో గంటల తరబడి క్యూ లైన్లలో నిలవాల్సిన పరిస్థితి ఇప్పుడు కనిపించడం లేదు. అదే సమయంలో దూర ప్రాంతాల నుంచి వస్తున్న భక్తులకు విడిది సౌకర్యం లభ్యత కూడా బాగా పెరిగింది. ఇందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అందుబాటులోకి తెచ్చిన ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) వ్యవస్థ దోహదం చేస్తోందని చెప్పాలి. ఈ నెల 2న తిరుమల వెంకన్నను 91 వేల మంది దాకా దర్శనం చేసుకున్నారు. వీరందరికీ కేవలం 12 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సత్తా చాటింది. తాజాగా బుధవారం 80 వేల మంది స్వామి వారిని దర్శించుకోగా? వారికి కేవలం 8 గంటల్లోనే స్వామి వారి దర్శనం కల్పించిన టీటీడీ సరికొత్త రికార్డు నమోదు చేసింది. అంటే?. గంటకు 10 వేల మంది చొప్పున స్వామి వారిని దర్శించుకునేలా టీటీడీ చర్యలు చేపట్టింది. గతంలో ఇదే 80 వేల మంది స్వామి వారిని దర్శించుకోవాలంటే 18 నుంచి 24 గంటల సమయం పట్టేది. ఇప్పుడు ఐసీసీసీ వల్ల కేవలం ఓ గంటలోనే 10 వేల మందికి స్వామి వారి దర్శనం లభిస్తోంది. కేవలం అతి స్వల్ప వ్యవధిలోనే స్వామి వారి దర్శనం లభిస్తున్న నేపథ్యంలో తిరుమలలో విడిది గదులను బుక్ చేసుకుంటున్న భక్తులు.. దర్శనం వెంటనే వాటిని ఖాళీ చేస్తున్నారు. ఫలితంగా తిరుమల కొండపై విడిది గదుల కొరత అన్న సమస్యల ఉత్పన్నం కావడం లేదు. స్వామి వారి దర్శనం కోసం వస్తున్న దాదాపు అందరు భక్తులకూ విడిది గదులు లభిస్తున్నాయని చెప్పాలి. గతంలో అయితే గదుల కోసం భక్తులు సుదీర్ఘ కాలం పాటు వేచి చూడాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు త్వరితగతిన దర్శనాలు పూర్తి అవుతున్న నేపథ్యంలో గదుల లభ్యత కూడా బాగా పెరిగింది.

# అమరావతికి యుద్ధ గండం...

విజయవాడ, మే 16 ఆంధ్రప్రదేశ్ ప్రజల ఐదేళ్ల నిరీక్షణ తర్వాత, కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అమరావతి పనులు మళ్లీ పట్టాలెక్కుతున్న తరుణంలో ఊహించని గ్లోబల్ సవాళ్లు ఎదురవుతున్నాయి. అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు , పశ్చిమాసియాలో చెలరేగుతున్న యుద్ధ జ్వాలలు ఇప్పుడు అమరావతి నిర్మాణాల కొనసాగింపును మరోసారి ప్రశ్నార్థకం చేస్తున్నాయి. యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా సప్లై చెయిన్ దెబ్బతినడం, చమురు ధరలు పెరగడం వంటి కారణాలతో కేంద్ర ప్రభుత్వం భారీ ప్రాజెక్టులపై ఆచితూచి అడుగులు వేయాలని భావిస్తోంది. ఈ క్రమంలో అమరావతి వంటి మెగా ప్రాజెక్టుల పురోగతిపై రాజకీయ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ప్రస్తుత అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితిని దృష్టిలో ఉంచుకుని, భారీ నిర్మాణ పనులను కనీసం రెండేళ్ల పాటు వాయిదా వేయాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించవచ్చనే ప్రచారం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది. ముఖ్యంగా ప్రధాని మోదీ ప్రకటించిన ఆస్టెరిటీ పాలసీలో భాగంగా ఖర్చులను తగ్గించుకోవాలని చూస్తుండటం అమరావతికి ఇబ్బందిగా మారే అవకాశం ఉంది. ఈ ప్రచారాన్ని నీతి ఆయోగ్ తోసిపుచ్చినప్పటికీ, ఏపీలోని ప్రతిపక్షాలు దీనిని రాజకీయ అస్త్రంగా మార్చుకుంటున్నాయి. అమరావతి ఆగిపోతుందని అంటున్నారు. దీంతో రాజధాని నిర్మాణం మళ్లీ అటకెక్కుతుందా అనే ఆందోళన సామాన్య ప్రజల్లో నెలకొంది. అమరావతి నిర్మాణానికి అవసరమైన నిధుల్లో సింహభాగం ప్రపంచ బ్యాంక్ , ఆసియా అభివృద్ధి బ్యాంక్ వంటి అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రావాల్సి ఉంది. యుద్ధ పరిస్థితుల వల్ల అంతర్జాతీయ మార్కెట్లు అస్థిరంగా మారితే, ఈ రుణాల మంజూరులో జాప్యం జరిగే ప్రమాదం ఉంది. గ్లోబల్ ఎకానమీ కుదేలైతే బ్యాంకులు తమ ప్రాధాన్యతలను మార్చుకునే అవకాశం ఉంటుంది. ఇదే ఇప్పుడు చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి అతిపెద్ద తలనొప్పిగా మారింది. రాజకీయంగా చూస్తే, అమరావతిని తన ప్రతిష్టగా భావిస్తున్న చంద్రబాబుకు ఇది ఒక అగ్నిపరీక్ష. ఒకవైపు రాష్ట్రంలో ఆర్థిక వనరుల కొరత, మరోవైపు కేంద్రం నుంచి అందాల్సిన సహకారం .. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడం ఇప్పుడు ఆయన ముందున్న సవాల్. గతంలో పారిశ్రామికీకరణను పరుగులు పెట్టించిన అనుభవం ఉన్నప్పటికీ, ఇప్పుడు యుద్ధం వంటి బాహ్య శక్తుల ప్రభావం వల్ల ప్రాజెక్టు మందగిస్తే లక్ష్యం చేరుకోవడం ఆలస్యం అవుతుంది. అమరావతి చుట్టూ జరుగుతున్న రాజకీయం ఈ అనుమానాలను మరింత బలపరుస్తోంది. రాజధాని పనులు వాయిదా పడతాయనే ప్రచారం ద్వారా ఇన్వెస్టర్లలో భయాందోళనలు సృష్టించేందుకు కొన్ని వర్గాలు ప్రయత్నిస్తున్నాయని ప్రభుత్వం ఆరోపిస్తోంది. నిర్మాణ పనులు జోరుగా సాగుతున్ నసమయంలో ఇలాంటి ప్రచారాలను నమ్మాల్సిన అవసరం లేదంటున్నారు. కేంద్ర ప్రభుత్వం అధికారికంగా ఎటువంటి వాయిదా నిర్ణయాన్ని ప్రకటించలేదని కూటమి నేతలు గట్టిగా చెబుతున్నారు. నీతి ఆయోగ్ వివరణ కూడా ప్రభుత్వానికి కొంత ఊరటనిస్తోంది. కానీ, ప్రపంచ యుద్ధ మేఘాలు తొలగిపోనంత కాలం అమరావతి వంటి భారీ ప్రాజెక్టులపై నీలినీడలు కమ్ముకుంటూనే ఉంటాయన్నది సత్యం. ఏపీ రాజధాని కల నెరవేరాలంటే కేవలం రాష్ట్ర సంకల్పం మాత్రమే కాదు, అంతర్జాతీయ పరిస్థితులు కూడా అనుకూలించాల్సిన అవసరం కనిపిస్తోంది.

# స్ట్రాటిజిస్ట్ లుకాదు.. అస్ట్రాలిజిస్ట్స్

విజయవాడ, మే 16 రాజకీయాల్లో గెలుపు గుర్రం ఎక్కేందుకు వ్యూహకర్తలు ఇచ్చే డేటా కంటే, గ్రహగతులు మార్చే జ్యోతిష్యుల పైనే రాజకీయ నేతలు ఎక్కువ నమ్మకం పెంచుకుంటున్నట్లు కనిపిస్తోంది. ఇటీవల తమిళనాడులో విజయ్ విజయం వెనుక జ్యోతిష్యుడి హస్తం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతుండటంతో, ఇప్పుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా అదే బాట పట్టారు. చండీగఢ్‌కు చెందిన ప్రముఖ ఆస్ట్రాలజర్ రుద్ర కరణ్ ప్రతాప్ ప్రత్యేకంగా తాడేపల్లికి వచ్చి జగన్‌తో భేటీ కావడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. గత ఎన్నికల్లో ఐప్యాక్ వంటి వ్యూహకర్తలను నమ్ముకున్న జగన్, ఈసారి మాత్రం గ్రహబలంపైనే భారం వేసినట్లు కనిపిస్తోంది. చండీగఢ్ నుంచి రుద్ర కరణ్ ప్రతాప్‌ను ప్రత్యేకంగా తాడేపల్లికి రప్పించడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయని వైసీపీ శ్రేణులు చర్చించుకుంటున్నాయి. రాజకీయ నాయకుల అవసరాలకు అనుగుణంగా జ్యోతిష్యం చెప్పడంలో రుద్ర కరణ్ సిద్ధహస్తుడని పేరుంది. తన పర్యటనకు సంబంధించిన వివరాలను సదరు జ్యోతిష్యుడు సోషల్ మీడియాలో స్వయంగా పంచుకోవడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నిజానికి, 2024 ఎన్నికల్లో జగన్ ఘనవిజయం సాధిస్తారని రుద్ర కరణ్ ప్రతాప్ గతంలోనే జోస్యం చెప్పారు. అయితే ఆ అంచనాలు క్షేత్రస్థాయిలో తలకిందులయ్యాయి. అయినప్పటికీ, జగన్ ఆయనపై నమ్మకం కోల్పోకుండా మళ్ళీ పిలిపించి చర్చలు జరపడం గమనార్హం. కేవలం రాజకీయ భవిష్యత్తే కాకుండా, ప్రస్తుతం ఎదుర్కొంటున్న న్యాయపరమైన చిక్కులు, వ్యక్తిగత జాతక దోషాల నివారణ కోసం కూడా ఈ భేటీ జరిగినట్లు తెలుస్తోంది. స్ట్రాటజిస్టులు ఇచ్చే లెక్కలు ఒక్కోసారి తప్పవచ్చు కానీ, సరైన జ్యోతిష్యుడి సాయంతో గ్రహాలను అనుకూలం చేసుకోవచ్చని జగన్ భావిస్తున్నట్లు సమాచారం.

తమిళనాడులో విజయ్ పార్టీ పెట్టిన అతి తక్కువ కాలంలోనే అధికారంలోకి రావడానికి ఆయన వ్యక్తిగత జ్యోతిష్యుడు ఇచ్చిన సలహాలే కారణమనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఈ విజయ్ ఫార్ములా ను చూశాక, జగన్ కూడా పొలిటికల్ స్ట్రాటజిస్టుల కంటే ఆస్ట్రాలజిస్టులే బెటర్ అనే ముగింపుకు వచ్చినట్లు కనిపిస్తోంది. అందుకే తాడేపల్లి ప్యాలెస్‌లో ఇప్పుడు పొలిటికల్ డేటా కంటే, జాతక చక్రాలు, గ్రహాల సంచారంపైనే ఎక్కువ చర్చలు జరుగుతున్నాయి. జ్యోతిష్యుడి సలహాలు జగన్ జాతకాన్ని ఎంతవరకు మారుస్తాయో వేచి చూడాలి.

# భారీ మెజార్టీపై నేతలు కన్ను

విశాఖపట్టణం, మే 16 టిడిపిలోనే కొందరు నాయకులకు మెజారిటీ సమస్య ఇప్పుడు కొంత గడబిడగా మారింది. గత ఎన్నికల సమయంలో భారీ స్థాయి మెజారిటీతో విజయం దక్కించుకున్న చాలామంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఉదాహరణకు గాజువాక నియోజకవర్గంలో టిడిపి ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఊహించని మెజారిటీని సాధించారు. అదేవిధంగా మంగళగిరి నియోజకవర్గంలో మంత్రి నారా లోకేష్ కూడా 90 వేల పైచిలుకు మెజారిటీని దక్కించుకున్నారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా చాలా మంది నాయకులు భారీ మెజారిటీని సొంతం చేసుకున్నారుఅయితే ఆ సమయంలో కూటమి ప్రభావంతో పాటు వైసిపి వ్యతిరేకత తీవ్ర స్థాయిలో కనిపించింది. దీనివల్లే వీరికి అనూహ్యమైన మెజారిటీ దక్కిందన్న వాదన ఉంది. వచ్చే ఎన్నికల నాటికి ఇదే ప్రభావం కనిపిస్తుందా.. లేకపోతే వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితి మారుతుందా.. అనేది ఇప్పుడు కొంతమంది నాయకులలో చర్చనీయాంశంగా మారింది. దీంతో తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు కొంతమంది ప్రయత్నాలు చేస్తున్నారు. గత ఎన్నికల సమయంలో ఏపి మండలాల్లో తమకు ఎక్కువగా ఓట్లు పడ్డాయి.. ఏ ఏ సామాజిక వర్గాల నుంచి తమకు ఓట్లు భారీ సంఖ్యలో పడ్డాయి.. అనే విషయాన్ని ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. తద్వారా ఆయా మండలాలు, ఆయా సామాజిక వర్గాలను మరింత మంచి చేసుకుని వచ్చే ఎన్నికల సమయానికి తమకు మెజారిటీ పెంచుకోవడంతో పాటు ఒకవేళ పెరిగినా పెరగకపోయినా తమ మెజారిటీని తగ్గకుండా చూసుకునేందుకు నాయకులు ప్రయత్నాలు చేయాలని భావిస్తున్నారు. ముఖ్యంగా గాజువాక నియోజకవర్గంలో పల్లా శ్రీనివాసరావు ఇటీవల పర్యటనలు చేస్తున్నారు. తన సామాజిక వర్గం నాయకులతో పాటు క్షేత్రస్థాయిలో కార్యకర్తలను కూడా మమేకమవుతున్నారు. మెజారిటీ తగ్గకుండా చూడాలని ఆయన పదేపదే చెబుతున్నారు.

గెలుపు అనేది ఖాయమే అయినప్పటికీ మెజారిటీ ఇప్పుడు ప్రతిష్టాత్మక అంశంగా మారింది. ఇక మంగళగిరి నియోజకవర్గంలో నారా లోకేష్ కూడా ఇదే ప్రయత్నాలు చేస్తున్నారు. తనను ఎవరు కలిసినా మెజారిటీపైనే దృష్టి పెట్టాలని ఆయన చెబుతున్నారు. ఈ రెండు నియోజకవర్గాలే కాదు రాష్ట్రవ్యాప్తంగా భారీ మెజారిటీ దక్కించుకున్న నాయకులంతా ఇదే పనిపై దృష్టి పెట్టడం విశేషం. మరి వీరు అనుకున్నట్టుగా మెజారిటీ కొనసాగుతుందా లేకపోతే తగ్గుతుందా అనేది చూడాలి. ప్రస్తుతానికైతే మెజారిటీ తగ్గకుండా చూసుకునేందుకు తీవ్ర స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నారు.

దీనికిగాను సంక్షేమ పథకాల అమలతో పాటు ప్రభుత్వం ఇచ్చిన హామీలను కూడా అమలు చేసే దిశగా అడుగులు వేస్తున్నారు.

# దువ్వాడ లెక్క ఏంటీ

శ్రీకాకుళం, మే 16 పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్టుగా కొందరు నాయకులు రాజకీయాల్లో వేసే వేషాలు.. అంతగా సక్సెస్ కావన్నది అందరికీ తెలిసిందే. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాకు చెందిన వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాసరావు పరిస్థితి కూడా ఇలానే ఉంది. వచ్చే ఎన్నికల్లో తనకు టికెట్ ఇవ్వకపోతే.. స్వతంత్రంగానే పోటీ చేస్తానని.. గెలిచి తీరుతానని చెబుతున్నారు. నిజానికి ఇలాంటి ప్రకటనలు చేయడం చాలా తేలిక. కానీ.. నిరూపించుకోవడం, సాధించడం మాత్రం అంత తేలికకాదు. ఒకప్పుడు ఒంటరిగా పోరాటం చేసేందుకు నాయకులు పెద్దగా వెనుకాడాల్సిన అవసరం ఉండేది కాదు. కానీ, ఇప్పుడు పరిస్థితి మారిపోయింది. బలమైన పార్టీల హవా.. ప్రభుత్వాల దూకుడు వంటివి ఎక్కువగా పనిచేస్తున్నాయి. అంతేకాదు, పోటీలో ఉన్న అభ్యర్థుల వివరాలను.. వారి గ్రాఫ్‌నుకూడా ప్రజలు తెలుసుకుంటున్నారు. ముఖ్యంగా సోషల్ మీడియా వచ్చిన తర్వాత అభ్యర్థుల వ్యవహార శైలి కూడా పెద్ద ఎత్తున చర్చకు వస్తోంది. ఇది వ్యక్తిగత అంశాల వరకు కూడా ప్రభావితం అవుతోంది. దువ్వాడ శ్రీనివాస్ వ్యక్తిగత ఇమేజ్ ఇబ్బందుల్లో ఉందనే చెప్పాలి. కుటుంబాన్ని ఆయన దూరం పెట్టి.. సహజీవనం చేస్తున్న వైనం.. సొంత అనుచరుల మధ్యే చర్చకు వస్తోంది. ఇక, నియోజకవర్గం రాజకీయంగా ఇది వివాదం అయ్యే అవకాశం ఉంటుంది. అంతేకాదు.. దువ్వాడకు ఉన్న వ్యక్తిగత ఇమేజ్ కూడా పెద్దగా కనిపించడం లేదు. నియోజకవర్గంలో ప్రజలకు ఏమైనా సేవ చేసి ఉంటే.. దానిని చెప్పుకొనేందుకు అవకాశం ఉండేది. కానీ, అలాంటిదేమీ లేదు ఇటు వైపు చూసుకుంటే టీడీపీ సీనియర్ నాయకుడు, మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడి ముందు దువ్వాడ తేలిపోతున్నారు. రాజకీయ పరంగా చూసుకున్నా.. వ్యక్తిగతంగా చూసుకున్నా.. రామ్మోహన్ ముందు దువ్వాడ ఎక్కడా సమ ఉజ్జీ కాదన్న వాదన ఉంది. గతంలో ఎప్పుడోపోటీ చేసినప్పుడు భారీ ఓట్లు వచ్చాయని అనుకున్నా.. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. సోషల్ మీడియాలో దువ్వాడ చిందులు పెద్ద ఎత్తున ప్రచారంలో ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఒంటరి పోరు.. దువ్వాడకు చేదు అనుభవమే అవుతుందని అంటున్నారు.

# టిప్పర్ ఢీ కొని నలుగురు మృతి

కాకినాడ రూరల్ కొవ్వూరు బ్రిడ్జి దగ్గర ఉపాధి పనులకు వెళ్తున్న కూలీలను టిప్పర్ లారీ ఢీ కొట్టింది. ఘటనలో నలుగురు అక్కడికక్కడే మృతి చెందారు. మరో ఇద్దరికి కి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడ్డ వారి పరిస్థితి విషమంగా ఉంది. వారిని చికిత్స నిమిత్తం కాకినాడ జిజిహెచ్ కి తరలించారు. ఉదయాన్నే ఉపాధి పనులకు వెళ్తూ రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది.

# పెట్రోల్ భారం....రోజువారీ వస్తువులపై ప్రభావం

హైదరాబాద్, మే 16, పెట్రోల్, డీజిల్ ధరలు ఒక్కసారిగా పెరగడంతో వాహనదారులపై భారం పడింది. లీటరు పెట్రోల్‌పై రూ.3.14, డీజిల్‌పై రూ.3.11 చొప్పున పెంచుతూ చమురు కంపెనీలు తీసుకున్న అమల్లోకి వచ్చింది. పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. హర్మూజ్ జలసంధిలో రాకపోకలకు అంతరాయం, ఖర్చులు పెరగడం ఈ పెంపునకు ప్రధాన కారణంగా మారింది.అంతర్జాతీయ మార్కెట్‌లో ధరలు పెరుగుతున్నప్పటికీ, ప్రభుత్వ రంగ చమురు సంస్థలు గత 11 వారాలుగా ఇంధన ధరలను పెంచకుండా స్థిరంగా కొనసాగించాయి. అయితే, పెరుగుతున్న ఆర్థిక ఒత్తిళ్లను తట్టుకోలేక చివరకు సామాన్యులపై ఈ భారాన్ని మోపక తప్పలేదని కంపెనీలు పేర్కొన్నాయి. గత కొంతకాలంగా ఏ పెరుగుదల గురించి అయితే ఆందోళన వ్యక్తం చేస్తున్నారో అదే జరిగింది. వాస్తవానికి 2022 ఏప్రిల్ నుంచి ఇంధన ధరల్లో పెద్దగా మార్పులు లేవు. 2024 లోక్‌సభ ఎన్నికలకు ముందు మాత్రం లీటరుకు రూ.2 చొప్పున కేంద్రం తగ్గించింది.ఇటీవల అంతర్జాతీయ ఉద్రిక్తతల కారణంగా దేశంలో పెట్రో ధరలు పెరుగుతాయని పెద్ద ఎత్తున ప్రచారం సాగింది. అయితే దేశంలో సరిపడా నిల్వలు ఉన్నాయని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం అప్పట్లో భరోసా ఇచ్చింది. ప్రభుత్వం ఆ ప్రకటనలు చేసిన కొద్ది రోజులకే ఇప్పుడు ధరలు పెరిగాయి. ఈ తాజా పెంపుతో రవాణా ఖర్చులు పెరిగి నిత్యావసర వస్తువుల ధరలపై కూడా ప్రభావం చూపి, పలు రంగాలపై ప్రభావం చూపుతుందని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.ఇంధన ధరలు పెరగడం వల్ల ప్రభావం కేవలం వాహనాలకే పరిమితం కాదు. రవాణా ఖర్చులు పెరగడంతో కూరగాయలు, పాలు, రేషన్, ఆన్‌లైన్ డెలివరీ, బస్సు, ఆటో ఛార్జీలు, రోజువారీ అవసరమైన అనేక వస్తువుల ధరలు పెరుగుతాయి. ఖర్చులు పెరగడంతో రాబోయే రోజుల్లో ఇంటి బడ్జెట్ మరింత పెరిగి సామాన్యుడు ఇబ్బంది పడతాడు. కొన్ని రాష్ట్రాల్లో పెట్రోల్, డీజిల్ విక్రయాలకు లిమిట్ విధించి విక్రయాలు జరుపుగుతున్నారు.పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడంతో మొదట రోజువారీ ఉపయోగించే వస్తువులపై ప్రభావం కనిపిస్తుంది. పండ్లు, కూరగాయలను పొలాల నుండి మార్కెట్లకు చేరవేయడానికి రవాణా ఖర్చు పెరుగుతుంది. దీనివల్ల వాటి ధరలు పెరుగుతాయి. పాలు, ఇతర డైరీ ఉత్పత్తుల ధరలు పెరుగుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో పెట్రోల్-డీజిల్ ధరలు వంటింటి బడ్జెట్‌ను తలకిందులు చేయవచ్చు. ఇంధన ధరలు పెరగడం వల్ల ట్రావెలింగ్ ఖర్చులు పెరుగుతాయి. ఆటోలు, ప్రైవేట్ వాహనాలతో పాటు సరుకు రవాణా ఖర్చులు పెరుగుతాయి. దాంతో అది పలు రంగాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగినప్పుడు కంపెనీలు ఛార్జీలను పెంచుతాయి. దీంతో పాటు స్కూల్ బస్సు, ఆటోలు సైతం రేట్లు పెంచుతాయి. పిల్లల ట్రాన్స్‌పోర్ట్ ఫీజులు తల్లిదండ్రులకు మరింత భారం కానున్నాయి. తాజా నిర్ణయం కారణంగా ఉబర్, ఓలా, ర్యాపిడో బుకింగ్ ధరలు అమాంతం పెంచే అవకాశం ఉంది.పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల ఆన్‌లైన్ సేవలపై కూడా పడవచ్చు. అమెజాన్ , ఫ్లిప్‌కార్ట్, జొమాటో, స్విగ్గీ వంటి కంపెనీలు డెలివరీ ఛార్జీలను పెంచుతాయి. లగేజీ, పార్సిల్స్ పంపే కొరియర్ సేవల ధరలు పెరిగే అవకాశం ఉంది.

# పవన్ కు ఇన్ని ఆరోగ్య సమస్యలా

గుంటూరు, మే 16, సైనస్ ఆపరేషన్ కారణంగా గత కొంత కాలం నుండి విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కళ్యాణ్ , నేడు తొలిసారి మీడియా ముందుకు వచ్చాడు. జనసేన పార్టీ కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం లో పాల్గొన్న ఆయన , నేడు మాట్లాడిన కొన్ని మాటలు ఇప్పుడు సోషల్ మీడియా అంతటా బాగా వైరల్ గా మారాయి. ముఖ్యంగా ఉద్యమి సభ్యత్వాలను అత్యధిక శాతం చేయించిన కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించాడు. ఇదంతా పక్కన పెడితే , తన ఆరోగ్య పరిస్థితి పై పవన్ కళ్యాణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు అభిమానులను కాస్త ఆందోళనకు గురి చేస్తోంది. ఇన్ని సమస్యలను పెట్టుకొని ఒక పక్క సినిమాలు , మరోపక్క రాజకీయాలు ఎలా మ్యానేజ్ చేస్తున్నావ్ అన్నా అని ఆయన అభిమానులు సోషల్ మీడియా లో కామెంట్స్ చేస్తున్నారు. ఇంతకీ పవన్ కళ్యాణ్ ఏమి మాట్లాడాడో ఒకసారి చూద్దాం.ఆయన మాట్లాడుతూ 'ప్రస్తుతానికి నా ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఎన్నికల సమయం లో బాగా తిరగడం తో పాటు , నాకు కరోనా వచ్చినప్పుడు ఏర్పడిన లంగ్ ఇన్ఫెక్షన్ అలాగే ఉండిపోయింది. ఆ తర్వాత దుమ్ము , ధూళి లో తిరగడం వల్ల , సైనస్ ప్రాంతాల్లో ఆ డస్ట్ బాగా గట్టి పడింది, అది కాలక్రమేణా వాచిపోయేలా చేసింది. ఆ కారణం చేత ఒక రోజు నా కళ్ళు కనిపించకుండా పోయింది. ఈ కారణాల చేత భీమవరం లో ఒక ప్రోగ్రాం ఉన్నప్పటికీ క్యాన్సిల్ చేసి , హైదరాబాద్ కి వెళ్లి , ఇవన్నీ సరిచేసుకొని రావడానికి ఒక నెల రోజుల సమయం పట్టింది. డాక్టర్లు నా రెండు భుజాల మధ్య కూడా టెర్ వచ్చేసిందని అన్నారు. ఎందుకు ఇలా వచ్చింది అని డాక్టర్లు అడగ్గా, క్యాంపైన్ కి వెళ్ళినప్పుడు అభిమానులు చేతులు పట్టుకొని లాగేస్తుంటారు , కన్దతెగిపోయేంత లాగేస్తారు' అంటూ చెప్పుకొచ్చాడు. ఆయన మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియో ని మీకోసం క్రింద అందిస్తున్నాము చూడండి. ప్రస్తుతానికి పవన్ కళ్యాణ్ కి ఎలాంటి ఆరోగ్య సమస్య లేదు అనేది స్పష్టమైంది , రాబోయే రోజుల్లో ఆయన సినిమాలను , రాజకీయాలను ఎలా బ్యాలన్స్ చేస్తాడో చూడాలి.

# నీట్ లీక్ ఎఫెక్ట్... అన్నీ పరీక్షలపై ప్రభావం

హైదరాబాద్, మే 16, నీట్ కౌన్సెలింగ్ తర్వాతే పలు ఇతర కోర్సుల ప్రవేశాలు జరపాల్సి ఉండటంతో యేటా విద్యా సంవత్సరం గాడి తప్పుతోంది. ఈ క్రమంలో ఈఏపీసెట్ ఫలితాలు మే నెలలోనే వెలువడినా ఆయా కోర్సుల్లో ప్రవేశాలకు అక్టోబరు వరకు వేచి చూడాల్సి వస్తోంది. అన్ని పరీక్షలు సకాలంలో పూర్తయితేనే ఈఏపీసెట్ పరిస్థితి ఇలా ఉంది. ఇక ఈ ఏడాది నీట్ పరీక్ష రద్దు అవడంతో పలు ప్రవేశాల ప్రక్రియ మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉందని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.గత ఏడాది మే 4న నీట్ నిర్వహించగా.. జూన్ 14న ఫలితాలు వచ్చాయి. రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్న వారికి ఆయా నీట్ ర్యాంకు ఆధారంగా రాష్ట్ర ర్యాంకు కేటాయిస్తారు. ఆ తర్వాత కౌన్సెలింగ్ మొదలవుతుంది. రాష్ట్ర నీట్ కౌన్సెలింగ్ రెండు, మూడు దఫాలు పూర్తయిన తర్వాత ఈఏపీసెట్ అగ్రికల్చర్ విభాగం ప్రవేశాలు మొదలుపెడుతుంది. కాళోజీ హెల్త్ వర్సిటీల ఆధ్వర్యంలో తొలుత నీట్ కౌన్సెలింగ్ ఆ తర్వాత వెటర్నరీ, అగ్రికల్చర్, హార్టికల్చర్ కోర్సుల్లో ప్రవేశాలు జరుపుతారు. చివరగా బీఫార్మసీ, ఫార్మా-డి కౌన్సెలింగ్ మొదలవుతుంది. గత ఏడాది నీట్ సవ్యంగా జరిగితేనే ఫార్మా కౌన్సెలింగ్ అక్టోబరు 5న మొదలైంది. చివరి విడత కౌన్సెలింగ్ అక్టోబరు 23తో పూర్తయింది. ఈ సారి నీట్ రద్దు కావడంతో ఈ ప్రవేశాలు మరింత ఆలస్యమయ్యే అవకాశం ఉంది. ఇక బీ ఫార్మసీ, ఫార్మా-డి కోర్సులకైతే నవంబరు వరకు ప్రవేశాలకు ఎదురు చూడాల్సిందే.ఈ కౌన్సెలింగ్‌లు అన్నీ ఒక దానిపై ఒకటి ఆధారపడి ఉండటంతోనే ఈ జాప్యం నెలకొంటుంది. ఒక కోర్సులో చేరిన తర్వాత డిమాండ్ ఉన్న మరో కోర్సులో సీటు వస్తే.. తొలుత సీటు పొందిన కాలేజీలు ఫీజు, సర్టిఫికెట్లు తిరిగి ఇవ్వడం లేదు. దీంతో ఆ ఫీజును వదులు కోవడమో.. మెరుగైన సీటు కోల్పోవడమో జరుగుతుంది. అందుకే విద్యాశాఖ అధికారులు సైతం ఒక కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత మరొకటి నిర్వహిస్తున్నారు. ఈసారి మళ్లీ నీట్ నిర్వహించి, ఫలితాలు వెల్లడించడానికి కనీసం 2 నెలల సమయం పట్టే అవకాశం ఉంది. ఆ ప్రకారంగా చూస్తే ప్రవేశాల కౌన్సెలింగ్‌లు మరింత ఆలస్యమవుతాయి. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు తీసుకుంటే తప్ప కొత్త విద్యాసంవత్సరం కొలిక్కిరాదని నిపుణులు భావిస్తున్నారు.

# మే చివరి నాటికే నైరుతి రుతుపవనాల ఎంట్రీ

హైదరాబాద్, మే 16, తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణం కంటే ఐదు రోజులు ముందుగానే.. అంటే మే 26 నాటికే కేరళ తీరాన్ని తాకే అవకాశం ఉందని ప్రకటించింది. వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఇది మే 22 నుంచి 30 మధ్య మారవచ్చునని పేర్కొంది. ఈ లెక్కన తెలంగాణను జూన్ 1 లేదా 2వ తేదీల్లో రుతుపవనాలు పలకరించనున్నాయి. అయితే ఎల్ నినో ప్రభావం వల్ల ఈసారి వర్షపాతం సాధారణం కంటే కొంచెం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది.మాడు పగిలే ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు భారత వాతావరణ విభాగం ఎట్టకేలకు చల్లని కబురు చెప్పింది. దేశ వ్యవసాయ రంగానికి వెన్నెముక లాంటి నైరుతి రుతుపవనాలు ఈ ఏడాది షెడ్యూల్ కంటే ముందే దేశంలోకి ప్రవేశించనున్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. సాధారణంగా జూన్ 1వ తేదీ నాటికి కేరళ తీరాన్ని తాకే రుతుపవనాలు.. ఈసారి ఐదు రోజులు ముందుగానే అంటే మే 26 నాటికే కేరళను తాకే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. వాతావరణంలో వస్తున్న మార్పుల ఆధారంగా మే 22 నుంచి మే 30 మధ్య కాలంలో ఎప్పుడైనా ఇవి కేరళ తీరాన్ని తాకవచ్చని స్పష్టం చేసింది. తెలంగాణకు సైతం రుతుపవనాల రాక ముందస్తుగానే ఉండబోతోంది. సాధారణంగా కేరళ తీరాన్ని తాకిన ఐదు రోజుల తర్వాత రుతుపవనాలు రాయలసీమ మీదుగా దక్షిణ తెలంగాణ జిల్లాల్లోకి ప్రవేశిస్తాయి. గతేడాది వాతావరణ పరిస్థితులను పరిశీలిస్తే.. మే 24న కేరళను తాకిన రుతుపవనాలు మే 31 నాటికి తెలంగాణను పలకరించాయి. ప్రస్తుత అంచనాల ప్రకారం.. ఈ ఏడాది జూన్ 1 లేదా రెండో తేదీ నాటికే తెలంగాణవ్యాప్తంగా రుతుపవనాలు విస్తరించే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ ముందస్తు రుతుపవనాల రాకతో తీవ్రమైన ఎండలతో సతమతమవుతున్న ప్రజలకు, సాగు పనులకు సిద్ధమవుతున్న రైతులకు పెద్ద ఊరట లభించినట్లయింది.అయితే, వర్షపాతం విషయంలో వాతావరణ శాఖ ఒక కీలక హెచ్చరికను కూడా జారీ చేసింది. ఈ ఏడాది రుతుపవనాల కాలంలో దేశవ్యాప్తంగా సాధారణం కంటే కొంచెం తక్కువగా వర్షాలు కురిసే ప్రమాదం ఉందని ఐఎండీ అభిప్రాయపడింది. పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడుతున్న ఎల్ నినో పరిస్థితులే దీనికి ప్రధాన కారణమని శాస్త్రవేత్తలు విశ్లేషిస్తున్నారు. సాధారణంగా ఈ వర్షాకాలంలో సగటున 80 సెంటీమీటర్ల వర్షపాతం కురిసే అవకాశం ఉండగా.. 1971-2020 మధ్య కాలానికి సంబంధించిన దీర్ఘకాలిక సగటు 87 సెంటీమీటర్లుగా ఉంది. ఎల్ నినో ప్రభావం ఉన్నప్పటికీ.. ముందస్తు రుతుపవనాల రాక సాగు పనులకు సానుకూలంగా మారుతుందని నిపుణులు భావిస్తున్నారు.మరోవైపు.. ప్రస్తుతం రాష్ట్రంలో ఎండల తీవ్రత గరిష్ట స్థాయికి చేరింది. శుక్రవారం పగటిపూట అత్యధికంగా ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలంలో 44.5 డిగ్రీల సెల్సియస్ రికార్డు స్థాయి ఉష్ణోగ్రత నమోదైంది. తీవ్ర ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోతున్నారు. అయితే, ప్రస్తుతం నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం స్థిరంగా కొనసాగుతోందని వాతావరణశాఖ అధికారులు వెల్లడించారు. దీని ప్రభావంతో శనివారం ఉత్తర, దక్షిణ తెలంగాణ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

# దూరమౌతున్న అనురాగం కేటీఆర్, హరీష్ మధ్య గ్యాప్



హైదరాబాద్, మే 16 తెలంగాణలో అధికారం కోల్పోయిన తర్వాత బీఆర్ఎస్ పార్టీ పరిస్థితి ఉడికీ ఉడకని చందంగా తయారైంది. క్షేత్రస్థాయిలో ప్రభుత్వంపై ప్రజా పోరాటాలు నిర్మించడంలో పార్టీ విఫలమవుతోందనే వాదన క్యాడర్‌లో బలంగా వినిపిస్తోంది. ముఖ్యంగా పార్టీ అధినేత కేసీఆర్ క్రియాశీల రాజకీయాలకు కొంత దూరంగా ఉన్న సమయంలో, కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ నాయకత్వంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజా సమస్యల కంటే వ్యక్తిగత దూషణలకు, సోషల్ మీడియా వేదికగా సాగే మాటల యుద్ధానికే కేటీఆర్ ప్రాధాన్యత ఇస్తున్నారని, దీనివల్ల పార్టీకి ఆశించిన మైలేజీ రావడం లేదని అభిప్రాయపడుతున్నారు.పార్టీ కష్టాల్లో ఉన్నప్పుడు ఎప్పుడూ ముందుండే ట్రబుల్ షూటర్ హరీష్ రావు పాత్ర ఇప్పుడు బీఆర్ఎస్‌లో చర్చనీయాంశంగా మారింది. ప్రభుత్వంపై రాజీలేని పోరాటం చేయాలన్నా, చెల్లాచెదురవుతున్న క్యాడర్‌ను ఏకం చేయాలన్నా హరీష్ రావుకు పూర్తిస్థాయి బాధ్యతలు అప్పగించాలని మెజారిటీ శ్రేణులు కోరుకుంటున్నాయి. అయితే, పార్టీలో కేటీఆర్ వర్గానికి, హరీష్ వర్గానికి మధ్య సాగుతున్న కోల్డ్ వార్ వల్ల ఆయనకు తగిన ప్రాధాన్యత లభించడం లేదనే అసంతృప్తి హరీష్ అనుచరుల్లో స్పష్టంగా కనిపిస్తోంది.ఇటీవల కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమారుడిపై నమోదైన పోక్సో కేసు విషయంలో బీఆర్ఎస్ అనుసరించిన వైఖరి పార్టీలో చీలికను తెచ్చింది. రాజకీయాలకు సంబంధం లేని వ్యక్తిగత అంశాలను అస్త్రంగా చేసుకోవడం పార్టీ ప్రతిష్టను దిగజారుస్తుందని హరీష్ రావు భావించినట్లు తెలుస్తోంది. అందుకే ఆ విషయంలో ఆయన మౌనం వహించడమే కాకుండా, తన కుమారుడి గ్రాడ్యుయేషన్ వేడుకల పేరుతో అమెరికా పయనమయ్యారు. రాజకీయ సెగలు గరిష్ట స్థాయిలో ఉన్నప్పుడు ఆయన విదేశాలకు వెళ్లడం, అది కూడా కొన్నాళ్ల పాటు అక్కడే ఉంటానని చెప్పడం వెనుక వ్యూహాత్మక మౌనం ఉందనే అనుమానాలు బలపడుతున్నాయి. ఒకప్పుడు కేసీఆర్ మాటే శాసనంగా నడిచిన పార్టీలో, ఇప్పుడు నాయకత్వ లేమి స్పష్టంగా కనిపిస్తోంది. కేటీఆర్ శైలి కేవలం పట్టణ ఓటర్లను, సోషల్ మీడియాను ఆకట్టుకునేలా ఉందే తప్ప, గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఈ అనిశ్చితిని గమనిస్తున్న ద్వితీయ శ్రేణి నాయకత్వం తమ రాజకీయ భవిష్యత్తు కోసం ప్రత్యామ్నాయాల వైపు చూస్తోంది.బీఆర్ఎస్ సోషల్ మీడియా వింగ్ కేవలం ప్రత్యర్థులను ట్రోల్ చేయడానికే పరిమితమైందని, ప్రజల్లో ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను ఓట్లుగా మార్చుకునే కార్యాచరణ లేదన్న అభిప్రాయం వినిపిస్తోంది. చెబుతున్నారు. హరీష్ రావు అమెరికా పర్యటన ముగించుకుని తిరిగి వచ్చిన తర్వాతే పార్టీలో అసలు రంగు బయటపడుతుందని భావిస్తున్నారు. ఆయన తిరిగి వచ్చాక పార్టీ పగ్గాల్లో మార్పులు ఉంటాయా? లేక ఆయన తన దారి తాను చూసుకుంటారా? అనే చర్చ ఇప్పుడు వెబ్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. బీఆర్ఎస్ ఇప్పుడు ఒక కూడలిలో నిలబడింది. కేసీఆర్ మళ్లీ రంగంలోకి దిగి నాయకత్వ మార్పులపై స్పష్టత ఇస్తే తప్ప, గందరగోళంలో ఉన్న క్యాడర్‌ను గట్టెక్కించడం కష్టమేనని కనిపిస్తోంది. అమెరికా నుంచి హరీష్ రావు తిరిగి వచ్చేలోపు తెలంగాణ రాజకీయాల్లో ఇంకెన్ని మలుపులు చోటుచేసుకుంటాయో వేచి చూడాలి.

# పెట్రోల్ వినియోగం లో గోవా టాప్...

హైదరాబాద్, మే 16, అంతర్జాతీయి చమురు సంక్షోభం నేపథ్యంలో ఇంధన ధరల పెరుగుతున్నాయి. పీపీఏసీ 2024?25 డేటాను పరిశీలిస్తే మన దేశంలో ప్రతి 100 మందికి రోజుకు సగటున 10.4 లీటర్ల పెట్రోల్ వినియోగం జరుగుతోంది. గతేడాది లీటర్లుగా ఉండేది. కార్ల సంఖ్య పెరగడంతో వినియోగం పెరిగింది. అయితే రాష్ట్రాల మధ్య భారీ వ్యత్యాసం ఆర్థిక అసమానతలు ఉన్నాయి.పెట్రోల్ వినియోగంలో గోవా మొదటి స్థనంలో ఉంది. ఇక్కడ సగటున వారానికి ఒకరు 52 లీటర్ల పెట్రోల్ వినియోగిస్తాడు. ఇక్కడ 70 శాతం ఇంధన డిమాండ్ ఉంది.తర్వాత మరో మూడు రాష్ట్రాలు వరుసగా పుదుచ్చేరి, చండీగఢ్ 41 లీటర్లు, లద్దాక్ 37 లీటర్లు, అరుణాచల్ ప్రదేశ్ 27 లీటర్లు ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశ్ (21 లీటర్లు వినియోగిస్తుంది. తెలంగాణ 17 లీటర్లతక్ష 10వ స్థానంలో ఉంది. ఆంధ్రప్రదేశ్ 11లీటర్ల వినియోగంతో 22వ రాష్ట్రంగా నిలిచింది.చిన్న రాష్ట్రాల్లో టూరిజం, ప్రైవేట్ వెహికల్స్ (పెట్రోల్ కార్లు 80 శాతం) వల్ల వినియోగం ఎక్కువ. తెలంగాణ?ఆంధ్రల్లో మిక్స్‌డ్ ఎకానమీ (2?వీలర్లు 70 శాత, పబ్లిక్ ట్రాన్స్ 20 శాతం) మధ్యస్థ స్థాయి. బిహార్ వంటివి గ్రామీణ ప్రాంతాలు, సైకిల్/బైక్ ఆధారిత రవాణా (పెట్రోల్ కార్లు 5 శాతం)తో తక్కువ. మొత్తం దేశ వినియోగం 3.5 కోట్ల లీటర్లు. ఆర్థిక, పర్యావరణ, పాలసీ ఒత్తిడి.. భారీగా పెట్రోలియం వినియోగంతో రూ.1.5 లక్షల కోట్ల చెల్లించాల్సి వస్తోంది.కాలుష్యం తగ్గించేందుకు పెట్రోల్‌లో 25 శాతం ఇథనాల్ కలపాలని కేంద్రం నిర్ణయించింది. హై?కన్సూ?యమ్ రాష్ట్రాల్లో ఎయిర్ పొల్యూషన్ 30 శాతం ఎక్కువ. ధనిక రాష్ట్రాల్లో కార్ కల్చర్, పబ్లిక్ ట్రాన్స్ ఆధారం ఇది రీజనల్ డివైడ్‌ను పెంచుతోంది.ఒక వ్యక్తి సగటున వారానికి 10.4 లీటర్లు ఒక హెచ్చరికే. ఇంధన భద్రత, పర్యావరణ లక్ష్యాల దృష్ట్యా వినియోగం తగ్గించాలి. ప్రాంతీయ సమతుల్యతకు డ్రైవర్. ప్రభుత్వాలు రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని సాగితే మనదేశం ఎనర్జీ?స్మార్ట్ నేషన్‌గా మారుతుంది.

# కావూరు వద్ద పొగాకు లారీ బోల్తా: తప్పిన పెను ప్రమాదం



చిలకలూరిపేట: ప్రకాశం జిల్లా టంగుటూరు నుండి పొగాకు లోడుతో నరసరావుపేట వెళ్తున్న ఒక లారీ, చిలకలూరిపేట మండలం కావూరు వద్ద అదుపుతప్పి రోడ్డు పక్కకు బోల్తా పడింది. ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని నడపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని లారీ డ్రైవర్ ఆవేదన వ్యక్తం చేశాడు. అదృష్టవశాత్తూ లారీలోని వారికి కానీ, ఇతర ప్రయాణికులకు కానీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# వృద్ధ దంపతులపై అమానవీయ చర్య

విజయనగరం వృద్ధ దంపతులని అధికారులు ప్రొక్లెయినర్ బకెట్లో కూర్చోబెట్టి భయభ్రాంతులకు గురిచేసారు. విజయనగరం జిల్లాలో భోగాపురం మండలం బైరెడ్డిపాలెంలో దారుణ ఘటన. భోగాపురం ఎయిర్పోర్ట్ అప్రోచ్ రోడ్డు కోసం సేకరించిన భూముల స్వాధీనానికి రెవెన్యూ అధికారులు అమానవీయ చర్యలకు పాల్పడ్డారు. పరిహారం చెల్లించకుండా భూముల స్వాధీనం చేయరాదంటూ రైతులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో రైతులను బయపెట్టెందుకు ఈ చర్యకు దిగారు.

# తెలంగాణలో సర్ చిచ్చు

హైదరాబాద్, మే 16 తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' చిచ్చు రేపుతోంది. ఓటరు జాబితాల ప్రక్షాళన పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రక్రియ ఇప్పుడు అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీజేపీల మధ్య యుద్ధానికి దారితీసింది. అయితే, ఈ మొత్తం వ్యవహారంలో ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ వహిస్తున్న మౌనం రాజకీయ వర్గాల్లో పెను చర్చకు దారితీస్తోంది.ఓటరు జాబితాలో బోగస్ ఓట్లు, డూప్లికేట్ ఎంట్రీలను తొలగించడమే 'సర్' లక్ష్యమని కేంద్రం చెబుతున్నా, బీజేపీయేతర పార్టీలు మాత్రం దీనిని ఒక రాజకీయ ఆయుధంగా చూస్తున్నాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్, బీహార్ రాష్ట్రాల్లో ఈ ప్రక్రియ తీవ్ర వివాదాలకు కేంద్ర బిందువైంది. పశ్చిమ బెంగాల్లో లక్షలాది మంది ఓటర్లను జాబితా నుంచి తొలగించారని తృణమూల్ కాంగ్రెస్ ఆరోపించింది. ముఖ్యంగా అక్రమ వలసదారుల పేరుతో మైనార్టీ వర్గాల ఓట్లు గల్లంతు చేశారని, తద్వారా బీజేపీ లబ్ధి పొందిందనే వాదన బలంగా వినిపించింది.బీహార్ లో కూడా ఆర్జేడీ, కాంగ్రెస్ వంటి పార్టీలు సర్ విధానాన్ని వ్యతిరేకించాయి. పారదర్శకత లేని తొలగింపులు ప్రజాస్వామ్యానికే గొడ్డలి పెట్టు అని విమర్శించాయి. ఈ రాష్ట్రాల్లో ప్రతిపక్షాలు వీధుల్లోకి వచ్చి పోరాడితే, తెలంగాణలో పరిస్థితి భిన్నంగా ఉంది.టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ ఇప్పటికే రాష్ట్ర ఎన్నికల కమిషన్ను కలిసి సాఐఖీపై తన అభ్యంతరాలను వ్యక్తం చేసింది. పౌరసత్వ చట్టాన్ని సాకుగా చూపి మైనార్టీల ఓట్లను తొలగించవద్దని, 14 రకాల గుర్తింపు కార్డుల్లో దేనిని చూపించినా ఓటరుగా గుర్తించాలని కోరింది. నిజామాబాద్, భైంసా, బోధన్ వంటి ప్రాంతాల్లో మైనార్టీ ఓట్లు ఎక్కువగా ఉండటంతో, అక్కడ 'సర్' ప్రభావం తీవ్రంగా ఉంటుందని కాంగ్రెస్ భావిస్తోంది.దేశవ్యాప్తంగా బీజేపీయేతర పక్షాలు 'సర్'పై గళమెత్తుతుంటే, బీఆర్ఎస్ మాత్రం ప్రేక్షక పాత్రకు పరిమితమైంది. దీని వెనుక బలమైన రాజకీయ లెక్కలు ఉన్నట్లు కనిపిస్తున్నాయి. మైనార్టీల ఓట్ల కోసం 'సర్'ను వ్యతిరేకిస్తే, మెజారిటీ హిందూ ఓటర్లలో వ్యతిరేకత వస్తుందని కేసీఆర్ భావిస్తున్నారనే సందేహం కలుగుతోంది. ఇప్పటికే మైనార్టీలు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపడంతో, ఇప్పుడు వారి కోసం పోరాడి ఉన్న హిందూ ఓట్లను పోగొట్టుకోవడం ఎందుకని బీఆర్ఎస్ భావిస్తుండవచ్చు. ఇటీవల ప్రధాని మోడీ పర్యటనపై కూడా బీఆర్ఎస్ పెద్దగా స్పందించలేదు. 'సర్' వంటి విధానపరమైన అంశాల్లో బీజేపీని విమర్శించకపోవడం ద్వారా, కేంద్రంతో సన్నిహితంగా ఉండాలని చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. పాతబస్తీ వంటి చోట్ల ఎంఐఎం బలంగా ఉంది. అక్కడ ఓట్లు తొలగించినా ఎంఐఎంకే నష్టం తప్ప తమకేమీ కాదనే ధీమా కూడా బీఆర్ఎస్లో ఉండవచ్చు.ఒకవైపు కాంగ్రెస్ తన ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి ఎన్నికల సంఘం చుట్టూ తిరుగుతోంది. ఎంఐఎం తనదైన శైలిలో పోరాటానికి సిద్ధమవుతోంది. కానీ, రాష్ట్రంలో పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ వంటి పార్టీ, ఇంతటి కీలకమైన అంశంపై నోరు విప్పకపోవడం ప్రజాస్వామ్యవాదులను విస్మయానికి గురిచేస్తోంది. ఓటర్ల తొలగింపు ప్రక్రియ పూర్తయ్యాక, తుది జాబితా వచ్చాక కూడా బీఆర్ఎస్ ఇదే మౌనాన్ని కొనసాగిస్తే.. ఆ పార్టీ కేవలం రాజకీయ ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తోందని, ప్రజల ఓటు హక్కుపై ఆసక్తి లేదని స్పష్టమవుతుంది.బీఆర్ఎస్ మౌనం.. బీజేపీకి పరోక్షంగా సహకరించడమే అవుతుందనే విమర్శలకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఆ పార్టీ నాయకత్వంపై ఉంది. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో 'సర్' చుట్టూ జరుగుతున్న ఈ లొల్లి, రాబోయే ఎన్నికల ముఖచిత్రాన్ని మార్చేలా కనిపిస్తోంది.

# గులాబీ మిషన్ 2028

హైదరాబాద్, మే 16 తెలంగాణ రాజకీయాల్లో మరోసారి గులాబీ జెండా రెపరెపలాడించేందుకు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు సమర శంఖం పూరించారు. పార్టీ ఓటమి అనంతరం కొంతకాలం స్తబ్దుగా ఉన్న గులాబీ శ్రేణుల్లో నూతనోత్తేజం నింపేందుకు మంగళవారం ఎర్రవెల్లిలోని తన నివాసంలో కేసీఆర్ కీలక భేటీ నిర్వహించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీష్ రావు సహా 23 మంది ముఖ్య నేతలతో సుదీర్ఘంగా సాగిన ఈ సమావేశం, కేవలం ఒక సమీక్షగా కాకుండా, రాబోయే నాలుగేళ్ల ప్రయాణానికి దిక్సూచిగా నిలిచింది.కేసీఆర్ తీసుకున్న అత్యంత కీలక నిర్ణయం డిజిటల్ సభ్యత్వ నమోదు. గతంలో అనుసరించిన సంప్రదాయ సభ్యత్వ పద్ధతులకు స్వస్తి పలికి, పూర్తిస్థాయిలో సాంకేతికతను జోడించి సభ్యత్వాలను నిర్వహించాలని నిర్ణయించారు. ప్రతి గ్రామంలో బూత్ స్థాయి నుంచి సభ్యుల సమాచారాన్ని డిజిటలైజ్ చేస్తారు.దీనివల్ల క్షేత్రస్థాయి కార్యకర్తకు, పార్టీ అధిష్టానానికి మధ్య మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా సంబంధం ఏర్పడుతుంది. నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమన్వయకర్తలను నియమించి, పార్టీ కార్యకలాపాల్లో పారదర్శకతను పెంచనున్నారు.రాష్ట్రంలోని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలులో జరుగుతున్న జాప్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని కేసీఆర్ నేతలకు దిశానిర్దేశం చేశారు.

రైతు రుణమాఫీలో జాప్యం, ధరణి పోర్టల్ సమస్యలు, నిరుద్యోగ భృతి వంటి హామీల వైఫల్యాలను ఎండగట్టాలని సూచించారు. గతంలో నిర్వహించిన భారీ బహిరంగ సభల కంటే, ఈసారి ప్రజలతో నేరుగా మమేకమయ్యేలా 'జన చైతన్య యాత్రల'కు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించారు. గ్రామాల వారీగా తిరుగుతూ, ప్రజల సమస్యలపై పోరాడటం ద్వారానే పూర్వ వైభవం సాధ్యమవుతుందని కేసీఆర్ స్పష్టం చేశారు.పదేళ్ల అధికార కాలంలో నాయకులకు, సాధారణ కార్యకర్తలకు మధ్య ఏర్పడిన దూరాన్ని గుర్తించిన కేసీఆర్, పార్టీ నిర్మాణంలో భారీ మార్పులు సూచించారు. కేవలం నాయకుల చుట్టూ తిరిగే పార్టీగా కాకుండా, క్షేత్రస్థాయి కార్యకర్తలే నిర్ణయాత్మక శక్తిగా ఉండేలా క్యాడర్ డ్రివెన్ వ్యవస్థగా బీఆర్ఎస్ రూపాంతరం చెందబోతోంది. ప్రతి కార్యకర్తకు రాజకీయ భద్రత కల్పించడంతో పాటు, కష్టకాలంలో పార్టీ కుటుంబంలా అండగా ఉంటుందనే భరోసా ఇచ్చేలా సంస్థాగత రక్షణ వ్యవస్థను బలోపేతం చేయనున్నారు.బీఆర్ఎస్ పునర్నిర్మాణం కేవలం కమిటీల మార్పుకే పరిమితం కాదని, తెలంగాణ అస్తిత్వాన్ని, అభివృద్ధిని మళ్లీ చర్చలోకి తెచ్చే ప్రయత్నమని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. 'రీక్లెయిమింగ్ తెలంగాణ' అనే నినాదంతో, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపంగా బీఆర్ఎస్ను మళ్ళీ నిలబెట్టాలని కేసీఆర్ సంకల్పించారు.

మొత్తంగా, ఎర్రవెల్లి భేటీ బీఆర్ఎస్ పార్టీలో నిస్తేజాన్ని వదిలించుకుని ఒక శక్తివంతమైన ప్రతిపక్షంగా అసెంబ్లీలోనూ, వీధుల్లోనూ పోరాడేందుకు అవసరమైన పక్కా యాక్షన్ ప్లాన్ను సిద్ధం చేసింది. రాబోయే రెండేళ్ల కాలానికి కేసీఆర్ నిర్దేశించిన ఈ రోడ్ మ్యాప్ తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి.

# కేబినెట్ రీ లోడింగ్ టెన్షన్...

హైదరాబాద్, మే 16 తెలంగాణ రాజకీయాల్లో ఇప్పుడు అందరి కళ్లు సచివాలయం వైపే ఉన్నాయి. ప్రభుత్వం కొలువుదీరి రెండున్నర ఏళ్లు పూర్తయిన తరుణంలో, ముఖ్యమంత్రి తన కేబినెట్ను ప్రక్షాళన చేసేందుకు సిద్ధమవుతున్నారనే వార్తలు రాజకీయ వర్గాల్లో ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. కేవలం ఖాళీలను భర్తీ చేయడమే కాకుండా, పనితీరు ఆధారంగా మంత్రుల శాఖలను మార్చడం లేదా కొందరిని తప్పించడం వంటి కఠిన నిర్ణయాలు హైకమాండ్ తీసుకోబోతోందని తెలుస్తోంది. దీంతో రాష్ట్ర మంత్రుల్లో ఒకరకమైన అభద్రతా భావం, ఉత్కంఠ నెలకొన్నాయి.ప్రభుత్వ పనితీరును పరుగులు పెట్టించాలనే లక్ష్యంతో అధిష్టానం ఇప్పటికే మంత్రులందరి ప్రగతి నివేదికలను తెప్పించుకున్నట్లు సమాచారం. ముఖ్యంగా కీలకమైన రెవెన్యూ, హోం, విద్యుత్ వంటి శాఖల పనితీరుపై మిశ్రమ స్పందన వస్తోంది. ప్రజల్లో ఉన్న అసంతృప్తిని తగ్గించడానికి, ఎన్నికల హామీల అమలులో వేగం పెంచడానికి సమర్థులైన వారికి కీలక బాధ్యతలు అప్పగించాలని సీఎం భావిస్తున్నారు. కొన్ని శాఖలు ఇప్పటికీ ముఖ్యమంత్రి వద్దే ఉండటం వల్ల పాలనాపరమైన జాప్యం జరుగుతోందన్న విమర్శలను చెరిపివేసేందుకు పూర్తి స్థాయి క్యాబినెట్ దిశగా అడుగులు పడుతున్నాయి.ఈ పునర్వ్యవస్థీకరణ వార్త సీనియర్ మంత్రులను కలవరపెడుతోంది. తాము గత 30 నెలలుగా ఒక శాఖపై పట్టు సాధించి, క్షేత్రస్థాయిలో యంత్రాంగాన్ని గాడిలో పెట్టామని, ఇప్పుడు శాఖ మార్చితే మళ్లీ మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తుందని కొందరు సీనియర్లు వాదిస్తున్నారు. తమ శాఖలను మార్చవద్దని ఇప్పటికే అధిష్టానానికి, ముఖ్యమంత్రికి మొరపెట్టుకున్నట్లు సమాచారం. మరోవైపు, ప్రస్తుతం ప్రాధాన్యత లేని శాఖల్లో ఉన్న మంత్రులు మాత్రం తమకు ఈసారైనా మెరుగైన బాధ్యతలు దక్కుతాయని ఆశగా ఉన్నారు. ముఖ్యంగాయాక్టివ్‌గా ఉంటూ పార్టీ వాయిస్‌ను బలంగా వినిపిస్తున్న వారికి ప్రమోషన్ దక్కే అవకాశం కనిపిస్తోంది.ఈ ప్రక్షాళనలో కేవలం పనితీరు మాత్రమే కాకుండా రాజకీయ, సామాజిక సమీకరణాలు కీలక పాత్ర పోషించనున్నాయి. ప్రస్తుతం ఉన్న ఖాళీలను భర్తీ చేసే క్రమంలో సామాజిక సమతుల్యతను పాటించాల్సి ఉంటుంది. ఏఐసిసి ఇచ్చే లీకులు, కార్యకర్తల ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే తుది జాబితా ఉంటుందని స్పష్టమవుతోంది. పనితీరు ఆశించిన స్థాయిలో లేని మంత్రులకు పదవీ గండం పొంచి ఉందనే ప్రచారం వారిలో నిద్రలేకుండా చేస్తోంది.మొత్తానికి తెలంగాణ కేబినెట్ విస్తరణ లేదా పునర్వ్యవస్థీకరణ అనేది కేవలం అడ్మినిస్ట్రేటివ్ మార్పు మాత్రమే కాదు, ఇది రాబోయే ఎన్నికలకు పార్టీని సిద్ధం చేసే ఒక వ్యూహాత్మక చర్య. ఒకవైపు పదవులు ఊడతాయనే వణుకు, మరోవైపు కొత్త శాఖలు దక్కుతాయనే ఆశల మధ్య తెలంగాణ రాజకీయం ఇప్పుడు వెయిట్ అండ్ వాచ్ మోడ్‌లోకి వెళ్లిపోయింది. హైకమాండ్ తీసుకునే నిర్ణయం ప్రభుత్వంపై ప్రజల అభిప్రాయాన్ని ఏ విధంగా మారుస్తుందో వేచి చూడాలి.

# గన్ వదిలి పెన్ పట్టి...

కరీంనగర్, మే 16, మాజీ మావోయిస్టు దేవ్‌జీ దాదాపు 40 ఏళ్ల తర్వాత మళ్లీ విద్యార్థిగా మారి ఇంటర్మీడియట్ పరీక్ష రాశారు. 1983లో పోలీసుల జోక్యానికి నిరసనగా ఇంటర్ పరీక్షలకు దూరమైన ఆయన.. ఇప్పుడు సామాన్య పౌర జీవితంలో భాగంగా చదువును పూర్తి చేయాలని నిర్ణయించుకున్నారు. జగిత్యాల జిల్లా కోరుట్లలోని పరీక్షా కేంద్రంలో తెలుగు పేపర్ రాసిన దేవ్‌జీ.. భవిష్యత్తులో న్యాయవాదిగా మారి పేదల తరపున పోరాడాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.కాలం మారింది.. మార్గమూ మారింది.. కానీ లక్ష్యం మాత్రం సమాజ హితమే అని చాటిచెబుతున్నారు మాజీ మావోయిస్టు నేత దేవ్‌జీ అలియాస్ తిప్పిరి తిరుపతి. ఒకప్పుడు గన్ చేతబట్టి అడవి బాట పట్టిన ఈ మాజీ మావోయిస్టు ఇప్పుడు తన అసంపూర్ణ విద్యను పూర్తి చేసేందుకు పెన్ను పట్టారు. సరిగ్గా 40 ఏళ్ల క్రితం ఎక్కడైతే తన చదువు ఆగిపోయిందో.. మళ్లీ అక్కడి నుంచే తన కొత్త అధ్యాయాన్ని ప్రారంభించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.జగిత్యాల జిల్లా కోరుట్లకు చెందిన దేవ్‌జీ.. 1982-83 ప్రాంతంలో స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్ చదివారు. ఆ సమయంలో విప్లవ భావజాలానికి ఆకర్షితుడై రాడికల్ స్టూడెంట్ యూనియన్‌లో చురుగ్గా పనిచేశారు. ఆ క్రమంలో ఆయనపై పలు కేసులు నమోదు కావడంతో చదువుకు ఆటంకం ఏర్పడింది. ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు రాసినప్పటికీ.. తెలుగు సబ్జెక్టులో ఫెయిల్ అయ్యారు. మిగిలిన అన్ని సబ్జెక్టుల్లో ఉత్తీర్ణత సాధించినా.. విప్లవ పోరాటంలో భాగంగా అజ్ఞాతంలోకి వెళ్లడంతో మళ్లీ పరీక్ష రాసే అవకాశం చిక్కలేదు.సుదీర్ఘకాలం ఉద్యమంలో కొనసాగి ఇటీవలే జనజీవన స్రవంతిలోకి వచ్చిన దేవ్‌జీ.. తన విద్యను పూర్తి చేయాలని గట్టిగా నిశ్చయించుకున్నారు. ఇంటర్ బోర్డు నుంచి ప్రత్యేక అనుమతి పొంది బుధవారం జగిత్యాల జిల్లా కోరుట్లలోని ఒక ప్రైవేట్ జూనియర్ కాలేజీ పరీక్షా కేంద్రానికి హాల్ టికెట్, ఎగ్జామ్ ప్యాడ్‌తో చేరుకున్నారు. తన కన్నా వయసులో చాలా చిన్నవారైన విద్యార్థులతో కలిసి ఏమాత్రం సంకోచించకుండా తెలుగు పరీక్ష రాశారు.పరీక్ష అనంతరం దేవ్‌జీ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఉద్యమంలోకి వెళ్లినప్పుడు తన చదువు ఎక్కడ ఆగిందో.. అక్కడి నుంచే మళ్లీ మొదలు పెట్టాలని అనుకున్నానని చెప్పారు. ఇంటర్ పూర్తి చేసిన తర్వాత లాసెట్ రాసి న్యాయ విద్యను అభ్యసించాలనుకుంటున్నట్లు వెల్లడించారు. న్యాయవాదిగా మారి సమాజంలోని పేదలకు ఉచితంగా న్యాయ సాయం అందించడమే తన తుది లక్ష్యమని అన్నారు. ఒకప్పటి విప్లవ నేత ఇలా విద్యామార్గంలో ప్రజాసేవకు సిద్ధమవ్వడం పట్ల సర్వత్రా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి.కాగా, గత ఏడాది కాలంలో మావోయిస్టు పార్టీకి చెందిన అగ్రనేతలు చాలా మంది పోలీసుల ఎదుట లొంగిపోయారు. దేవ్ జీ తో పాటు మల్లా రాజిరెడ్డి, ఆశన్న వంటి కీలక నేతలు పలు విడతల్లో పోలీసుల ఎదుట సరెండర్ అయ్యారు. ఆ తర్వాత జన జీవన స్రవంతిలో కలిసిపోయి సాధారణ పౌర జీవితం గడుపుతున్నారు. అందులో భాగంగానే తాజాగా.. దేవ్ జీ ఆగిపోయిన తన చదువును కొనసాగించేందుకు ఇంటర్ పరీక్షలు రాశారు.

## టీటీడీపికి తాళం...

హైదరాబాద్, మే 16, తెలంగాణలో తెలుగుదేశం పార్టీని పూర్తిగా క్లోజ్ చేసినట్లే కనపడుతుంది. మహానాడు వంటి కార్యక్రమాల్లో మాత్రమే తెలంగాణ టీడీపీ నేతలు కనపడుతున్నారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీ అనధికారికంగా మూత వేసినట్లేనన్న అభిప్రాయం వ్యక్తమవుతుంది. మరోసారి ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి మళ్లీ రావడం టీడీపీ నాయకత్వం ప్రధాన ఉద్దేశ్యంగా కనిపిస్తుంది. 2024లో గెలిచిన తొలినాళ్లలో చంద్రబాబు హైదరాబాద్ లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ కు వచ్చి టీటీడీపీ నేతలతో సమావేశమై ఇక్కడ పార్టీని బలోపేతం చేస్తామని ప్రకటించారు. కానీ తర్వాత మాత్రం ఆ దిశగా ఎటువంటి చర్యలుచేపట్టలేదు. మహానాడులో మాత్రం తెలంగాణ టీడీపీ నేతలు కనిపించి వెళ్లిపోతున్నారు.మరొకవైపు తెలంగాణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడి నియామకం కూడా చేపట్టలేదు. అసలు కార్యవర్గాన్నే నియమించలేదు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ బలంగా ఉండటంతో పాటు తెలుగుదేశం పార్టీపై ఆంధ్ర పార్టీగా ముద్ర పడింది. ఇప్పటికే వైసీపీ అధినేత జగన్ తెలంగాణలో వైసీపీని మూసివేస్తున్నట్లు నిర్ణయం తీసుకున్నారు. కానీ తెలుగుదేశం పార్టీ మాత్రం జాతీయ పార్టీ గా ఉండలని భావించి తెలంగాణలో వరసగా అన్ని ఎన్నికల్లో పోటీ చేస్తూ వస్తుంది. 2014, 2018 ఎన్నికల్లో ఆ పార్టీ పోటీ చేసి తక్కువ స్థానాల్లో విజయం సాధించింది. అయినా గెలిచిన వారు ఎవరూ పార్టీలో ఉండలేదు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీతో పొత్తు పెట్టుకుని తెలంగాణ ఎన్నికలకు వెళ్లింది.2024 ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ లో అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగుదేశం పార్టీ తెలంగాణను పూర్తిగా వదిలేసినట్లే కనపడుతుంది. చంద్రబాబు హైదరాబాద్ కు వారం వారం వస్తున్నప్పటికీ టీటీడీపీ నేతలతో సమావేశం అయ్యేందుకు సుముఖంగా కనిపించడం లేదు. అందులో ఆంధ్రప్రదేశ్ లో బీజేపీలో టీడీపీ కూటమిగా ఉండటం, తెలంగాణలో మాత్రం బీజేపీ టీడీపీతో పొత్తుకు అంగీకరించకపోవడంతో ఇక్కడ సైకిల్ పార్టీని పూర్తిగా గాలికి వదిలేసింది. ఉన్న కొద్దోగొప్పో ఓటు బ్యాంకు ఇతర పార్టీలకు తరలి వెళ్లాయి. రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ పోటీ చేసే అవకాశం లేదు. దీంతో టీడీపీ తెలంగాణ శాఖ దాదాపుగా మూసివేసినట్లేనన్న సంకేతాలను పార్టీ నాయకత్వం ఇచ్చిందనే చెప్పాలి.

# గ్రేటర్ పై ధరల భారం..

హైదరాబాద్, మే 16, కేంద్ర ప్రభుత్వం పెంచిన పెట్రోలు, డీజిల్ ధరల పెంపుదల తెలంగాణ బీజేపీకి ఇబ్బందికరంగా మారనుంది. త్వరలోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో ఈసారి 300 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. గత ఎన్నికల్లో నలభైకి పైగా స్థానాలను గెలుచుకుంది. కానీ ఈసారి ఆ పరిస్థితి ఉండే అవకాశం లేదు.

అయితే ఈ సమయంలో పెట్రోలు, డీజిల్ ధరలు పెరగడంతో ఈ ప్రభావం ఎన్నికలపై పడుతుందన్న ఆందోళన బీజేపీ నేతల్లో వ్యక్తమవుతుంది. లీటర్ పెట్రోలు, డీజిల్ పై 3.04 రూపాయలు పెరిగింది. హైదరాబాద్ లో పెట్రోలు లీటర్ పెట్రోలు ధర 110.88, లీటరు డీజిల్ ధర 98.96 రూపాయలకు చేరుకుంది. హైదరాబాద్ వంటి నగరాల్లో ఇది భారమనే చెప్పాలి.ముఖ్యంగా పేద, మధ్యతరగతి ప్రజలపై ఈ పెట్రోలు, డీజిల్ ధరల భారం పెనుమార్పులు తేనుంది. నిత్యావసరాల ధరలు పెరగడమే కాకుండా కూరగాయల ధరలు కూడా పెరిగే అవకాశముంది. దాదాపు అన్ని ధరలు పెరగనున్నాయి. బియ్యం నుంచి ఉప్పు వరకూ అన్ని ధరలు పెరిగితే అది సామాన్యుడి అసహనానికి కారణమవుతుంది. ఎన్నికలు ముగిసిన వెంటనే ధరలు పెంచారన్న అభిప్రాయం ప్రజల్లో నెలకొంది. ఎన్ని పొదుపు సూత్రాలు, మంత్రాలు చెప్పినా ప్రజలకు తమ జేబుల్లో నుంచి డబ్బులు పోతే మాత్రం ఊరికే ఉండరు. తమ అసంతృప్తిని ఓటు రూపంలో ఖచ్చితంగా వెళ్లగక్కుతారన్న ఆందోళన కమలం పార్టీ నేతల్లో కనిపిస్తుంది.ఈ ధరలు పెరుగుదలతో బీజేపీ విజయానికి అడ్డుకట్ట వేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికలకు వెళ్లే అవకాశాలున్నాయి. అర్ధరాత్రి ..నెల మధ్యలో పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడంతో పాటు గ్యాస్ సిలిండర్ ధర కూడా ఇటీవల అరవై రూపాయలు పెరగడంతో ఆ ప్రభావం తమ పార్టీపై పడుతుందేమోనన్న భయం బీజేపీ నేతలకు పట్టుకుంది.

సాధారణంగా ప్రతి నెల ఒకటో తేదీన పెట్రో ఉత్పత్తుల ధరలను సమీక్ష చేసే చమురు సంస్థలు నెల మధ్యలోనే నిర్ణయం తీసుకుని జనంపై వీర బాదుడు చేశాయి. అదేమంటే గత నాలుగేళ్ల నుంచి ధరలను పెంచలేదంటూ కేంద్ర ప్రభుత్వం సమర్థించుకుంటున్నప్పటికీ, పశ్చిమాసియా యుద్ధం ప్రభావం కారణంగా క్రూడాయిల్ ధరలు పెరిగడంతో చమురు సంస్థలు నష్టాల్లో పడ్డాయని అందుకే ధరలను పెంచకతప్పదని గత కొన్ని రోజులుగా లీకులిస్తున్నాయి. ప్రధాని మోదీ తో సహా పెట్రోలు, డీజిల్ వినియోగం తగ్గించాలంటూ పొదుపు మంత్రం పఠించారు.తాజాగా లీటరు పెట్రోలుపై మూడు రూపాయలు, లీటరు డీజిల్ పై మూడు రూపాయలు అదనంగా వడ్డించి ప్రజల నడ్డి విరిచింది. 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు లీటరు పెట్రోలుపై రెండు రూపాయలు తగ్గించి ఓట్లు పొందిన కేంద్ర ప్రభుత్వం ఐదు రాష్ట్రాల ఎన్నికల ముగిసిన తర్వాత మూడు రూపాయలు అదనపు భారం వేసింది. దీని వల్ల నిత్యావసర వస్తువులతో పాటు కూరగాయల ధరలు కూడా పెరగనున్నాయి. ప్రజల కొనుగోలు శక్తిపై కూడా ప్రభావం పడుతుంది. ఆంధ్రప్రదేశ్ లో పెట్రోలు పై 3.29 రూపాయలు, డీజిల్ పై లీటరకు 3.14 రూపాయలు పెంచాయి. తెలంగాణాలో పెట్రోలు, డీజిల్ లీటర్ పై మూడు రూపాయలు పెంచాయి.మెట్రో నగరం కావడంతో ఎక్కువ మంది పెరిగిన పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలకు వ్యతిరేకంగా ఓటెత్తే అవకాశముందన్న అంచనాలు వినిపిస్తున్నాయి. మొత్తం మీద కేంద్ర ప్రభుత్వం పెట్రోలు, డీజిల్ ధరలు పెంచడం బీజేపీ ఆశలకు గండి కొట్టినట్లయిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడిపై రేప్ కేసు

విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి లో పనచేస్తున్న డాక్టర్ పై రేప్, అట్రాసిటీ కేసు నమోదయింది. నిందితుడు తనకు పెళ్లైన విషయం దాచి నర్సును రెండో వివాహం చేసుకొని నాలుగేళ్లు కాపురం చేసాడు. మొదటి భార్యకు రెండో వివాహ వ్యవహారం తెలిసింది. దాంతో డాక్టర్ అప్పటి నుంచి రెండో భార్య దగ్గరకు వెళ్లడంలేదు. డాక్టర్ను రెండో భార్య నిలదీసింది. అప్పుడు మొదటి వివాహ విషయం బయటపడింది.

పిల్లలు అప్పుడే వద్దంటూ రెండో భార్యకు నిందితుడు రెండుసార్లు అబార్షన్ చేయించాడు. పెళ్లయిన విషయం దాచి మోసం చేశాడంటూ మహిళా పోలీస్ స్టేషన్ లో రెండో భార్య పిర్యాదు చేసింది. ఎన్టీఆర్ జిల్లా మహిళా పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది. రేప్ కేసుతో పాటు అట్రాసిటీ కేసు సైతం నమోదు చేసారు.




# కోదాడ లో "బడిబాట"

కోదాడ, మే 16: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో శనివారం "బడిబాట" (ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట) కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం మరియు విద్యార్థినులు కలిసి పట్టణంలోని పలు వార్డుల్లో ఇంటింటికీ తిరుగుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలల్లో లభించే నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్‌లు, మధ్యాహ్న భోజన పథకం మరియు అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల బోధన వంటి వసతులను వివరించారు. ఐదు సంవత్సరాలు నిండిన పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని, బడి వయసు పిల్లలు ఎవరూ బయట ఉండకుండా చూడాలని కోరారు.టాపర్లకు అభినందనల జల్లు:ఇదే వేదికపై, ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించి పాఠశాల కీర్తిని చాటిన విద్యార్థినులు కట్టికోల పూజశ్రీ మరియు మాలవతు పవిత్రలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు తోటి విద్యార్థినులు ఘనంగా అభినందించారు. వారి ప్రతిభ మిగిలిన విద్యార్థినులకు ఎంతో స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివి కూడా కార్పొరేట్ సంస్థలకు దీటుగా అత్యుత్తమ ఫలితాలు సాధించవచ్చని ఈ విద్యార్థినులు నిరూపించారని ఉపాధ్యాయులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# హోటల్లో అగ్ని ప్రమాదం..తప్పిన ప్రాణ నష్టం



సికింద్రాబాద్.. రెజిమెంటల్ బజార్ మెట్రో పాలిస్ హోటల్ లో తెల్లవారుజామున అగ్నిప్రమాదం సంబంధించినది. ఈ హోటల్లోని మూడవ అంతస్తులో ఉన్న వంట గదిలో నుండి ఒక్కసారిగా మంటలు ఎగిసిపడి పక్కనే ఉన్న రెస్టారెంట్ కు వ్యాపించడంతో అగ్ని ప్రమాద తీవ్రత పెరిగింది.మంటల తీవ్రత వేడి కారణంగా, వంటగదిని ఆనుకుని ఉన్న భోజనశాల అగ్నిప్రమాదంలో పూర్తిగా కాలిపోయింది. అయితే అగ్నిమాపక సిబ్బంది మంటలు మిగిలిన అంతస్తులకు భవనంలోని ప్రక్క భాగాలకు వ్యాపించకుండా నివారించారు. ఈ హోటల్లో బస చేస్తున్న 67 మంది ఈ అగ్ని ప్రమాద ఘటనకు భయాందోళనకు గురికాగా వారిని హైడ్రాలిక్ ప్లాట్ఫామ్ వెహికల్ బ్రాంటో స్కైలిఫ్ట్ ద్వారా సురక్షితంగా కాపాడినట్లు అగ్నిమాపక అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. విద్యుతఘాధం మూలంగానే అగ్నిప్రమాదం సంభవించిందని అగ్నిమాపక అధికారులు భావిస్తున్నారు.

# కోదాడ గణపవరం గ్రామంలో హత్య కలకలం



కోదాడ గణపవరం గ్రామంలో గణేష్ చదువు రీత్యా బెంగళూరులో ఉంటూ చదువైన తర్వాత బెంగళూరులో జాబ్ చేస్తూ న్నాడు. సెలవులు నిమిత్తం తన గ్రామానికి వచ్చి మూడు రోజులు అయితుండగా తన స్నేహితుడు మ్యారేజ్ ఫంక్షన్ కి రాత్రి 8 గంటల సమయంలో వెళ్లి మరల తన స్నేహితులతో కలిసి కనిపించాడు. తరువాత కనిపించకుండా పోయాడు. గణేష్ కనిపించకపోవడంతో బంధువులు పోలీస్ కంప్లైంట్ ఇచ్చారు. గణేష్ మృతదేహం లక్ష్మం పురం గ్రామం రోడ్డుకి మామిడి తోటలో ఉందని రైతు చూసి గ్రామస్తులకు తెలియజేశాడు. గణేష్ ఒంటిపైన కత్తి పోట్లు, మెడపైన కత్తి తోటి పొడిచి ఒంటి మీద ఉన్న బట్టలన్నీ తీసేసి అతి కిరాతకంగా చంపినట్లు పోలీసులు గుర్తించారు.

# కరీంనగర్ పార్లమెంట్ పరిధి కాంగ్రెస్ పార్టీ నేతలతో మంత్రి పొన్నం భేటి



హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో కార్యాలయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం నాడు కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని నియోజకవర్గ ఇంచార్జి లు, అబ్జర్వర్ల తో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కరీంనగర్ పార్లమెంట్ కోఆర్డినేటర్ కూన శ్రీశైలం గౌడ్,ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ,కరీంనగర్ డిసిసి అధ్యక్షులు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం ,ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సిరిసిల్ల డిసిసి అధ్యక్షులు సంగీతం శ్రీనివాస్ , కరీంనగర్ కార్పొరేషన్ కాంగ్రెస్ అధ్యక్షులు అంజన్ కుమార్ ,కెకె మహేందర్ రెడ్డి ,ఒడితల ప్రణవ్ నియోజకవర్గ కోఆర్డినేటర్స్ గడ్డం చంద్రశేఖర్ రెడ్డి, దుధం వెంకట రమణ , బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మహమ్మద్ ఖాజా ఫక్రుద్దీన్, ఆదేం రాజ్ దేఖపతి,సౌజన్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో పార్టీ సంస్థాగత అభివృద్ధి పై చేయాల్సిన కార్యక్రమాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అభివృద్ధి కార్యక్రమాలు కార్యక్రమాలు ప్రజల్లోకి వృస్థంగా తీసుకెళ్లడం లాంటి అంశాలు, కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో డిసిసి అధ్యక్షులు మండలాల వారిగా పార్టీ సమావేశాలు ఏర్పాటు చేయాలని సమావేశంలో చర్చ జరిగింది.

ఓటరు జాబితా సవరణ పై నియోజకవర్గ ఇంచార్జి లు ,కోఆర్డినేటర్ లు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. నియోజకవర్గాల వారిగా వరి ధాన్యం కొనుగోలు లో ఇబ్బందులు లేకుండా పార్టీ నేతలు క్రియాశీలకంగా పని చేయాలి. పార్టీలో ముందు నుండి క్రియాశీలంగా ఉన్న వారికి గుర్తింపు ఇవ్వాలి. నామినేటెడ్ పార్టీ పదవుల్లో పార్టీ నిర్ణయించిన విధంగా మూడు సంవత్సరాలు అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని మంత్రి సూచించారు.

# బ్లాక్ స్పాట్లు పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



కర్నూలు పంచలింగాల టోల్గేట్ వద్ద బ్లాక్ స్పాట్స్ పరిశీలన యాత్ర బస్సు ను జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ జెండా ఊపి ప్రారంభించారు. తరువాత పంచలింగాల టోల్గేట్ వద్ద బ్లాక్ స్పాట్ ను పరిశీలిస్తూ రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పోలీస్ అధికారులకు, హైవే అధికారులకు జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి, , జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాలు జారీ చేసారు. అనంతరం కలెక్టర్, ఎస్పీ బ్లాక్ స్పాట్స్ పరిశీలన యాత్ర బస్సులో బయలుదేరి బ్లాక్ స్పాట్ ను పరిశీలిస్తూ, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

## రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి
## సంతాపం వ్యక్తం చేసిన మంత్రి లోకేష్

విజయవాడ కాకినాడ రూరల్ కొవ్వూరు బ్రిడ్జి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు ఉపాధి హామీ కార్మికులు దుర్మరణం పాలవడం కలచివేసిందని మంత్రి లోకేష్ అన్నారు. . ఉపాధి పనులకు వెళ్తూ ప్రాణాలు కోల్పోవడం బాధాకరం. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్నివిధాల అండగా ఉంటుంది. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించాను. మృతుల కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని అయన తెలిపారు.

# అర్ధరాత్రి వ్యూహం.. తెల్లవారుజామున మెరుపు దాడి!
# అన్నమయ్య జిల్లాలో పోలీసుల ‘ఆపరేషన్ వజ్రప్రహార్’..

మదనపల్లి, మే 16: శాంతిభద్రతల పరిరక్షణే శ్వాసగా, ప్రజల సురక్షిత జీవనమే పరమావధిగా అన్నమయ్య జిల్లా పోలీస్ శాఖ శనివారం తెల్లవారుజామున అత్యంత పకడ్బందీగా రెండు భారీ నిఘా ఆపరేషన్‌లను నిర్వహించింది. జిల్లాను నేరరహితంగా మార్చడానికి, సమాజానికి ముప్పుగా పరిణమిస్తున్న శక్తుల ఆటకట్టించడానికి “ఆపరేషన్ వజ్రప్రహార్” నిర్వహించారు.ఈ వ్యూహాత్మక చర్య శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత, జిల్లా అంతా ప్రశాంతంగా నిద్రిస్తున్న సమయంలో అత్యంత నిశ్శబ్దంగా మొదలైంది. మదనపల్లె, రాయచోటి సబ్ డివిజన్లలోని సమస్యాత్మక ప్రాంతాలే లక్ష్యంగా పోలీసులు కార్యాచరణకు సిద్ధమయ్యారు. సరిగ్గా సమయం ఉదయం 4:00 గంటలు.. కోడికూత కూడా వినబడని ఆ కారుచీకట్లో ప్రజల రక్షణ కోసం పోలీస్ బలగాలు అడుగులు వేశాయి. మదనపల్లె డీఎస్పీ శ్రీమతి బి. పావని గారి నేతృత్వంలో 105 మంది, రాయచోటి డీఎస్పీ శ్రీ ఎం.ఆర్. కృష్ణమోహన్ గారి నేతృత్వంలో 61 మంది.. మొత్తం 166 మంది నిబద్ధత గల పోలీస్ అధికారులు, సిబ్బంది ఏకకాలంలో రంగంలోకి దిగారు. ఎవరికీ ఎటువంటి ముందస్తు సమాచారం లీక్ కాకుండా, అత్యంత రహస్యంగా మదనపల్లె తాలూకా పరిధిలోని కోళ్లబైలు జగన్ కాలనీ, కలకడ మండలం బంగారువాండ్లపల్లి గ్రామాలను పోలీసులు చుట్టుముట్టారు. నిశ్శబ్దంగా సాగిన ఈ మెరుపు తనిఖీలు (కార్డన్ అండ్ సెర్చ్) నిర్వహించారు.ఈ ఆపరేషన్‌లో క్షేత్రస్థాయి సిబ్బంది వీధుల్లో సోదాలు నిర్వహిస్తుండగా, భూతలం నుండి ఎవరూ తప్పించుకోకుండా నిఘాను మరింత పటిష్టం చేశారు. ఈ ఆపరేషన్‌లో జిల్లా ఎస్పీ గారి ఆదేశాల మేరకు అధునాతన డ్రోన్ కెమెరాల ద్వారా గ్రామాలపై గగనతలం నుంచి పర్యవేక్షణ చేపట్టారు. గ్రామంలోని ప్రతి ప్రాంతాన్ని నిశితంగా పరిశీలిస్తూ అసాంఘిక శక్తుల కదలికలను గుర్తించేలా నిఘా కొనసాగించారు. ఈ అధునాతన నిఘా వ్యవస్థతో గ్రామాల్లోని ప్రతి



సందు, పొదలు మరియు నిర్మానుష్య ప్రాంతాలను కంట్రోల్ రూమ్ స్క్రీన్లపై నిరంతరం పర్యవేక్షించారు.పోలీసులు పన్నిన ఈ రక్షణ వలయంలో వాహనాల తనిఖీలు ముమ్మరంగా సాగాయి. రహదారి నిబంధనలు ఉల్లంఘిస్తూ, నెంబర్ ప్లేట్లు మార్చి, సరైన రికార్డులు లేకుండా తిరుగుతున్న వాహనాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. ఆయా ప్రాంతాలలో అనుమానాస్పదంగా ఉన్న మొత్తం 133 వాహనాలను నిలిపివేసి క్షుణ్ణంగా తనిఖీ చేయగా.. పక్కా ఆధారాలు లేని 78 వాహనాలను స్పాట్‌లోనే స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఇందులో 71 ద్విచక్ర వాహనాలు, 4 ఆటోలు, 2 కార్లు మరియు ఒక ట్రాక్టర్ ఉన్నాయి. చట్టపరమైన పూర్తి పత్రాలు సమర్పించిన తర్వాతే ఈ వాహనాలను విడుదల చేయడం జరుగుతుందని, నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.అయితే పోలీస్ శాఖ అంటే కేవలం తనిఖీలు, కేసులు మాత్రమే కాదు.. ప్రజలతో మమేకమయ్యే రక్షకులు అని నిరూపిస్తూ, తనిఖీల అనంతరం మదనపల్లెలో 300 మంది, కలకడలో 210 మంది ప్రజలను ఒకచోటకు చేర్చి ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. స్థానిక శాంతిభద్రతల సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. “మీ ప్రాంతాల రక్షణే మా బాధ్యత. ఊర్లోకి కొత్త వ్యక్తులు వచ్చినా, లేదా ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు గమనించినా భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం అందించండి” అని స్థానికుల్లో ధైర్యాన్ని నింపారు.

అనంతరం సమాజ శ్రేయస్సు కోసం, నేరాల నిర్మూలన కోసం ప్రజలందరితో కలిసి పోలీసులు, ఈగల్ టీమ్ సిబ్బంది “ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ” చేయించారు. ప్రజలు, పోలీసులు కలిసికట్టుగా నిలబడిన ఆ క్షణం ఈ ఆపరేషన్‌కే మకుటాయమానంగా నిలిచింది.యువత భవిష్యత్తును పాడుచేస్తూ, సమాజాన్ని పట్టిపీడిస్తున్న మాదకద్రవ్యాల (గంజాయి, డ్రగ్స్) ముఠాలను వేరుతో సహా తొలగించడమేనని. ఈ సందర్భంగా డిఎస్పీ లు గట్టి హెచ్చరికలు జారీ చేశారు. ఇకపై జిల్లాలో గంజాయి రవాణా చేసినా, విక్రయించినా పాత నేరస్థులైనా, కొత్త వారైనా సరే.. పీడీ యాక్ట్, పి.ఐ.టి, ఎన్‌డీపీఎస్ చట్టాల కింద అత్యంత కఠినమైన జైలు శిక్షలు తప్పవని స్పష్టం చేశారు.

# తిరుపతి పార్లమెంట్ పరిధిలో రైల్వే సమస్యలు పరిష్కరించండి

## నైలెట్ తిరుపతి శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు చర్యలు వేగవంతం చేయండి
## కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను కలిసిన ఎంపీ గురుమూర్తి

తిరుపతి పార్లమెంట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న రైల్వే సమస్యల పరిష్కారం, అలాగే డిజిటల్ విద్యా మరియు సైబర్ పరిశోధన రంగాల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వ సహకారం కోరుతూ తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, సమాచార సాంకేతిక శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ను న్యూఢిల్లీలో కలిశారు. ఈ సందర్భంగా తిరుపతి, రేణిగుంట, గూడూరు ప్రాంతాలకు సంబంధించిన పలు రైల్వే సమస్యలు పరిష్కరించాలని కోరారు.రేణిగుంట రైల్వే స్టేషన్‌ను ఆధునిక సౌకర్యాలతో కూడిన ప్రధాన టెర్మినల్‌గా అభివృద్ధి చేయాలని, ఇందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఎంపీ కోరారు. ప్రయాణికుల కోసం మెరుగైన వసతులు, పార్కింగ్, కార్గో సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని వివరించారు. శ్రీకాళహస్తి, నడికుడి రైల్వే లైన్ తుది దశ పనులను వేగవంతం చేయాలని కోరారు.సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను గూడూరు నుంచి తిరుపతి వరకు పొడిగించాలని, దీని ద్వారా నెల్లూరు జిల్లా ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగులకు ఎంతో ఉపయోగం ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. గూడూరులోని అంబేద్కర్ నగర్ అండర్‌పాస్ విస్తరణ పనులు త్వరగా చేపట్టాలని, వెందోడు రైల్వే స్టేషన్‌లో కృష్ణా ఎక్స్‌ప్రెస్, పూరి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్ రైళ్లకు స్టాపేజీలు కల్పించాలని కోరారు. తిరుపతి వెస్ట్ రైల్వే స్టేషన్ వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అత్యవసరమని కూడా వివరించారు.డిజిటల్ విద్య, సైబర్ భద్రత రంగాల్లో తిరుపతిని జాతీయ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దడంలో నైలెట్ కీలక పాత్ర పోషిస్తుందని ఎంపీ గురుమూర్తి తెలిపారు. నైలెట్ తిరుపతి శాశ్వత క్యాంపస్ ఏర్పాటుకు తిరుపతి విమానాశ్రయం సమీపంలోని ప్రతిపాదిత భూమిని త్వరగా స్వాధీనం చేసుకోవాలని కోరారు. ఆధునిక ప్రయోగశాలలు, పరిశోధన కేంద్రాలు, హాస్టళ్లు, ఇన్నోవేషన్ కేంద్రాల ఏర్పాటు కోసం కనీసం రూ.300 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు.అలాగే శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ప్రతిపాదించిన “సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ పాలసీ, లా అండ్ టెక్నికల్ రీసెర్చ్ ఇన్ సైబర్ స్పేస్” ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం పూర్తి మద్దతు అందించాలని కోరారు. తిరుపతికి సైబర్ పరిశోధన మరియు డిజిటల్ ఆవిష్కరణల ప్రధాన కేంద్రంగా ఎదిగే సామర్థ్యం ఉందని, కేంద్రం సానుకూలంగా స్పందిస్తే ప్రాంతీయ అభివృద్ధికి ఇది ఎంతో దోహదపడుతుందని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు.

# బుల్లెట్ ఎక్కిన చంద్రన్న



శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం అనంతరం ప్రజావేదిక సమీపంలో ఏర్పాటు చేసిన స్టాల్స్ను ముఖ్యమంత్రి చంద్రబాబు తిలకించించారు. ఐటీడీఏల ఆధ్వర్యంలో సవర ఆర్ట్ గ్యాలరీ వద్ద గిరిజనులు ప్రత్యేకంగా తయారు చేసిన ఓవర్ కోటును ముఖ్యమంత్రి కొనుగోలు చేసి ధరించారు. సముద్ర తీరప్రాంతాల్లో పెంచే సీవీడ్ సాగుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారులకు మరింత ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. అనంతరం శ్రీకాకుళం జిల్లాలో పోలీసులు ఏర్పాటు చేసిన వినూత్న కార్యక్రమం హెల్మెట్ బ్యాంక్ను చూసి సీఎం అభినందించారు. హెల్మెట్ ధరించి బుల్లెట్ వాహనాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధిరోహించారు.

# సైబరాబాద్ లో కొత్త తరహా సైబర్ నేరం






హైదరాబాద్ సైబరాబాద్ లో సరికొత్త తరహా సైబర్ నేరం బయటపడింది. ఈ సిమ్ ను ఫిజికల్ సిమ్ గా మార్చాలనీ బ్యాంక్ అధికారుల పేరుతో బాధితుడికి సైబర్ నేరగాళ్లు ఫోన్ చేసారు. ఈ సిమ్ ను చేంజ్ చేసి జనరల్ సిమ్ గా మార్చి తాము పంపిన ఫోన్ లో వేయండి అని నమ్మించారు. మోటోరాల ఫోన్ ను బాధితుడికి పంపి ముందుగానే కొన్ని యాప్ లను పెట్టారు. తరువాత బాధితుడి ఖాతాలో ఉన్న 77 లక్షలు రూపాయలు కాజేసారు సైబర్ నేరగాళ్లు.
సైబర్ క్రైమ్ డీసీపీ సాయి మనోహర్ మాట్లాడుతూ వెస్ట్ బెంగాల్ లో ఒక చెట్టు కింద కూర్చుని ఈ తరహా సైబర్ నేరానికి సైబర్ నేరగాళ్లు పాల్పడుతున్నారు. అచ్చం జాంతార తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని అన్నారు.
ఈ నేరంలో ఆరుగురిని పోలీసులు అరెస్టు చేసారు. 15 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నెల రోజుల పాటు వెస్ట్ బెంగాల్, ఢిల్లీ లో ఆపరేషన్ నిర్వహించినట్లు డీసీపీ వెల్లడించారు.

# వైభవోపేతంగా శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

**బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించిన టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర**

**ఆధ్యాత్మిక శోభ కనిపించేలా ఏర్పాట్లుమే 27న గరుడ సేవ మే 30న రథోత్సవం**

తిరుపతి శ్రీ గోవిందరాజస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు మే 23 నుండి 31వ తేదీ వరకు అత్యంత వైభవంగా, మరింత ఆధ్యాత్మిక శోభ కనిపించేలా నిర్వహించనున్న నేపథ్యంలో బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలను టిటిడి జేఈవో లు శ్రీ వి వీరబ్రహ్మం, డా. ఎ.శరత్, సివిఎస్వో శ్రీ కే వి మురళీకృష్ణ లతో కలిసి టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శనివారం ఆవిష్కరించారు. తిరుపతిలోని టీటీడీ నివాస గృహంలోని ఈవో ఛాంబర్‌లో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీ గోవిందరాజస్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తి, ఆధ్యాత్మికత, సంప్రదాయ వైభవాలకు ప్రతీకగా నిలిచేలా అన్ని శాఖలు సమన్వయంతో విశేష ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వేసవి దృష్ట్యా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సౌకర్యవంతమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు.ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళ కళ లాడేలా చలువ పందిళ్లు, ఆకర్షణీయమైన విద్యుత్ అలంకరణలు, రంగురంగుల ముగ్గులు, పుష్పాలంకరణలు, వైట్ పెయింటింగ్, సాంప్రదాయ చిత్రకళా అలంకరణలు, ఎల్ఈడీ స్క్రీన్లు తదితర ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.మే 22న సాయంత్రం 5.30 గంటల నుండి 8 గంటల వరకు అంకురార్పణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. మే 23న ఉదయం 7.35 గంటల నుండి 8.49 గంటల వరకు మిథున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. అదే రోజు రాత్రి పెద్దశేష వాహనంపై స్వామివారు భక్తులకు దివ్య దర్శనమివ్వనున్నారు.ప్రతిరోజూ ఉదయం 7 నుండి 9 గంటల వరకు, రాత్రి 7 నుండి 9 గంటల వరకు నిర్వహించనున్న వాహనసేవలు భక్తి పారవశ్యాన్ని పంచనున్నాయి. ముఖ్యంగా మే 27న గరుడవాహన సేవ, మే 30న రథోత్సవం బ్రహ్మోత్సవాలకు ఆకర్షణగా నిలవనున్నాయి.వాహనసేవల విశేషాలు24.05.2026 ? ఉదయం చిన్నశేష వాహనం, రాత్రి హంస వాహనం25.05.2026 ? ఉదయం సింహ వాహనం, రాత్రి ముత్యపుపందిరి వాహనం26.05.2026 ? ఉదయం కల్పవృక్ష వాహనం, రాత్రి సర్వభూపాల వాహనం27.05.2026 ? ఉదయం మోహినీ అవతారం, రాత్రి గరుడ వాహనం28.05.2026 ? ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజ వాహనం29.05.2026 ? ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రి చంద్రప్రభ వాహనం30.05.2026 ? ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం31.05.2026 ? ఉదయం చక్రస్నానం, రాత్రి ధ్వజావరోహణంబ్రహ్మోత్సవాల సందర్భంగా టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్ట్, దాససాహిత్య ప్రాజెక్టుల ఆధ్వర్యంలో ప్రతిరోజూ ఆధ్యాత్మిక, భక్తి సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో శ్రీమతి వి.ఆర్. శాంతి, ఏఈవో శ్రీ ఏబీ నారాయణ చౌదరి, ఆలయ అర్చకులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు

# చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు: కరీంనగర్ సిపి గౌష్ ఆలం







కరీంనగర్ రానున్న బక్రీద్ పండుగను పురస్కరించుకుని కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. శనివారం నాడు కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో విశ్వ హిందూ పరిషద్ బజరంగ్ దళ్,గోరక్ష ప్రముఖ్ తదితర హిందూ మత సంఘాల ప్రతినిధులతో కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం ఒక ముఖ్యమైన సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.పండుగ వేళ ఎవరైనా చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే సహించేది లేదని స్పష్టం చేశారు. పశువుల అక్రమ రవాణా లేదా గోవధకు సంబంధించి ఎలాంటి సమాచారం ఉన్నా,తక్షణమే పోలీసులకు తెలియజేయాలే తప్ప చట్టాన్ని ఉల్లంఘించ కూడదని హెచ్చరించారు. అలా కాదని చట్టాన్ని అతిక్రమిస్తే,తెలంగాణ గోవధ నిషేధ మరియు జంతు సంరక్షణ చట్టం,1977 ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తప్పవని తేల్చి చెప్పారు.వ్యూహాత్మక ప్రాంతాలలో 6 చెక్‌పోస్టులుపశువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా 121 చెక్‌పోస్టులు,52 అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు పనిచేస్తున్నాయని..కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో ప్రత్యేకంగా 6 చోట్ల చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్లు సీపీ వెల్లడించారు.

# రాష్ట్రవ్యాప్తంగా రహదారులు శుభ్రంగా ఉంచేలా ప్రత్యేక డ్రైవ్

**రూ.54 లక్షల తలసరి ఆదాయం తీసుకురావటం ప్రభుత్వ లక్ష్యం సీఎం చంద్రబాబు నాయుడు**








శ్రీకాకుళం నరసన్నపేటలో శనివారం జరిగిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు.చంద్రబాబు మాట్లాడుతూ రాష్ట్రం మొత్తం పరిశుభ్రంగా ఉండాలనే స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమం చేపట్టాం. ఇది నా మనసుకు చాలా దగ్గరగా ఉండే కార్యక్రమం ఇది. ఇవాల్టి నుంచి స్వచ్ఛపథం కార్యక్రమం కింద రాష్ట్రవ్యాప్తంగా రహదారులు శుభ్రంగా ఉంచేలా ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నామని అన్నారు.
అలాగే ప్రతీ నెలా మొదటి తేదీన అర్హులు, అవసరమైన వ్యక్తులకు పెన్షన్లు ఇచ్చే కార్యక్రమాన్ని కూడా అత్యంత శ్రద్ధగా చేస్తున్నాం. కూటమి ప్రభుత్వం ఇచ్చే సంక్షేమం లబ్దిదారులకు సరిగ్గా అందుతుందా లేదా అనేది చాలా జాగ్రత్తగా పర్యవేక్షిస్తున్నాం. పాపులేషన్ మేనేజ్మెంట్ ద్వారా దేశానికి జనాబాను సంపదగా మార్చే ప్రయత్నం చేస్తున్నాం. అందుకే మూడు-నాలుగో సంతానానికి ప్రోత్సాహకం ఇచ్చేలా నిర్ణయం కూడా తీసుకుంటున్నామని అన్నారు.
ఇక రాష్ట్రవ్యాప్తంగా రీసర్వే ప్రక్రియ ద్వారా భూముల రికార్డులను ప్రక్షాళన చేసే కార్యక్రమం కూడా చేపడుతున్నాం. వచ్చే ఏడాది మార్చి నాటికి రాష్ట్రంలో ఎక్కడా భూ తగాదాలు లేకుండా చేసే బాధ్యత కూటమి ప్రజా ప్రభుత్వానిది. అధికారంలోకి వచ్చాక 17వ సారి స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పాల్గొంటున్నాను. కేవలం మన పరిసరాలు, ఇల్లు, కార్యాలయాలే కాదు అన్ని ప్రాంతాలూ పరిశుభ్రంగా ఉండేలా మన అలవాట్లూ మారాలి. సమాజంలో మార్పు వస్తేనే స్వచ్ఛాంధ్ర లక్ష్యం సాధ్యం అవుతుంది. 2047 స్వర్ణాంధ్ర విజన్ రూపొందించుకున్నాం. 2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా ఏపీని తీర్చిదిద్దటంతో పాటు రూ.54 లక్షల తలసరి ఆదాయం తీసుకురావటం మా ప్రభుత్వ లక్ష్యం. సమాజంలో ఆర్థిక అసమానతలు తగ్గించి అందరి జీవన ప్రమాణాలు పెంచటమే ఆలోచనగా పనిచేస్తున్నాం. సంక్షేమం, అభివృద్ధికి కూడా నిధులు కావాలి. సంపద సృష్టిస్తేనే సంక్షేమం చేయగలం. పేదవాళ్లకు చేయూతను ఇచ్చేలా పీ4 కార్యక్రమం చేపట్టామని అన్నారు.
మార్గదర్శి బంగారు కుటుంబాలుగా వ్యవహరించి పేదరికాన్ని రూపుమాపేలా ప్రయత్నం చేస్తున్నాం. సమాజంలో సంపద కలిగిన 10 శాతం మంది దిగువన ఉన్న 20 శాతం మందిని ఆదుకునేలా పీ4 కార్యక్రమం చేపట్టాం. 2047 నాటికి ప్రపంచంలోనే అగ్రస్థాయి దేశంగా భారత్ మారుతుంది. ప్రధాని మోదీ నేతృత్వంలో ఈ లక్ష్యం సాధిస్తాం. గత పాలకులు రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. 2019-24 మధ్య అరాచకం సృష్టించారు. నరకాసురుడు అనే రాక్షసుడిని చంపిన రోజును దీపావళిగా మనం జరుపుకుంటున్నాం. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తు అది. గత పాలకులు చేసిన చెడును మర్చిపోలేం. 86 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను గత పాలకులు వదిలేసి వెళ్లారు. దానిని తొలగించేందుకు ప్రయత్నిస్తూనే ఉన్నాం. చెత్త నుంచి విద్యుత్ తయారు చేసేలా ప్లాంట్లను రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్నాం. ప్రతీ ప్రాంతంలో వస్తున్న చెత్త కాంపోస్టుగా, సర్క్యులర్ ఎకానమీ లేదా విద్యుత్ తయారీ ప్లాంట్లకు తరలించేలా ప్రయత్నం చేస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా చెత్తను వేరు చేయడానికి సెగ్రిగేషన్ ప్లాంట్లను ఏర్పాటు చేసాం తద్వారా డంపింగ్ యార్డులకు స్వస్తి పలుకుతున్నాం. నెట్ జీరో క్యాంపస్లుగా రాష్ట్రంలోని హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లను తయారు చేస్తున్నాం. వ్యర్థాలు లేకుండా వాటిని స్వచ్ఛమైన క్యాంపస్ లు గా రూపొందిస్తున్నాం. ప్రతీ ప్రభుత్వ కార్యాలయం పైనా సోలార్ రూఫ్ టాప్ ద్వారా విద్యుత్ ఉత్పత్తి చేయాలని నిర్ణయించాం. ముస్తాబు కార్యక్రమం ద్వారా విద్యార్థులలోనూ పరిశుభ్రతను, ఆత్మవిశ్వాసాన్ని నేర్పేలా అమలు చేస్తున్నాం. స్వచ్ఛ రథాల ద్వారా ఘన వ్యర్థాలు, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరిస్తున్నాం. రాష్ట్రంలోని ప్రాంతాలను 33 శాతం పచ్చదనం వచ్చేలా లక్ష్యాలను నిర్దేశించామని అన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు అవ్వాలి. ఇంచార్జి కమిషనర్ శారదా దేవి.




తిరుపతి ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ఇంచార్జి కమిషనర్ శారదా దేవి పిలుపునిచ్చారు. స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్రలో భాగంగా ప్లాస్టిక్ నివారణపై పాత మునిసిపల్ కార్యాలయం నుండి శనివారం నిర్వహించిన అవగాహన ర్యాలీలో కమిషనర్ తో పాటు గ్రీనరి అండ్ బ్యూటిఫికేషన్ ఛైర్పర్సన్ సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, టిటిడి బోర్డు మెంబెర్ భానుప్రకాష్ రెడ్డి, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ రుద్రకోటి సదాశివం తదితరులు పాల్గొని ప్రారంభించారు. ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాల గూర్చి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర భాగంగా ప్రతి మూడవ శనివారం ఒక థీమ్ తో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 'ప్లాస్టిక్ ఫ్రీ స్టేట్' అనే థీమ్ తో ప్లాస్టిక్ వినియోగం వలన కలిగే నష్టాలను ప్రజలకు వివరించి, పూర్తిగా ప్లాస్టిక్ వినియోగాన్ని అరికట్టడమే లక్ష్యమని తెలిపారు. తిరుపతిని ప్లాస్టిక్ రహితంగా మార్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్ వలన అనేక అనర్థాలు కలుగుతున్నాయని వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలని తెలిపారు. ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులు వంటి పర్యావరణహితమైన వస్తువులను వినియోగించాలని తెలిపారు. ఈ కార్యక్రమం లో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాదవ్, డి.ఈ లు రాజు, వెంకట ప్రసాద్, అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంధ సంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ అధికారి బంటు రాములు జీవిత చరిత్ర



**శేర్లింగంపల్లి ( ప్రజాబలం ప్రతినిధి నరేష్** ( మే 16 పుస్తక... దిశాలి బంటు రాములు పోలీస్ అధికారి. సంఘర్షణ..... ఆవిష్కరణ సందర్భం పురస్కరించుకుని సన్మానించిన తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ ......

ప్రముఖ పోలీసు ఉన్నత అధికారి గ్రామీణ ప్రాంతం నుండి పేదరికాన్ని ఛేదించి ఉన్నత స్థానానికి పోలీస్ డిపార్ట్మెంట్ లో ఎదిగిన బంటు రాములు గారికి ఘనంగా సన్మానం చేసిన తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్.

మారుమూల గ్రామీణ పల్లె కడుమూరులో పుట్టి పేదరికంలో మగ్గుతూ కూడా కష్టపడి చదివి పోలీసంత కానిస్టేబుల్ గా డిపార్ట్మెంట్లో చేరి అంచెలంచెలుగా ప్రమోషన్ల ద్వారా డిఎస్పి ఉన్నత అధికారిగా ప్రమోషన్ పొంది 38 సంవత్సరాలు ఎలాంటి మచ్చ లేకుండా సర్వీస్ చేసిన బంటు రాములు గారికి తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ బృందం బంటు రాములు స్వగృహం సందర్శించి ఆయనను కలిసి ఘనంగా శాలువాతో సత్కరించి కొనియాడి, శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. పేదరికంలో చిన్న పల్లె జీవితం కడుమూరు నుండి కష్టపడి చదివి ఎదగడం గొప్ప విశేషం తన పిల్లలను గొప్పగా చదివించి ప్రయోజకులుగా చేసి అమెరికా బ్రిటన్ ఆస్ట్రేలియా సౌదీ అరేబియా లాంటి దేశాలకు కూడా అత్యున్నత పరిజ్ఞాన చదువులు నేర్పించి ప్రయోజకుల చేయడం కొనియాడదగిన విశేషం. తన యొక్క జీవిత విశేషాలను మిత్రుడు జగదీష్ బిక్షమయ్య వాళ్ళ సహకారం ద్వారా జీవిత గాథ....ఆత్మ రాయించడం పేద విద్యార్థులకు పేదలైన బాల బాలికలకు మంచి మార్గదర్శనంగా పనికొస్తుందని బంటు రాములు ని వేనోళ్ల అందరు పేర్కొనడం జరిగింది. బంటు రాములు దీశాలి పోలీస్ ఆఫీసర్ గా కఠినమైన కేసులను కూడా పరిష్కరించి కుప్పం కారం చెడు లాంటి అతి భయంకరమైన కేసులను ఛేదించి తప్పు చేసిన వాళ్లను శిక్షించే వరకు నిద్రపోని పోలీస్ ఆఫీసర్
బం టు రాములు.

దేశ సేవ చేయడమే కాకుండా రాష్ట్రానికి ఎన్నో మేలు చేసే పనులు చేసి తన కుటుంబాన్ని కూడా అత్యున్నత స్థాయికి తీసుకెళ్లిన ఏకైక వ్యక్తి అధీకారిబంటు రాములు అని రాంచందర్ యాదవ్ కొని ఆడడం , ముఖ్యంగా బంటు రాములు తన యొక్క రిటైర్మెంట్ తర్వాత యూట్యూబ్ ఛానల్ పెట్టి బిక్షమయ్య సహాయంతో పేదలకు సేవ చేయడం అదేవిధంగా తన సొంత ఊరు అయిన కడుమూరు మండల్ పూడూరు లో కూడా విద్యార్థులకు సహాయం చేసి పుస్తకాలు నోట్బుక్స్ పంపించడమే కాకుండా ఇద్దరూ ఉపాధ్యాయులను ప్రత్యేకంగా నియమించి వారికి జీతం డబ్బులు కూడా భరించినా బంటు రాములు కి ధన్యవాదాలు తెలిపి సేవకు ప్రజానీకం గుర్తిస్తుందని చెప్పడం జరిగింది అనేక సేవా కార్యక్రమం చేయడమే కాకుండా పేద జనులకు తన సలహాలు ఇవ్వడం కాకుండా కష్టాల్లో ఉన్నవారికి చేతనైనంత ఆదుకోవడం ఆయన ఒక అభిలాష రామచందర్ యాదవ్ సొంత ఊరైన మిట్ట కంకల్ గ్రామం పూడూరులో కూడా విద్యార్థులకు సహాయం చేసే క్రమంలో ప్రతి పనిలో బంటు రాములు నాతో కలిసి రావడం సంతోషంగా ఉందని ఇకముందు కూడా బంటు రాములు గారు ప్రజా సేవ చేస్తూ ముఖ్యంగా విద్య ఉద్యోగ సలహాలు ఇస్తూ చేతనైన సహాయం పేదలకుచేసి సమాజంలో మంచి పేరు తెచ్చుకోవాలని బేరి రామచంద్ర యాదవ్ పుస్తకావిష్కరణ తర్వాత ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బేరి రామచంద్ర యాదవ్ తో పాటు ఆర్కే సాయన్న ముదిరాజ్ బీసీ ఫెడరేషన్ అధ్యక్షులు యువ నాయకుడు చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొని పుస్తకావిష్కరణతో పాటు సన్మానం కూడా చేయడం జరిగింది బంటు రాములు గ బేరీ రామచంద్ర యాదవ్ బృందానికి ధన్యవాదాలు తెలిపారు .

# వైభవంగా శ్రీశనేశ్వర జయంతి వేడుకలు...

## వేలాదిగా శనీశ్వర స్వామిని దర్శించిన భక్తులు....



శ్రీ పరాభవ నామ సంవత్సరం వైశాఖమాసం మాసం కృష్ణ పక్షం అమావాస్య శనివారం, నాడు బీజినేపల్లి మండలం పరిధిలోని నంది వడ్డేమాన్ గ్రామంలో గల శ్రీశనేశ్వర స్వామికి భక్తులచే శని గ్రహదోష నివారణకు స్వామివారికి తిలతైలా అభిషేకలు భక్తితో వేదమంత్రచరణల మధ్య జరిగాయి. శ్రీసార్ధాసప్త జేష్టమాత సమేత శనేశ్వర స్వామికి శనీశ్వర జయంతి సందర్భంగా అమావాస్య తిథిలోశనివారం నాడు ప్రత్యేకంగా తిలతైల అభిషేకాల పూజలు, అష్టోత్తరపూజలు, అర్చనలునిర్వహించారు.ఆలయ ప్రధాన అర్చకులు డాక్టర్ గవ్వమఠం విశ్వనాథ శాస్త్రి మాట్లాడుతూ వివిధ ప్రాంతాల నుండి వేలాది భక్తులు స్వామివారిని దర్శించి కృపాకటాక్షాలు పొందారని అన్నారు.ఈ మాసంలో స్వామివారిని కొలిచిన అత్యధిక సంతృప్తి పొంది విశేష ఫలితాన్ని భక్తులకు ఇస్తారని ఆయన అన్నారు.ప్రతి ఒక్కరు జన్మ రిత్యా,గోచార రీత్యా శనిగ్రహ దోష నివారణకు స్వామివారిని శక్తిమేరకు పూజించాలని అన్నారు. ఈ



ఆలయంలో గోన బుద్ధారెడ్డి కాలంనాటి బ్రహ్మసూత్రం గల పరమశివునికి భక్తులచే రుద్రాభిషేక పూజలు, అర్చనలు,దీపారాధన నందీశ్వర స్వామి వారికి ప్రత్యేక అర్చనపూజలు భక్తులచేనిర్వహించారు.అనంతరం భక్తులకు వేద ఆశీర్వచనం తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.ఈకార్యక్రమం లో ఆలయ ఆలయ చైర్మన్ వెల్దండ గోపాల్ రావు, గ్రామ సర్పంచ్ టి.సుగుణమ్మ,కమిటీ సభ్యులు కెంచె రాజేష్, ప్రభాకరచారి,పుల్లయ్య, అడ్వకేట్ వీర శేఖర్ చారి, శ్రీకాంత్ రెడ్డి,ఆలయ ఆర్చకులు శాంతి కుమార్, ఉమమహేశ్వర్,సిబ్బంది గోపాల్ రెడ్డి

# ప్రభుత్వ ఆసుపత్రిలో రోగి సహాయాకులకు అన్నప్రసాద పంపిణీ ...

## నాగర్ కర్నూల్ పూజారి బూర్గుల నరసింహారావు సేవాతత్పరత...



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని హౌసింగ్ బోర్డ్ కు చెందిన బూర్గుల నరసింహారావు 2014 నుండి ప్రతి నెలలో ఒకరోజు రోగి సహాయకులకు ప్రభుత్వ సాధారణ ఆసుపత్రిలో అన్న ప్రసాద పంపిణీ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.దత్త జయంతి,కార్తీక పౌర్ణమి, అమావాస్య,పౌర్ణమి ప్రత్యేక రోజులలో తప్పనిసరిగా నెలలో ఏదైనా ఒక రోజు 150 మందికి రోగి సహాయకులకు అన్నప్రసాదం,స్వీట్లు,మజ్జిగ,పండ్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.ఈరోజు వైశాఖ అమావాస్య పురస్కరించుకొని శనీ వారం నాడు ప్రభుత్వ ఆసుపత్రిలో అన్న ప్రసాద పంపిణీ ,మజ్జిగ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మహతి,తులసి శర్మ , ఆదర్శ శర్మ, మల్లికార్జున్, రాము,గురునాథ్ గౌడ్, హెల్ప్ డెస్క్ఇంచార్జ్ టి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

# జరాసంగం మండలం బర్దిపూర్ లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాన్ని సందర్శించిన మంత్రి

## దస్తగిరి మహారాజ్ ఆశ్రమంలో శని అమావాస్య స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు





**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 16 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ,, సంగారెడ్డి జిల్లా జడ సంఘం మండలం, బర్దిపూర్,లోని ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం, శ్రీ దత్తగిరి మహారాజ్, ఆశ్రమంలోని శని అమావాస్య, శ్రీ శనీశ్వర జయంతి సందర్భంగా, అష్టోత్తర సహస్ర,తీల తైల ఘట్టాభిషేకం యజ్ఞం, జేష్టా దేవి శనీశ్వర స్వామి, వారి కళ్యాణం లో పాల్గొన్నారు, అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ కార్యక్రమంలో నిజాంబాద్అర్బన్ శాసనసభ్యులు, శ్రీ ధన్పాల్ సూర్యనారాయణ గుప్తా, మార్కెట్ కమిటీ చైర్మన్ సుధాకర్ రెడ్డి, మాజీ చైర్మన్ రామ్ రెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు, భక్తుడు పెద్ద ఎత్తున పాల్గొన్నారు....

# స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమం

## నిర్వహించిన ప్రకాశం జిల్లా పోలీసులు

### ప్లాస్టిక్‌ను నిషేధించి, పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్రతి నెల మూడో శనివారం పర్యావరణ పరిరక్షణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర (ఎ౨ఎ) కార్యక్రమంను ప్రకాశం జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు, ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్ లో మరియు జిల్లా పోలీస్ కార్యాలయంలో పోలీస్ అధికారులు మరియు సిబ్బంది కలిసి స్వచ్ఛత, శుభ్రత కార్యక్రమాలు చేపట్టి, (ఎ౨ఎ) ప్రతిజ్ఞ ను కూడా చేశారు. పోలీస్ కార్యాలయ ఆవరణను శుభ్రం చేయడంతో పాటు చుట్టుపక్కల చెత్తను తొలగించి, పిచ్చి మొక్కలను గుణపం, పారలతో తీసివేశారు. ఇలా శుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ, పర్యావరణ పరిరక్షణకు తమ పాత్రను పోషించారు. పర్యావరణాన్ని కలుషితం చేసే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాలనీ, వస్త్ర సంచులు, జనపనార సంచులు, కాగితపు సంచులు వంటి వాటిని ఉపయోగించాలని, ఒక్కసారి ఉపయోగించి పారేస్తున్న ప్లాస్టిక్ వస్తువులు ఏళ్ల పాటు ప్రకృతిలో కరుగకుండా ఉండి, మానవజాతికి, వన్యప్రాణులకు, మరియు సముద్ర జీవరాశికి ముప్పుగా మారుతున్నాయని, ఈ విషయంలో ప్రతీ ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,మన చుట్టూ ఉండే పరిసరాలను శుభ్రంగా ఉంచడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు గారు సూచించారు. మనం తీసుకునే చర్యలు రేపటి తరాల ఆరోగ్యాన్ని ప్రభావితం చేస్తాయని గుర్తించి, పరిశుభ్రతపై మనం చూపే శ్రద్ధ వారికి మంచి జీవన వాతావరణాన్ని అందించడంలో కీలకమవుతుందన్నారు.జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మన చుట్టుపక్కల పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ఆహ్లాదకరమైన, ప్రశాంతమైన వాతావరణం నెలకొంటుందని అందువలన మనసు ప్రశాంతతతో కూడి ఆరోగ్యకర వాతావరణంలో, క్రమశిక్షణగా విధులు నిర్వర్తించొచ్చు.

# నూతనంగా ఎన్నికైన టీవైజేఎఫ్ వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్‌కు ఘన సన్మానం



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 16 (ప్రజాబలం)** సంగారెడ్డి జిల్లా:తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీవైజేఎఫ్) వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నూతనంగా ఎన్నికైన షేక్ మహబూబ్‌క కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకులు మొహమ్మద్ ఆబిద్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం నిర్వహించారు.


ఈ సందర్భంగా షేక్ మహబూబ్‌కు గజమాల వేసి, శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మొహమ్మద్ ఆబిద్ మాట్లాడుతూ, టీవైజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సీనియర్ జర్నలిస్ట్ డాక్టర్ తనుగుల జితేందర్ రావుకు మైనార్టీ వర్గాల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. షేక్ మహబూబ్‌కు సంస్థలో కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు మమ్మద్ బాబా, షేక్ అజరుద్దీన్, మమ్మద్ నజీర్, చోటు ఖాన్, ఉమర్, సోహెల్, లతీఫ్, మహమ్మద్ ఆసిఫ్, మహమ్మద్ చోటు బషీర్ తదితరులు పాల్గొని షేక్ మహబూబ్‌కుశుభాకాంక్షలు తెలియజేశారు.

# జాతీయ డెంగ్యూ దినోత్సవం




బ్రహ్మంగారిమఠం మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలోని ప్రాథమిక వైద్యశాల నుంచి డాక్టర్ సంపత్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బందిచే ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీలో మెడికల్ ఆఫీసర్ సంపత్ కుమార్ తో పాటు హెల్త్ అసిస్టెంట్లు మాధవ,వెంకటరెడ్డి,ల్యాబ్ టెక్నీషియన్ రమణ కుమార్,స్టాఫ్ నర్స్ లలితమ్మ,ఫిమేల్ హెల్త్ అసిస్టెంట్లు జోత్స్న,విజయ లక్ష్మి అలాగే ఆశా వర్కర్లు మరియు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ఎవరి ప్రమేయం లేని యాదృచ్ఛిక సంఘటన.

**రాజేంద్రనగర్ ప్రజాబలం ప్రతినిది 16 మే 2026**ప్రజలకు రాజ్యాంగం కల్పించిన నీటి హక్కు కోసం జరుగుతున్న వాక్ ఫర్ వాటర్ సమీక్ష శు క్రవారం రోజున మణికొండ డాలర్ హిల్ లో ఉదయం జరిగింది. సమావేశానంతరం కొంత మంది లిఫ్ట్ లో దఫాలుగా కిందికి దిగడం, తదనంతరము మిగిలిన వారితో పాటు (కుంభగల్ల ధన్రాజు, యాలాల కిరణ్) మేము కూడా లిఫ్టో వస్తున్న నేపథ్యంలో లిఫ్ట్ బ్యాలెన్స్ తప్పడం వలన దుర్ఘటన జరిగింది. యాదృచ్ఛికంముగా జరిగిన సంఘటనలో ఎవరి ప్రమేయం లేదని గంటా పదముగా తెలియ పరుస్తు, ఇట్టి దరిమిలా మాకు కాలికి గాయములు అయిన సందర్భంగా మేము మాతో పాటు లిఫ్ట్ లో ఉన్న ప్రతి ఒక్కరము సంపూర్ణ ఆరోగ్యముగా ఉన్నామని తెలియ చేస్తూ ఈ విషయమై మా ఆరోగ్య పరిస్థితిని ప్రత్యక్షముగా, పరోక్షంగా పరామర్శించిన మిత్రు లంధరికి ధన్యవాదములు తెలియ జేసుకుంటు: ప్రజా సంక్షేమం కోరుతూ మే 17 ఆదివారం సాయంత్రం 4 గంటలకు నిర్వహించ బడనున్న వాక్ ఫర్ వాటర్ కార్యక్రమాన్ని పిల్లల భవిష్యత్తు దృష్ట్యా విజయవంతం చేయాలని అందుకు ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయ వలసిందిగా వినమ్ర పూర్వక విజ్ఞప్తి. ఇట్లు భవదీయులు కుంభగల్ల ధన్రాజు, యాలాల కిరణ్.

# షెడ్యూల్డ్ కులాల విద్యార్థులకు బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

## :: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కొమురయ్య



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి మే 16**ములుగు జిల్లాలోని షెడ్యూల్డ్ కులాలకు చెందిన విద్యార్థులకు 2026--27 విద్యా సంవత్సరానికి బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ పథకం ద్వారా 1వ తరగతి, 5వ తరగతిలో ప్రవేశాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ములుగు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి కొమురయ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద జిల్లాకు 1వ తరగతికి 20 సీట్లు, 5వ తరగతికి 22 సీట్లు కేటాయించబడినట్లు పేర్కొన్నారు. అర్హత కలిగిన విద్యార్థులు 15.05.2026 నుండి 06.06.2026 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

ములుగు జిల్లాలో ఎంపిక చేయబడిన పాఠశాలలు: ఆదర్శ హై స్కూల్, కమలాపురం -- (ఇంగ్లీష్ మీడియం, డే స్కాలర్)

సాధన హై స్కూల్, ములుగు -- (డే స్కాలర్)

శ్రీ అరవింద విద్యా మందిర్ హై స్కూల్, ములుగు -- (డే స్కాలర్)

సన్ రైసర్స్ హై స్కూల్, ములుగు -- (డే స్కాలర్ / రెసిడెన్షియల్)

అర్హతలు:

ఒక కుటుంబం నుండి ఒక విద్యార్థి మాత్రమే ఈ పథకానికి అర్హుడు.

తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలకు రూ.1,50,000/- లోపు, పట్టణ ప్రాంతాలకు రూ.2,00,000/- లోపు ఉండాలి.

కావాల్సిన ధ్రువీకరణ పత్రాలు ::

జనన ధృవీకరణ పత్రం (1వ తరగతి విద్యార్థులకు మాత్రమే) 1వ తరగతికి విద్యార్థులు 01.06.2020 నుండి 30.06.2021 మధ్య జన్మించి ఉండాలి.

5వ తరగతికి దరఖాస్తు చేసే విద్యార్థులు 4వ తరగతి స్టడీ సర్టిఫికేట్ జతచేయాలి.

రేషన్ కార్డు / ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ.

మీ-సేవ ద్వారా జారీ చేసిన కుల, ఆదాయ, నివాస ధృవపత్రాలు.

మూడు పాస్‌పోర్ట్ సైజు కలర్ ఫోటోలు.

గత విద్యా సంవత్సరపు మార్కుల మెమో జిరాక్స్ కాపీ.

ఆసక్తి గల విద్యార్థులు ములుగు జిల్లా సంక్షేమ భవనంలోని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం నుండి దరఖాస్తు ఫారములు పొందవచ్చని తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను 06.06.2026 సాయంత్రం 4.00 గంటలలోపు కార్యాలయంలో సమర్పించాలని ఆయన ఆ ప్రకటనలో కోరారు.

# వరదల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ ఏర్పాట్లను పరిశీలించిన :: ఆర్డీవో వెంకటేష్



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 16 2026** 18వ తేదీ సోమవారం రోజున ములుగు జిల్లాలో నిర్వహించనున్న వరదల నిర్వహణ మాక్ ఎక్సర్సైజ్ ఏర్పాట్లను శనివారం ఆర్డీవో వెంకటేష్ పరిశీలించారు.

ఈ సందర్భంగా వివేకానంద కాలనీ, కృష్ణన్ కాలనీ, పల్సాబ్‌పల్లి, ములుగు ప్రాంతాల్లో చేపట్టనున్న వాస్తవిక వరద మాక్ డ్రిల్‌కు సంబంధించిన ముందస్తు ఏర్పాట్లను ఆయన సమీక్షించారు.

ఈ సందర్భంగా ఆర్డీవో వెంకటేష్ మాట్లాడుతూ మాక్ డ్రిల్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసి సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి నాగరాజు, సీపీఓ ప్రకాష్ జిల్లా నీటిపారుదల శాఖ అధికారి అప్పలనాయుడు, డిఎంహెచ్వో గోపాలరావు, మత్స్యశాఖ అధికారి సాల్మన్ రాజు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో 3వశనివారం మియాపూర్ లో అన్నదాన కార్యక్రమం ..



**మియాపూర్ ప్రజాబలం ప్రతినిధి.. నరేష్**అట్టేపల్లి లక్ష్మీనారాయణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ప్రజా నాయకులు అట్టేపల్లి రామప్రభు ఆధ్వర్యంలో 3వ శనివారం మియాపూర్ లో అన్నదాన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ పి టీమ్ సభ్యులు సేవాభావంతో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పేద మరియు అవసరత ఉన్న ప్రజలకు అన్నదానం చేయడం ఎంతో ఆనందంగా ఉందని అన్న దానం మహాదానం అని అట్టేపల్లి రామప్రభు తెలిపారు. సమాజ సేవలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏ ఆర్ పి టీమ్ సభ్యులు, ట్రస్ట్ ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# దత్త గిరి క్షేత్రాన్ని సందర్శించిన మంత్రి దామోదర రాజనరసింహ

## శనైశ్వర స్వామికి తైలాభిషేకం
## - జ్యోతిర్లింగాలకు ప్రత్యేక పూజలు
## - ఘనంగా సన్మానించిన పీఠాధిపతులు



**జహీరాబాద్ మే 16 ప్రజాబలం ప్రతినిధి:** సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలం బర్దిపూర్‌లోని దత్తక్షేత్రాన్ని మంత్రి సందర్శించారు. శని అమావాస్య, స్వామి వారి జయంతి, కళ్యాణోత్సవం వేడుకలకు హాజరయ్యారు. క్షేత్రంలోని శ్రీ శనైశ్వర స్వామి దేవాలయంలో స్వామివారి దర్శించుకుని అష్టోత్తర సహస్ర తిల తైల - ఘట్టాభిషేకం యజ్ఞం, జేష్టాదేవి శనైశ్వర స్వామి వారి కళ్యాణం పాల్గొని పట్టు వస్త్రాలను సమర్పించారు. అనంతరం జ్యోతిర్లింగాల వద్ద రుద్రాభిషేకం, మహా మంగళహారతి నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. వారికి ఆశ్రమ పీఠాధిపతులు అవధూత గిరి మహారాజ్, సిద్ధేశ్వరానందగిరి, ట్రస్ట్ చైర్మన్ అల్లాడి వీరేశం ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ప్రత్యేక పూజలు నిర్వహించిన ప్రముఖులు



శనీశ్వర స్వామి శని అమావాస్య, జయంతి సందర్భంగా ఆలయానికి భక్తుల తాకి తోపాటు ప్రముఖుల సందడి నెలకొంది. నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, మాజీ కార్పొరేషన్ చైర్మన్ మఠం బిక్షపతి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు దేవేందర్ రెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్, సంగారెడ్డి, మొగుడంపల్లి, కర్ణాటక బీదర్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# శివగంగా ఎత్తిపోతల పథకాన్ని మరమ్మత్తులు చేసి రైతులకు సాగునీరుఅందించాలి

## ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు

**ఏటూరునాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి మే 16 2026** ములుగు జిల్లా మంగపేట మండలం కత్తి గూడెం గ్రామ శివారులోని గోదావరి ఒడ్డున నిర్మించిన శివగంగ ఎత్తిపోతల పథకం కింద నిర్మించబడిన ఇంటెక్ వెల్ ను ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు రైతులతో పాటు సందర్శించి మాట్లాడుతూ గత ప్రభుత్వాలు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి ఈ ప్రాజెక్టు నిర్మాణం చేయడం జరిగినది కానీ ఇప్పుడు నిరుపయోగంగా ఉన్న శివగంగ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే మరమ్మత్తులు చేసి మరియు గోదావరిలో ఉన్న ఇసుకమేటలను తొలగించి నీళు వచ్చే విధంగా చేసి ఇక్కడ ఉన్న 1500 ఎకరాల రైతులకు నీరు అందించాలని గౌరవ మంత్రి సీతక్క గారికి తెలియజేస్తున్నాను. వెంటనే శివగంగ ఎత్తిపోతల పథకాన్ని రిపేరు చేసి ఇక్కడ సాగు చేస్తున్న 1500 ఎకరాల రైతులకు సాగునీరు అందించాలని ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు.

రైతు ప్రభుత్వం అని చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ ఇప్పటివరకు ఇలాంటి చిన్న ప్రాజెక్టులను పట్టించుకోకపోవడం చాలా బాధాకరమని 1500 ఎకరాల సాగు విస్తీర్ణం ఉన్న ఈ ప్రాజెక్టుపై ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం శ్రద్ధ పెట్టి



రైతులకు నీరు అందించాలని కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆవేదన వ్యక్తం చేశారు

గతబిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే రైతుల అభ్యర్థన మేరకు కేసిఆర్ ఆదేశాలు జారీ చేసినప్పటికీ ఎన్నికలు వచ్చినా సందర్భంగా ఆ పని జరగకుండా ఆగిపోయిందని లక్ష్మణ్ బాబు తెలియజేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం శివగంగా ఎత్తిపోతల ఇంటెక్ వెల్ నిరుపయోగంగా పడి ఉన్న కారణంగా వెంటనే మరమ్మత్తులు చేసి రైతులకు సాగునీరు అందించాలని కోరారు. మరియు శివగంగ ఎత్తిపోతల పథకం కోసం సబ్ స్టేషన్ నిర్మాణాన్ని కూడా పునరుద్ధించాలని కాకులమర్రి లక్ష్మణ్ బాబు డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో స్థానిక రైతులతో పాటుగా బిఆర్ఎస్ పార్టీ నాయకులు తాటి కృష్ణయ్య తుమ్మ మల్లారెడ్డి ఎడ్లపల్లి నరసింహారావు ఎండి వలీ బాబా కూనూరి అశోక్ కాకులమర్రి ప్రదీప్ రావు బాడిషా నాగ రమేష్ చిట్టి మల్ల సమ్మయ్య కొమరం రామ్మూర్తి సిద్ధంశెట్టి లక్ష్మణరావు తుక్కాని శ్రీనివాస్ యలవర్తి శ్రీనివాసరావు కర్రి శ్రీను సుదర్శన్ సంతోష్ హుస్సేన్ తదితర బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

# కరీంనగర్ అభివృద్ధికి 895 కోట్లు: కేంద్రం పచ్చజెండా

కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం 895 కోట్లతో ప్రతిపాదించిన మూడు ప్రాజెక్టులకు అర్బన్ చాలెంజ్ ఫండ్ కింద సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. కేంద్ర మంత్రి సంజయ్ కుమార్ చొరవతో రహదారులు వరద నివారణ, వ్యర్థాల నిర్వహణ పనులకు ఈ నిధులు అందనున్నాయి. ప్రాజెక్టుల క్షేత్రస్థాయి పరిశీలనకు కేంద్ర అధికారుల బృందం నగరానికి రానుంది మంత్రి సంజయ్ కృషితో కరీంనగర్ మోడల్ సిటీగా మారనుందని అధికారులు తెలిపారు.

## కుందేలు నడకన ఏటూరు నాగారం బస్ డిపో పనులు

## బిల్లులు రాక పడకేసిన పనులు



ఏటూరునాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి మే 16 2026ములుగు జిల్లా ఏటూరు నాగారం డివిజన్లో నూతనంగా బస్సు డిపో ఏర్పాటు చేసిన ఇప్పటివరకు పనులు పడకేసినట్లు కనబడుతుంది ఏటూరు నాగారం సబ్ డివిజన్ గా ఏర్పాటు చేస్తూ బస్ డిపో నిర్మాణం పనులు సీతక్క గారిచే ప్రారంభించిన ఇప్పటివరకు బస్సు డిపో పనులు నామమాత్రంగానే జరుగుతున్నాయి దీనివలన తాడువాయి మంగపేట వాజేడ్ వెంకటాపురం ఏటూరునాగారం చతిస్గడ్ మహారాష్ట్ర ప్రాంత వాసులకు ఏటూరు నాగారంలో బస్ డిపో లేకపోవడంతో బస్సులు అందుబాటులో లేక ప్రయాణికులు చాలా ఇబ్బందులకు గురికావాల్సిన పరిస్థితి కనబడుతుంది అదే ఏటూరునాగారంలో బస్



డిపో ఏర్పాటు చేస్తే హైదరాబాద్ హనుమకొండ వెళ్లడానికి బస్సులు అనుకూలంగా ఉంటాయని ప్రయాణికులు వాపోతున్నారు ప్రతిరోజు బస్సుల కోసం ఏటూరు నగరం బస్టాండ్ వద్ద గంటల తరబడి నిలబడిన ప్రయాణికులకు బస్సులు అందకపోవడం చాలా ఇబ్బందిగా గురుగాల్సిన పరిస్థితి కనపడుతుంది పంచాయతీరాజ్ మినిస్టర్ ధనసరి సీతక్క త్వరగా బస్ డిపో పనులను పూర్తి చేసి ప్రయాణికులకు బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని కోరారు

## ఉట్నూరి భిక్షపతి గారి కుటుంబానికి అండగా ఉంటాం:

## ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు



ఏటూరు నాగారం ప్రజాబలం ప్రతినిధి మే 16 2026ఏటూరునాగారం పట్టణ ప్రముఖ గ్యాస్ సప్లయర్ ఉట్నూరి భిక్షపతి అనారోగ్యంతో అకాల మరణం చెందడం పట్ల ములుగు జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు లికాకులమర్రి లక్ష్మణ్ బాబు తీవ్ర దిగ్భ్రాంతిని, విచారాన్ని వ్యక్తం చేశారు.

ఈ రోజు భిక్షపతి నివాసానికి వెళ్లిన లక్ష్మణ్ బాబు వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను, పిల్లలను పరామర్శించి, ఓదార్చారు. ఈ కష్టసమయంలో కుటుంబానికి పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అన్ని విధాలా అండగా ఉంటానని, పిల్లల భవిష్యత్తుకు పూర్తి భరోసా కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు. భిక్షపతి మరణం పార్టీకి తీరని లోటని ఆయన పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య నాయకులు, కాకులమర్రి ప్రదీప్ రావు , తుమ్మ మల్లారెడ్డి, ఎండి వలీ బాబా,కోనేరు నాగేష్, తాడూరి రఘు,ఎండి షఫీ, కుమ్మరి చంద్రబాబు, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, కొండాయి చిన్ని, పెద్దబోయిన బాలకృష్ణ, ఎస్.కె బాబా,స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు

## వయోధిక పాత్రికేయ సంఘం నూతన కార్యదర్శిగా శ్రీ ఎన్. శ్రీనివాస రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



హైదరాబాద్ ప్రెస్‌క్లబ్ ప్రజాబలం ప్రతినిధి: శనివారంనాడు హైదరాబాద్ ప్రెస్ క్లబ్ లో అధ్యక్షులు శ్రీ దాసు కేశవ రావు గారి అధ్యక్షతన జరిగిన సంఘం కార్యవర్గ సమావేశంలో కార్యదర్శి పదవి నుంచి స్వచ్ఛందంగా తప్పుకున్న శ్రీ కొండా లక్ష్మణ రావుగారి స్థానంలో శ్రీ శ్రీనివాస రెడ్డి ఎన్నికయ్యారు.

సంస్థ ఇరవై ఏళ్ళ క్రితం ఏర్పాటు అయినప్పటి నుంచి ఈ స్థాయికి ఎదగడంలో సంస్థాపక అధ్యక్షులు శ్రీ వరదాచారి గారితో కలిసి నిర్విరామంగా, అలుపెరుగని కృషి చేసిన శ్రీ లక్ష్మణ రావు గారి శ్రమను ప్రశంసిస్తూ సమావేశం తీర్మానించింది.

సంస్థ ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని, ఆయన సొంత ఖర్చుతో కార్యకలాపాలను నిజాయితీతో, నిబద్ధతతో నిర్వహించడం నేను కళ్ళారా చూసాను. ఏ సంస్థ పురోగతి చెందాలన్నా శ్రీ లక్ష్మణ రావు వంటి కష్టజీవుల అవసరం ఎంతైనా వుంటుంది.వయోభారంతో సెలవు తీసుకుంటున్నట్టు ఆయన ప్రకటించి తప్పుకున్నారు.అయితే ముందు ముందు సంస్థ నిర్వహించే కార్యకలాపాలలో ఆయన సహాయ సహకారాలు అందించడానికి వీలుగా సంస్థ గౌరవ సలహా దారుగా వుండాలని సమావేశం ఆయనను అభ్యర్థించింది.

లక్ష్మణ రావు గారికి కృతజ్ఞతలు.

నూతన కార్యదర్శి శ్రీ ఎన్. శ్రీనివాస రెడ్డికి అభినందనలు

## మహిళ హత్య

తిరువూరు ఖమ్మం జిల్లా మధిర పరిధిలో దారుణ ఘటన చోటుచేసుకుంది. కృష్ణాపురం?నక్కలగరుబు రోడ్డుమధ్యలో ఉన్న ఓ ప్రైవేట్ వెంచర్ ప్రాంతంలో మహిళ హత్యకు గురైన ఘటన కలకలం రేపింది.పోలీసుల వివరాల ప్రకారం, మృతురాలు ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం మేడూరు గ్రామానికి చెందిన జి. కల్పన(28)గా గుర్తించారు. ఆమె మధిరలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నట్లు సమాచారం. గుర్తు తెలియని వ్యక్తులు ఆమెను హత్య చేసి అక్కడ పడేసినట్లు పోలీసులు భావిస్తున్నారు.సమాచారం అందుకున్న మధిర రూరల్ సీఐ మధు, రూరల్ ఎస్సై లక్ష్మీభార్గవి సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. హత్యకు గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.మృతదేహాన్ని ఆర్కే ఫౌండేషన్ సహకారంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# యువతి అదృశ్యం



జహీరాబాద్, మే 16 ప్రజాబలం ప్రతినిధి: జహీరాబాద్ మండల పరిధిలోని హుగ్గేల్లి గ్రామంలో యువతి అదృశ్యమైనట్లు రూరల్ ఎస్సై కాశీనాథ్ ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామానికి చెందిన జంబుల అపర్ణ అనే యువతీ ఈనెల 11న ఉదయం ఇంట్లో నుండి వెళ్లి తిరిగి రాలేదని, ఆమె కోసం కుటుంబ సభ్యులు వెతికిన ఆచూకీలాభ్యం కాలేదని యువతి తండ్రి నర్సింలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. యువతి ఇంట్లో ఉండి వెళ్ళేటప్పుడు నలుపు రంగు, తెల్లని పూల డిజైన్ గల పంజాబీ డ్రెస్ ధరించి ఉందన్నారు.ఎత్తు 5.2 కలిగి చామన చాయ వర్ణంలో గుండ్రని ముఖం కలిగి ఉంటుందన్నారు ఎవరికైనా యువతి ఆచూకీ తెలిస్తే జహీరాబాద్ రూరల్ పోలీసులు, 8712661847, 87126 56746 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

## జర్మనీలో నర్సింగ్ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

### తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM) ఆధ్వర్యంలో ప్రత్యేక నియామక కార్యక్రమం

జహీరాబాద్/సంగారెడ్డి, మే 16 ప్రజాబలం ప్రతినిధి: తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్ (TOMCOM) ఆధ్వర్యంలో జర్మనీలో నర్సింగ్ ఉద్యోగ అవకాశాల కోసం అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి బి. రవికిరణ్ రెడ్డి తెలిపారు.

ఈ నియామక కార్యక్రమాన్ని జర్మనీకి చెందిన ప్రముఖ రిక్రూట్‌మెంట్ సంస్థ “బిల్డర్ ఎంప్లాయ్‌మెంట్ ఏజెన్సీ ” మరియు జర్మన్ అంతర్జాతీయ సహకార సంస్థ సమన్వయంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎంపికైన అభ్యర్థులకు జర్మన్ భాషా శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మొత్తం 90 పోస్టులను భర్తీ చేయనున్నారు. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ మే 18, 2026 కాగా, ఇంటర్వ్యూలు జూలై 8 నుంచి 17 వరకు నిర్వహించబడతాయని పేర్కొన్నారు.

తెలంగాణకు నివాసితులు/ తెలంగాణలో గుర్తింపు పొందిన జి ఎన్ ఎం / బీఎస్సీ నర్సింగ్ కాలేజీల నుండి పూర్తి చేసి ఉండాలని,వయస్సు 22 నుండి 38 సంవత్సరాల మధ్య ఉండాలని, GNM అభ్యర్థులకు కనీసం మూడు సంవత్సరాల అనుభవం ఉండాలని తెలిపారు.ఇండియన్ నర్స్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ ఉండాలని, వృద్ధాప్య సంరక్షణ, పాలియేటివ్ కేర్ లో,ఆసుపత్రి సేవలు, ఇంటెన్సివ్ కేర్, జెరియాట్రిక్, కార్డియాలజీ, జనరల్ సర్జికల్, మెడికల్ వార్డ్ వంటి విభాగాల్లో అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

ప్రాథమిక ఇంటర్వ్యూలో ఎంపికైన వారికి జర్మన్ భాషా శిక్షణ అందించబడుతుందని, ఆరు నెలల శిక్షణలో 70 శాతం మార్కులు సాధించిన వారికి మాత్రమే కార్యక్రమంలో కొనసాగింపు ఉంటుందని తెలిపారు అనంతరం దీ1 మరియు దీ2 స్థాయి పరీక్షలు నిర్వహించ బడతాయని, దీ1 స్థాయిలో 70 శాతం మార్కులు సాధించిన అభ్యర్థులకు జర్మనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించబడతాయని పేర్కొన్నారు.

జర్మనీలో ప్రారంభ వేతనం నెలకు సుమారు 2300 యూరోలని (భారత కరెన్సీలో సుమారు రూ.2.2 లక్షలు) కాగా, అనుభవం అనంతరం సుమారు 3 లక్షల వరకు పెరిగే అవకాశం ఉందని తెలిపారు.

ఆసక్తి గల అభ్యర్థులు తమ రెజ్యూమ్ ను germanytriplewin2025@gmail.com కు ఈనెల 18 వ తేదీ లోపు పంపాలని సూచించారు.మరిన్నివివరాలకు 9440049645, 9440052081, 9440051581 నంబర్లను సంప్రదించవచ్చని,అదనపు సమాచారం కోసం TOMCOM అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చని తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభకు పురస్కారం

### పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలు సాధ్యం - - కలెక్టర్ మను చౌదరి

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం మే 16:ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక విద్యా వారోత్సవాలలో భాగంగా నేడు కలెక్టర్ ఆవరణంలో జరిగినటువంటి విద్యా విజయోత్సవం కార్యక్రమంలో




పదవ తరగతి టాప్ టెడిన్ అదేవిధంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో టాప్ టెన్ మరియు క్రీడా విభాగంలో టాప్ 3 విద్యార్థులను మరియు ఉల్లాస్ వాలంటీర్స్ బాగా పనిచేసినటువంటి ముగ్గురిని గౌరవ కలెక్టర్ చేతుల మీదుగా సత్కరించడం జరిగినది. మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పదివేల రూపాయల పారి తోషికముతో పాటు ఒక మెమెంటో మరియు అప్రిషియేషన్ సర్టిఫికెట్ను ప్రధానం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో గౌరవ జిల్లా కలెక్టర్ మను చౌదరి గారు విద్యార్థులను ఉద్దేశిస్తూ భవిష్యత్తులో విద్యార్థులు మంచి స్థానాలను చేరుకోవడానికి తగిన మార్గ నిర్దేశం చేయడం జరిగింది. ఈ సందర్భంగా తన స్కూల్ నాటి అనుభవాలను విద్యార్థులతో పంచుకోవడం జరిగింది. నేను ఏ జిల్లాలో పనిచేసినప్పటికీ ఈనాడు ప్రతిభా పురస్కారాలు అందుకుంటున్నటువంటి విద్యార్థులు వారి ఉన్నత చదువుల కోసం మంచిగా చదువుకోవడానికి కావలసినటువంటి వసతులు కల్పించడానికి నేను ఎల్లవేళలా మీకు అందుబాటులో ఉంటానని మాట ఇచ్చి విద్యార్థులలో ఒక నూతన ఉత్తేజాన్ని నింపడం జరిగింది. గౌరవ జిల్లా విద్యాశాఖ అధికారి ఐ విజయ కుమారి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కూడా మంచి ప్రతిభావంతులైనటువంటి విద్యార్థులు చదువుకోవడం నాకు గర్వకారణంగా ఉంది అంటూ చెబుతూ జిల్లా ఫలితాలలో భాగస్వామ్యం వహించినటువంటి పాఠశాలల ప్రధానోపాధ్యాయులను మరియు ఉపాధ్యాయులను ఎంతగానో ప్రశంసించడం జరిగినది. మున్ముందు అనేక మంచి ఫలితాలను సాధించి మంచి ఉజ్వల భవిష్యత్తు లో స్థిరపడాలని విద్యార్థులను దీవించడం జరిగింది. ర్యాంకులు సాధించినటువంటి విద్యార్థులతో మరియు తల్లిదండ్రులతో ఉపాధ్యాయులతో వారు జీవితకాల జ్ఞాపకార్థం ఫోటో సెషన్స్ కు గౌరవ కలెక్టర్ అత్యంత ఇష్టంతో పాల్గొనడం జరిగింది.

## పాడి రైతులు ఇంధన పొదుపు చేయాలి

హనుమాన్ జంక్షన్‌ప్రధాని, ముఖ్యమంత్రి సూచనలతో ఇంధన పొదుపు చర్యలు కృష్ణా మిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు చేపట్టారు. పాడి రైతులతో కలిసి అయన సైకిల్ యాత్ర చేసారు. హనుమాన్ జంక్షన్ పరిసర ప్రాంతాల గ్రామాలకు సైకిల్పై ప్రయాణం సాగిస్తూ పాడి రైతులతో మాట్లాడారు. “పాడి రైతు సంక్షేమం మన మతం - అలుపెరగని సేవ మన అభిమతం” అనే కార్యక్రమంలో పాల్గొని ఇంధన పొదుపు చర్యలు ను రైతులకు వివరించారుఏ.చలసాని ఆంజనేయులు మట్లాడుతూ రైతుల సమస్యలు, పాల ఉత్పత్తి అభివృద్ధి, రైతు సంక్షేమం, సహకార రంగ బలోపేతంపై నే మా ఆలోచన. సమితి చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను అందరూ తెలుసుకోవాలి.

# తెలంగాణలో ఓటర్ల ప్రత్యేక ముమ్మర సవరణ

## షెడ్యూల్ విడుదల: సీఈఓ సి.సుదర్శన్ రెడ్డి




**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 16 2026**శనివారం బి.ఆర్.కె.ఆర్ భవన్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్ల తో సీఈవో సి.సుదర్శన్ రెడ్డి, అదనపు సీఈఓ డాక్టర్ వాసం వెంకటేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ అదనపు కార్యదర్శి శంకర్ లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సమావేశానికి ములుగు జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ సిహెచ్ మహేందర్ జి హాజరయ్యారు.

ఈ సందర్భంగా సీఈఓ సి.సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సవరణ ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలను, షెడ్యూల్ వివరాలను వెల్లడించారు.

ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ ఐ ఆర్) షెడ్యూల్ వివరాలు.

రాష్ట్రంలో ఓటర్ల సవరణ ప్రక్రియ క్రింది విధంగా సాగనుంది:

ఇంటింటి గుర్తింపు 25 జూన్ 2026 నుండి 24 జూలై 2026 వరకు జరగనుంది.

ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ 31 జూలై 2026 జరుగుతుంది.

అభ్యంతరాలు, క్లెయిమ్‌ల దాఖలు కాలపరిమితి:లిలి 31 జూలై 2026 నుండి 30 ఆగస్టు 2026 వరకు దాఖలాలు చూసుకోవచ్చు.

31 జూలై 2026 నుండి 28 సెప్టెంబర్ 2026 వరకు నోటీసుల జారీ, విచారణ, అభ్యంతరాల పరిష్కారం.

01 అక్టోబర్ 2026 తుది ఓటర్ల జాబితా ప్రచురణ జరుగుతుందన్నారు.

ముఖ్యమైన మార్గదర్శకాలు నిబంధనలు

బీఎల్‌ఓల బాధ్యత బూత్ స్థాయి అధికారులు (బి ఎల్ ఓ) ప్రతి ఓటరు ఇంటికి వెళ్లి, పాక్షికంగా ముద్రించిన ఎన్యుమరేషన్ ఫారాలను (ఈ ఎఫ్) అందించి, వాటిని పూరించడంలో సహాయపడి సేకరిస్తారు. ఇందుకోసం బీఎల్‌ఓలు ప్రతి ఓటరు ఇంటిని కనీసం 3 సార్లు సందర్శించాల్సి ఉంటుందని పేర్కొన్నారు



ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారాలను భారత ఎన్నికల సంఘం వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో కూడా సమర్పించవచ్చని స్పష్టం చేశారు.

ఓటర్ల సహాయం కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950 ను సంప్రదించవచ్చు లేదా వెబ్‌సైట్/యాప్ ద్వారా 'బుక్ ఏ కాల్ విత్ బీఎల్‌ఓ'సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చు తెలిపారు.

గుర్తింపు ప్రక్రియలో ఎన్యుమరేషన్ ఫారం (ఈ ఫ్) మినహా ఎలాంటి ఇతర పత్రాలు సేకరించబడవు.ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ తర్వాత, లింకింగ్ సరిగ్గా లేని లేదా వ్యత్యాసాలు ఉన్న ఓటర్లకు ఈఆర్‌ఓ ఈ ఆర్ వో నోటీసులు జారీ చేస్తారు. అటువంటి వారు తమ పుట్టిన తేదీ/స్థలాన్ని ధృవీకరించే పత్రాలను పాస్‌పోర్ట్, బర్త్ సర్టిఫికేట్, ఆధార్, ప్రభుత్వ గుర్తింపు కార్డులు మొదలైనవి ఈ క్రింది నిబంధనల ప్రకారం సమర్పించాల్సి ఉంటుంది.

01.07.1987 కంటే ముందు జన్మించిన, కేవలం స్వంత ధృవీకరణ పత్రాలు.01.07.1987 -- 02.12.2004 మధ్య జన్మించిన వారు స్వంత పత్రాలతో పాటు తల్లి లేదా తండ్రి ధృవీకరణ పత్రం.02.12.2004 తర్వాత జన్మించిన వారు స్వంత పత్రాలతో పాటు తల్లి , తండ్రి ఇద్దరి ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉంటుంది.

మొత్తం అసెంబ్లీ నియోజకవర్గాలు: 119 (జనరల్: 88, ఎస్సీ: 19, ఎస్టీ: 12).

మొత్తం పోలింగ్ కేంద్రాలు:35,985 (పట్టణ ప్రాంతాల్లో: 14,750, గ్రామీణ ప్రాంతాల్లో: 21,157). ఇందులో 1200 కంటే తక్కువ ఓటర్లు ఉన్న కేంద్రాలు 28,653 కాగా, 1200 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న కేంద్రాలు 7,332.

ఎన్నికల యంత్రాంగం

జిల్లా ఎన్నికల అధికారులు డిఇఓ - 33

ఓటర్ల నమోదు అధికారులు ఈ ఆర్ ఓ- 119

సహాయ ఓటర్ల నమోదు అధికారులు ఏ ఈ ఆర్ వో - 867

బీఎల్‌ఓ సూపర్‌వైజర్లు - 3,596

బూత్ స్థాయి అధికారులు బి ఎల్ ఓ- 35,985

ప్రస్తుతం ఉన్న ఓటర్ల వివరాలు రాష్ట్రంలో ప్రస్తుతం మొత్తం 3,39,24,664 మంది సాధారణ ఓటర్లు ఉన్నారు.

పురుష ఓటర్లు:1,68,18,902

మహిళా ఓటర్లు:1,71,02,883

థర్డ్ జెండర్ ( ఓటర్లు: 2,879

దివ్యాంగ ఓటర్లు (:5,22,946

యువ ఓటర్లు (18-19 సంవత్సరాలు): 8,18,605

సీనియర్ సిటిజన్లు (85౦ సంవత్సరాలు): 2,09,086

విదేశీ ఓటర్లు ():3,573

సర్వీస్ ఓటర్లు:15,900

ముందస్తు ఓటర్ల మ్యాపింగ్

రాష్ట్రంలోని మొత్తం ఓటర్లలో ఇప్పటివరకు 2,18,39,741 మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తయిందని, ఇది మొత్తం ఓటర్లలో 64.38% అని సీఈఓ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ ప్రత్యేక సవరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఈ కార్యక్రమంలో ఆర్డీవో వెంకటేష్, ములుగు తహసిల్దార్ విజయ భాస్కర్, ఎలక్షన్ సెల్ తహసిల్దార్ సలీం, డిప్యూటీ తహసిల్దార్ నితీష్ కుమార్ సంబధిత అధికారులు,తదితరు పాల్గొన్నారు.

# జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా ర్యాలీ...



తిరుపతి మే 16 "జాతీయ డెంగ్యూ దినోత్సవం" సందర్భంగా తిరుపతి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి.బాలకృష్ణ నాయక్ అధ్యక్షతన జిల్లా మలేరియా అధికారి డాక్టర్ జీ.కే. రూప్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయం నుండి వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు.ఈ ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ వి.బాల కృష్ణ నాయక్ జండా ఊపి ప్రారంభించారు. డెంగ్యూ వ్యతిరేక నినాదాలతో ర్యాలీ నిర్వహించి శ్రీ వేంకటేశ్వర వైద్య కళాశాల కూడలి వద్ద పద్మావతమ్మ నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది మరియు విద్యార్థినులు " మానవహారం నిర్మించి నినాదాలు చేశారు. విద్యార్థినులు, సిబ్బంది మరియు జిల్లా అధికారులతో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డెంగ్యూ వ్యాధి నిర్మూలనకు ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డి ఎం హెచ్ ఓ మాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి నిర్మూలన కొరకు అందరూ కలిసి కట్టుగా కృషి చేయాలని తెలిపారు. డెంగ్యూ వ్యాధిఈడిస్ ఈజిప్టై అనే దోమ కాటు వలన వస్తుందని, ఈ వ్యాధి వర్షాకాలంలో ఎక్కువగా వస్తుందని, ఈ వ్యాధి నియంత్రణకు ప్రజలందరూ ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, వాడి పడేసిన ప్లాస్టిక్ గ్లాసులు కొబ్బరి బోండాలు ప్లాస్టిక్ వస్తువులు ఇంటి పరిసరాల్లో లేకుండా చూసుకోవాలని, దోమలు కుట్టకుండా చూసుకోవాలని, ఇంటి కిటికీలకు జాలీలు ఏర్పాటు చేసుకోవాలని,దోమల బ్యాట్లు రిపలెంట్లు వాడాలని,పరిసరాల పరిశుభ్రత పాటించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్ కుమార్ , డిప్యూటీ డి ఎం హెచ్ ఓ డాక్టర్ శ్రీనివాసులు రెడ్డి, డిపిఎమ్ఓ డాక్టర్ చత్ర ప్రకాష్ రెడ్డి, ఎన్ సి డి ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రెడ్డి ప్రసాద్, స్టాటిస్టికల్ ఆఫీసర్ నాగేంద్ర కుమార్, డిప్యూటీ డెమో బలరామరాజు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, మలేరియా సబ్ యూనిట్ అధికారులు, ఎం పి హెచ్ ఈ ఓ లు,పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు,( మగ, ఆడ), కార్యాలయ సిబ్బంది, మరియు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు. ?

# దోమల నిర్మూలనతోనే ఆరోగ్య రక్షణ

## డెంగ్యూ నివారణలో ప్రతి కుటుంబం బాధ్యతగా ముందుకు రావాలి

## మేడ్చల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమా గౌరీ

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం మే 16:** జాతీయ కీటక జనిత రోగ నియంత్రణ కార్యక్రమం (ఎన్‌వీబీడీసీపీ) ఆధ్వర్యంలో జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నాగోల్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో విస్తృత అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్ జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమా గౌరీ, జిల్లా పర్యవేక్షణ అధికారి (డీఎస్‌వో) డాక్టర్ నాగరాజు, వసంతరెడ్డి హాజరై డెంగ్యూ నివారణ అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు.



ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, జీహెచ్‌ఎంసీ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, యువత, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. "డెంగ్యూ నివారణ మనందరి బాధ్యత", "దోమల నివారణతోనే ఆరోగ్య రక్షణ", "పరిశీలించండి -- శుభ్రం చేయండి -- మూతలు పెట్టండి" వంటి నినాదాలతో ర్యాలీ కొనసాగింది.

ర్యాలీ అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమా గౌరీ మాట్లాడుతూ డెంగ్యూ వంటి కీటక జనిత వ్యాధులు ప్రధానంగా నిల్వ నీటిలో పెరిగే దోమల ద్వారా వ్యాపిస్తాయని తెలిపారు. ప్రజల నిర్లక్ష్యం కారణంగానే డెంగ్యూ కేసులు పెరిగే అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా డెంగ్యూ వ్యాధిని చాలా వరకు అరికట్టవచ్చని చెప్పారు.ఇళ్లలో, ఇంటి చుట్టుపక్కల ఉన్న నీటి నిల్వలను తరచూ పరిశీలించాలని, నీటి డబ్బాలు, సిమెంట్ ట్యాంకులు, కుండీలు, బిందెలు, పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కూలర్లు వంటి ప్రదేశాల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారానికి కనీసం ఒకసారి నీటి నిల్వలను పూర్తిగా ఖాళీ చేసి శుభ్రం చేయాలని, వాటికి తప్పనిసరిగా మూతలు పెట్టాలని తెలిపారు.

డెంగ్యూ నివారణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులకు, పొరుగువారికి, సమాజానికి అవగాహన కల్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. డెంగ్యూ లక్షణాలైన తీవ్ర జ్వరం, తలనొప్పి, కళ్ల వెనుక నొప్పి, శరీర నొప్పులు, వాంతులు వంటి లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. స్వయంగా మందులు వాడకుండా వైద్యుల సలహా మేరకు చికిత్స పొందాలని ప్రజలకు సూచించారు.

ఈ సందర్భంగా డెంగ్యూ నివారణ ప్రతిజ్ఞ చేయించారు. "నేను మరియు నా కుటుంబం, నా సమాజ ఆరోగ్యం కోసం డెంగ్యూ వ్యాధిని నివారించేందుకు కట్టుబడి ఉంటాం. మా ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచి దోమల వృద్ధిని అరికడతాం" అంటూ ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు.


అనంతరం ఆరోగ్య శాఖ అధికారులు ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి డెంగ్యూ నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ గీత, డా.పవన్, డాక్టర్ సరస్వతి (వైద్యాధికారి, యూపీహెచ్‌సీ నాగోల్), ఉప జనగణనాధికారి వినోద్, సబ్ యూనిట్ అధికారులు వెంకటేశ్వర్లు, జీహెచ్‌ఎంసీ విన్ విభాగ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. అనంతరము డా.ఉమా గౌరి వారి టీం సభ్యులతో కలిసి నాగోల్ బండ్లగూడ ఏరియా లో వున్న పాలు ప్రైవేట్ ఆసుపత్రులను తనిఖీ చేయడం జరిగినది, అందులో భాగంగా బండ్లగూడ ఏరియా లోని రిజిస్ట్రేషన్ లేకుండా నడుపుతున్న పాలు ఓలీవ్ స్పీచ్ ఒ హియరింగ్ క్లినిక్, సురక్ష పాలిటెక్నిక్ క్లినిక్, లిటిల్ స్టార్ క్లినిక్, కేర్ డెంటల్ క్లినిక్, కౌసల్య పాలిటెక్నిక్ క్లినిక్, అక్క డెంటల్ క్లినిక్ లను సీజ్ చేయడం జరిగినది. ఈ తనిఖీ లలో అధికారులు వసంత రెడ్డి, డా.పవన్, డా.గీత పాల్గొన్నారు.

# మోడీ రెండవ దెబ్బ రాబోతోంది,సెక్షన్ 30 రద్దవ్వవచ్చు

## మోడీ హిందువులపై నెహ్రూ చేసిన ద్రోహాన్ని సరిదిద్దేందుకు పూర్తిగా సిద్ధమయ్యారుల.

## ధార 30" గురించి మీరు విన్నారా సెక్షన్ 30" అంటే ఏమిటో మీకు తెలుసా?

**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 16 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :**'సెక్షన్ 30 అనేది హిందువులకు వ్యతిరేకంగా నెహ్రూ అన్యాయంగా రాజ్యాంగంలో చేర్చిన చట్టం!నెహ్రూ ఈ చట్టాన్ని రాజ్యాంగంలో చేర్చడానికి ప్రయత్నించినప్పుడు,



సర్దార్ వల్లభభాయ్ పటేల్, తీవ్రంగా వ్యతిరేకించారు.సర్దార్ పటేల్ అన్నారు,, "ఈచట్టం హిందువులక ుద్రోహం; ఈచట్టాన్నిరాజ్యాంగంలో, తీసుకురాగానే, నేను కేబినెట్ మరియు కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేస్తాను,చివరికి, సర్దార్ పటేల్ ప్రతిఘటనకు నెహ్రూ తలొగ్గాల్సి వచ్చింది,కానీ దురదృష్టవశాత్తు, ఈ ఘటన తరువాత కొద్ది రోజులకే సర్దార్ వల్లభభాయ్ పటేల్, అనూహ్యంగా మరణించారు,సర్దార్ పటేల్ మరణం తరువాత, నెహ్రూ వెంటనే ఈ చట్టాన్ని రాజ్యాంగంలో చేర్చారు,సెక్షన్ 30 యొక్క లక్షణాల గురించి మీకు తెలియజేస్తాను,ఈ చట్టం ప్రకారం, హిందువులు తమ 'సనాతన ధర్మాన్ని' పాఠశాలల్లో లేదా కాలేజీల్లో బోధించరాదు, ,లేదా నేర్చుకోవరాదు,ఇది విచిత్రంగా అనిపించదా? ఈ సెక్షన్ 30" ప్రకారం, ముస్లింలు మరియు క్రైస్తవులు తమ మతపరమైన విద్య కోసం ఇస్లామిక్ (మదరసా) మరియు క్రైస్తవ (కాన్వెంట్) పాఠశాలలను నడపవచ్చు.కానీ హిందువులు తమ దేశ ప్రధాన మతమైన సనాతన ధర్మాన్ని మరియు సంస్కృతిని కాపాడడానికి వేదాధారిత గురుకులాలను లేదా సంప్రదాయ పాఠశాలలను నడపలేరు. అలాంటివి చేస్తే, వారిపై చట్టప్రకారం శిక్ష విధించబడుతుందిఅదనంగా, మసీదులు మరియు చర్చిల్లో,విరాళాల ద్వారా సేకరించిన అన్ని డబ్బు మరియు బంగారం కేవలం వాటి యాజమాన్యం కింద ఉంటాయి, వారు ఆ సంపదను తమ అలా యాయుల అభివృద్ధి కోసం మరియు అవగాహనలేని లేదా తక్కువ విద్య పొందిన హిందువులను ధన ప్రలోభాల ద్వారా మత మార్పిడికి ఉపయోగిస్తారు! అయితే, హిందూ దేవాలయాల్లో సేకరించిన డబ్బు మరియు బంగారం ప్రభుత్వ నియంత్రణలో ఉంటుంది! నెహ్రూ ఈ చర్యను గాంధీతో కలిసి హిందువులను మత మార్పిడికి ప్రోత్సహించడానికి చేశారు!,"సెక్షన్ 30" అనేది హిందువులపై వివక్షతతో కూడిన ఉద్దేశపూర్వక ద్రోహం!ముస్లిం పిల్లల కోసం తమ మత గ్రంథం, ఖురాన్ చదవడం మరియు నేర్చుకోవడం తప్పనిసరి, అదే విధంగా క్రైస్తవులకు కూడా! కానీ మన హిందువుల పరిస్థితి ఏమిటి? ఈ ప్రాచీన శాస్త్రంపై ఆధారపడిన ఏకైక మతం అయిన హిందూమతాన్ని సరిగ్గా అర్థం చేసుకునే పరిస్థితి కూడా మనకు లేదు!మనమందరం సనాతన ధర్మాన్ని కాపాడుకుందాం. ఈ వ్యాసాన్ని చదవండి, అర్థం చేసుకోండి, మరియు నెహ్రూ మరియు గాంధీ చేసిన కుట్రను అందరికీ తెలియజేయండి.ఈ సెక్షన్ 30 వల్లే మన సనాతన ధర్మ దేశంలో పాఠశాలల్లో మరియు కాలేజీల్లో భగవద్గీత బోధించలేముఈ వ్యాసం మీకు నచ్చితే, మరియు మీరు సనాతన ధర్మంపై విశ్వాసం మరియు ప్రేమను కలిగి ఉంటే, దయచేసి దీన్ని వీలైనంతగా షేర్ చేయండి.......

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com